11-6Pg1exHMNWJQE.qxdo/p:11-6Pg1exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Visakhapatnam, Hyderabad, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 131 పేజీలు: 12 వెల: 6.50

కాంగ్రెస్‌లో టిఎంసి విలీనం?
కుప్పకూలిన పాక్ సైనిక హెలికాప్టర్: 21 మంది మృతి
9లో



# ప్రజలే నా దేవుళ్లు

- పన్నెండేళ్లుగా అవినీతిరహితంగా సాగుతున్న పాలన
- కాంగ్రెస్ కుంభకోణాల పీడనుంచి దేశానికి విముక్తి
- ప్రధానిగా సుదీర్ఘకాలం నాకు దక్కిన అదృష్టం
- ఎన్డీయే పార్టీల సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశంలో గడచిన పన్నెండేళ్లనుంచి దేశానికి పట్టిన కాంగ్రెస్ పీడ విరగడయిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను ఎన్డీఎ సరిదిద్దుతోందన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపైనెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేలకోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. దేశ ప్రజలకు ఎన్డీయే పాలనపై విశ్వాసం రెట్టింపు అయిందని అన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఎ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఎ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్ల అని ఉద్ఘాటించారు. ఎన్డీఎలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఎనేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎన్డీఎ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. >>2



## చరిత్రలో మోడీది కొత్త అధ్యాయం

### నెహ్రూను దాటిన ఘనత ఆయనకే దక్కింది: రాష్ట్రపతి ముర్ము ప్రశంస

**న్యూఢిల్లీ,జూన్ 10:** ప్రధానిగా మోడీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ చారిత్రాత్మక మైలురాయి సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మోడీ నాయకత్వంపై దేశప్రజలకుఉన్న అచం >>2



## శక్తిమంతుడైన గొప్ప నాయకుడు మోడీ

### గత పన్నెండేళ్లలో మరింత మెరుగుపడిన ఇండో-యుఎస్ సంబంధాలు: ట్రంప్

**న్యూఢిల్లీ,జూన్ 10:** ఎన్డీయే పాలన 12 యేళ్లు పూర్తిచేసుకోవడంతో పాటు ప్రధానిగా నరేంద్ర మోడీ జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించిన రికార్డుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ స్పందిం చారు. ఏకకాలంగా 12 >>2

## దిగ్గజ దర్శకుడు భారతీరాజా ఇకలేరు



### దీర్ఘ అస్వస్థతతో చెన్నైలో కన్నుమూత

### పద్మశ్రీ సహా ఆరు జాతీయ పురస్కారాలు పొందిన బహుభాషా దర్శకుడు

### తమిళంలో కిళక్కు పోగుంరైల్, ముదల్ మరియాద్రై, తెలుగులో సీతాకోకచిలుక వంటి హిట్ చిత్రాలతో ఖ్యాతి

### ఘనంగా నివాళులర్పించిన తమిళ సిఎం విజయ్, తెలుగు సిఎంలు, పలువురు ప్రముఖులు

**చెన్నై,జూన్ 10:** దక్షిణాది చలనచిత్ర రంగంలో దిగ్గజ దర్శకునిగా వెలుగొందిన భారతీరాజా (85) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ భారతీ రాజా మృతి చెందారు. 1941 జులై 17న జన్మించిన భారతీ రాజా పదహారేళ్ల వయసు, సీతాకోక చిలుక, ఆరాధన సినిమాలకు జాతీయ అవార్డులు అందుకున్నారు. భారతీరాజా 1974లో చంద్రలీలను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కొడుకు మనోజ్ తాజ్ మహల్ చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. 2025 మార్చి 25న గుండెపోటుతో మనోజ్ మరణించారు. భారతీరాజా అసలు పేరు చిన్నస్వామి. ఆయన 1941 జూలై 17న తమిళనాడులోని తేని అల్లినగరంలో జన్మించారు. బాల్యం నుంచీ భారతీరాజా కళల పట్ల ఆకర్షితుడై >>2

# అమరావతికి వరాల జల్లు



సెంట్రల్ సెక్రటేరియట్ నమూనా

### రూ.1299.08 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం

### రూ.1234.91 కోట్లతో కేంద్ర ఉద్యోగుల క్వార్టర్లు

## 11టవర్లలో 1504 నివాస గృహాలు, కేంద్ర కేబినెట్ ఆమోదం

### ఇప్పటికే 22.53 ఎకరాలు కేటాయించిన సిఆర్‌డిఎ

**విజయవాడ, జూన్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనుల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సంబంధించి సిపిడబ్ల్యూడి ప్రతిపాదనలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ)ఆమోదం తెలిపింది. దీంతో అమరా వతిలో రూ.2,534కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కోసం రూ.1,299.08 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలకు రూ.1,234.91కోట్లు వెచ్చించనుంది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. అమరావతి కేంద్రంగా పని చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మల్టీస్టోరేజ్ నివాసాలు ఏర్పాటు చేయనున్నారు. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం ఇప్పటికే సిఆర్‌డిఎ 22.53 ఎకరాలు కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సెక్రటే రియట్, 17 ఎకరాల్లో నివాస సముదాయం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెటరీ మద్దతు ద్వారా భరించనుంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సిపిడబ్ల్యూడి) చేపట్టనుంది. ఇప్పటికే ప్రిబిడ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, టెండర్ పత్రాల రూపకల్పన ప్రక్రియ పురోగతిలో ఉందని ...ధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాజధాని అమరావతిలో కేంద్రం చేపడుతున్న మొట్టమొదటి జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జిపిఆర్ఎ)ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం. మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో ఈ జిపిఆర్ఎ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 11నివాస టవర్లను ఏర్పాటు చేసి, టైప్2 నుంచి టైప్ 6 వరకు వివిధ కేటగిరీలలో మొత్తం 1,504ఫ్లాట్లను నిర్మిస్తారు. ప్రాజెక్టులో భాగంగా 1,972కార్లు పార్క్ చేసుకునేలా బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30లక్షల చదరపు అడుగులుగా ఉంది. అమరావతిలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి తగిన నివాస సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. కార్యాలయాలకు సమీపంలోనే నివాసం ఉండటం వల్ల ఉద్యోగుల నైతిక స్థైర్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ప్రకటనలో వివరించారు.

ఈ ప్రాజెక్టును పూర్తిగా పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. కనీసం 4స్టార్ గ్రీహ (జిఆర్ఐహెచ్ఎ) రేటింగ్ సాధిం చేలా, ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, స్థానిక నిర్మాణ సామగ్రి వాడకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. క్యాంపస్‌లో బ్యాంకు, ఎటిఎం, పోస్టాఫీసు, కమ్యూనిటీ హాల్, ఫుడ్‌కోర్ట్, షాపింగ్ కాంప్లెక్స్, గెస్ట్‌హౌస్ వంటి అన్నిరకాల పౌర,సామాజిక సదుపాయాలు >>2



## ఉపాధి హామీ కింద రూ.7,700 కోట్లు

### ఎపి ప్రాజెక్టులపై ప్రధానికి సానుకూల దృక్పథం: కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**విజయవాడ,జూన్ 10. ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రమంత్రి పెమ్మసాని అమరావతికి వచ్చే ప్రాజెక్టులపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అమరావతి ప్రాజెక్టులపై ప్రధానికి సానుకూల దృక్పథం ఉందని చెప్పారు. అమరావతికి వచ్చే ఈ ప్రాజె క్టులను శుభశకునంగా భావిస్తు >>2

# విద్యుత్ స్టేషన్లు వడివడిగా పూర్తి



### లోవోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్‌స్టేషన్లు అవసరం

### అత్యవసర సేవలకు భూగర్భ కేబుల్ వ్యవస్థ: మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,జూన్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు. అలానే అత్యవసర సేవల విభాగాలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు భూగర్భ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సచివాలయంలో బుధవారం ఇంధన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ అంతరాయాల వల్ల రోగులు ఇబ్బందులు పడకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలోని సుమారు 30 ప్రధాన ఆస్పత్రుల్లో జనరేటర్ల పనితీరును సమీక్షించి, కరెంట్ నిలిచిపోయిన సమయంలో స్విచ్ ఓవర్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ చేపడుతున్న అన్ని అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో విద్యుత్ అంతరాయాల వల్ల భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరణ చేయడానికి సంబంధించిన అవకాశాలను పరిశీలించాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో ఎదురైన విద్యుత్ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి సారించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, ప్రజలపై అదనపు భారం మోపకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డైరెక్టర్లు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధిలో ముందడుగు

### ఎస్సీ విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట: మంత్రి బాలవీరాంజనేయస్వామి

**సచివాలయం,జూన్ 10,ప్రభాతవార్త:** అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించడానికి విద్యనే ప్రధాన ఆయుధంగా భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డి.బి.వి. స్వామి తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా పబ్లిసిటీ సెల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 5.4లక్షల మంది ఎస్సీ విద్యార్థులకు రూ.1,543.17కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ అందించామని తెలిపారు. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 2.51 లక్షల మంది విద్యార్థులకు రూ. 326.74 కోట్లు చెల్లించామని చెప్పారు. డీఎస్సీ కోచింగ్ కోసం రూ.4.78కోట్లు ఖర్చు >>2



బుధవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

## పోలీసులపై 'గంజాయి' దాడి

### ఆత్మరక్షణలో ఎస్ఐ గాలిలోకి కాల్పులు

### నలుగురు స్మగ్లర్లు అరెస్టు, పరారీలో నలుగురు

**పాడేరు, జూన్10,ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్లు తప్పించుకునీ పారిపోయే ప్రయత్నంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులపై రాద్దాడికి దిగటంతో పోలీసులు ఆత్మ రక్షణ కోసం గాల్లో కాల్పులు జరిపి..పారిపోతున్న నలుగు గంజాయి స్మగ్లర్లను చాకచక్యంగా పోలీసులు సంఘటన ప్రదేశంలో అదుపులోకి తీసుకిగా మరో నలుగురు తప్పించుకుని పారిపోయారని ఈ ఘటనలో ఒక కారును రెండు ద్విచక్ర వాహనాలతో పాటు రూ/1 కోటి నాలుగు లక్షల,52 వేల రూపాయలు విలువ గల 209 కేజీలు గంజాయి నీ పోలీసులుస్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్ వెల్లడించారు. బుధవారం పాడేరు జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఎస్పి అమిత్ బర్దర్‌వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాచింతపల్లి మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామారావు పాలెం జంక్షన్మేడూరు గ్రామ సమీపంలో అన్నవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్,సిబ్బందితో బుదవారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో లోతుగెడ్డ గ్రామం వైపు వెళ్తున్న ఒక కారులో ఇద్దరు వ్యక్తులు, రెండుద్విచక్ర వాహనాలపై మరో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిం చారు. దీంతో పోలీసులు వాహనాలను ఆపమని సంకేతాలు ఇవ్వగా అందులోని వ్యక్తులు పోలీసులను తప్పించుకునేందుకు ప్రయత్నించి, వాహనాలను అధిక వేగంతో పోలీసు సిబ్బంది వైపు ముందుకు దూసుకువచ్చారు. దీంతో పోలీసులు అడ్డగించడంతో వాహనాలను నిలిపివేసి అక్కడి నుంచి పరారయ్యేందుకు గంజాయి స్మగ్లర్లు యత్నించారు. అంతేకాకుండా వారు తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులపై రాళ్ళ దాడికి తెగబడ్డారని ఐతే పోలీసులు పలుమార్లు హెచ్చరించి రాళ్ళ దాడిని >>2

## రేపు తిరుపతిలో ఎన్డీయే భారీ సభ

### హాజరు కానున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, బిజెపి చీఫ్ మాధవ్, కేంద్రమంత్రులు



బుధవారం ఎన్డీయే సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

**తిరుపతి,జూన్ 10 ప్రభాతవార్తప్రతినిధి:** టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలుతీరు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించామని విస్తృతంగా ప్రచారం చేసుకోవడానికి తిరుపతిలో శుక్రవారం ఎన్‌డిఎ పార్టీల నేతలు బహిరంగసభ జరగనుంది. తిరుపతి రూరల్ తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఈ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. 9వతేదీ ఈ సభ వాయిదా పడిన విషయం విదితమే. తిరిగి శుక్రవారం ఉదయం జరగనుండటంతో బుధవారంరాత్రి వరకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల >>2

## మరో కొత్త ఎయిర్ పోర్టు!

### నెల్లూరు జిల్లా దగదర్తిలో ఏర్పాట్లకు రెడీ

### పది రోజుల్లో టెండరు ప్రక్రియ పూర్తి

**విజయవాడ,జూన్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదు పాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రజా రవాణాతో పాటు స్థానిక వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు రవాణా వ్యవస్థ కీలకం. ఈ నేపథ్యంలోనే, నెల్లూరు జిల్లా వాసుల దశాబ్దాల నాటి కల అయిన దగదర్తి విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మరో పది రోజుల్లోనే టెండర్ల ప్రక్రియను ముగించి, కాంట్రాక్టు సంస్థకు పనులను అప్పగించేందుకు సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రజా రవాణాతో పాటు స్థానిక వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు రవాణా వ్యవస్థ కీలకం. ఈ నేపథ్యంలోనే, >>2

# నేషన్ ఫస్ట్.. అదే మోడీ అజెండా

## ప్రపంచంలో భారత్‌ను ప్రాధాన్య దేశంగా నిలిపిన ఘనత ప్రధాని మోడీదే: సీఎం చంద్రబాబు



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి వెంకటేశ్వరుని ప్రతిమను అందిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్10,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశంగా భారతను నిలిపిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీ దన్నారు.వర్తమాన,భవిష్యత్తు తరాలకు ప్రయోజనం కలిగించే దిశలో ఆయన 12 పరిపాలన సాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఢిల్లీలో ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కలిసి అభినందించారు. రికార్డు స్థాయిలో ప్రధానిగా 12 ఏళ్ల ప్రస్థానాన్ని సాగించిన నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం .ఢిల్లీలో ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలనను,రాష్ట్రాలకు అందిస్తున్న సహకారాన్ని అభినందిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో అత్యంత సుదీర్ఘ కాలం పాటు ప్రధానిగా సేవలు దించడంపై చంద్రబాబు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతా తీర్మానాన్ని గౌరవ సభలో ప్రవేశపెట్టడం తమకు గౌరవంగా భావిస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. సరైన సమయంలో, సరైన స్థానంలో, సరైన నాయకుడిగా దేశానికి ప్రధానిగా మోదీ ఉన్నారు.ఒకవైపు దేశానికి స్థిరత్వాన్ని ఇచ్చే మార్గదర్శిగా, మరోవైపు కొత్త ఆలోచనలకు, నవ కల్పనలకు ప్రేరణనిచ్చే నాయకుడిగా పనిచేయడం మోదీ గొప్పతనం. 2001లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాటి నుంచి నేటి ప్రధాని పదవి వరకు 25 ఏళ్లుగా మోదీ ప్రజా జీవితంలో విశేషంగా సేవలు అందించారు. ప్రజల అంచనాలకు తగ్గట్టుగా నిలబడటం మోదీ నాయకత్వానికి ఉన్న ప్రత్యేకత. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో మోదీ పరిపాలన సాగించిన విధానాన్ని సీఎం అభినందించారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో మోదీ సఫలీకృతుడయ్యారని ప్రశంసించారు. తన 5 దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎందరో ప్రధానమంత్రులను చూశానని, కానీ మోదీ దేశ ప్రాచీన సాంస్కృతిక వైభవాన్ని ఆధునిక పాలనతో అనుసంధానించిన తీరు అద్భుతమని ప్రశంసించారు.వికసిత్ భారత్ **2047లక్ష్యం దిశగా:** ప్రస్తుత భౌగోళిక రాజకీయాలు, ఆర్థిక ఒప్పందాలు వంటి విషయాల్లో భారత్‌కు అనుకూలంగా ప్రపంచ దేశాలు తీసుకుంటున్న నిర్ణయాల్లో మోదీ పాత్ర కీలకమని వ్యాఖ్యానించారు. యోగాకు అంతర్జాతీయ గుర్తింపు సాధించి పెట్టడంలో మోదీ కృషిని సీఎం వివరించారు. ప్రపంచంలో భారతదేశాన్ని తిరుగులేని ఆర్థికశక్తిగా నిలిపేందుకు మోదీ వేస్తున్న వ్యూహాత్మక అడుగుల గురించి ప్రస్తావించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ అద్భుతశక్తిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 12 ఏళ్ల పాలనలో మోదీ తెచ్చిన డిజిటల్ విప్లవం గురించి విశ్లేషించారు. మోదీ నేతృత్వంలో దేశం వికసిత్ భారత్2047 లక్ష్యాలను చేరు కుంటుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజలే నా దేవుళ్లు

>> తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఎపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోడీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. ఇంటర్నెట్ యూజర్ల సంఖ్యను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచామని అన్నారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని ఆచరణలో చేసి చూపించామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.

సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోయిస్టులను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని, ఆర్టికల్ నంబర్ 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

# గొప్ప నాయకుడు మోడీ

>> యేళ్లు పూర్తిచేసుకున్న ప్రధానిమోడీని ట్రంప్ అభినందిస్తూ "మిత్రునికి శుభాభినందనలు. భారత్‌కు సుదీర్ఘకాలం పనిచేసిన చేస్తున్న ప్రధానమంత్రి నామిత్రుడు మోడీ" ఆయన ఒక గొప్ప నాయకుడు అని శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానిమోడీ శక్తివంతమైన గొప్ప నాయకుడని, అంతేకాకుండా ఆలోచనాశక్తి ఉన్న ప్రముఖ మేధావి అని కొనియాడారు. అమెరికా భారత్‌లమధ్య ఉన్న సంబంధాలు ఈ 12 యేళ్లకాలంలో మరింత పురోగమించాయని ఆయన ఈసందర్భంగా ప్రస్తావించారు. ఆయన మరింత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగి మరింత అభివృద్ధిలోకి తీసుకురావాలని ట్రంప్ ఆకాంక్షించారు.



బుధవారం చెన్నైలో భారతీరాజా భౌతికకాయం వద్ద నివాళులర్పించి విలపిస్తున్న తమిళ సిఎం విజయ్

# దిగ్గజ దర్శకుడు భారతీరాజా ఇకలేరు

>> సినిమా రంగంలో తన ఉనికిని చాటుకోవాలని తపించేవారు. దాంతో మదరాసుకు చేరి చిత్రసీమలో చేరేందుకు పలు పాట్లు పడ్డారు. తొలుత కన్నడ దర్శకుడు పుట్టన్న కణగల్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. తరువాత తెలుగు దర్శకులు పి.పుల్లయ్య వద్ద కొన్ని చిత్రాలకు పనిచేశారు. మళయాళ దర్శకుడు ఎమ్.కృష్ణన్ నాయర్ దగ్గర, తమిళ దర్శకుడు ఎ.జగన్నాథన్ చిత్రాలకూ అసోసియేట్ గా, కోడైరెక్టర్‌గా ఉన్నారు భారతీరాజా. నాలుగు భాషల దర్శకుల వద్ద పనిచేయడంతో భారతీరాజాకు దర్శకత్వంపై మంచి పట్టు లభించింది. తన ఊరికి సమీపంలోని వారే అయిన ఇళయరాజా, వారి సోదరులను కూడా చిత్రసీమలో అడుగు పెట్టేలా చేయడానికి భారతీరాజా ఎంతగానో సహకరించారు. ఇక భారతీరాజా తాను తీసే చిత్రం రెగ్యులర్ మూవీస్‌కు భిన్నంగా ఉండాలని ఎప్పుడూ తపించేవారు. ఆ తపనతోనే 1977లో విడుదలైన 16 వయతినిలే'చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి సంచలనం సృష్టించారు. ఆ చిత్రం సాధించిన ఘనవిజయంతో భారతీరాజా వైవిధ్యం కోసం సినీజనం పరుగులు తీశారు. భారతీరాజా రెండో చిత్రం కిళక్కే పోగుం రైల్ ఈ చిత్రం ద్వారా రాధికను నాయికగా పరిచయం చేశారు. ఇందులో మన తెలుగు నటుడు సుధాకర్ హీరోగా నటించారు. ఈ సినిమా మరింత విజయం సాధించింది. సుధాకర్‌కు తమిళనాట స్టార్ హీరోగా మారడానికి కారణమయింది. మూడో చిత్రం సిగప్పు రోజాక్కల్. ఇది సంచలన విజయం సాధించింది. కమల్, శ్రీదేవి నటించిన ఈ చిత్రం తెలుగులో ఎర్ర గులాబీలుగా అనువాదమై, ఇక్కడా విజయం సాధించింది. నాల్గవ చిత్రంగా 16 వయదినిలేను హిందీలో సోల్వా సావన్‌గా తెరకెక్కించారు భారతీరాజా. ఈ సినిమాతోనే శ్రీదేవి హిందీ చిత్రసీమలో అడుగుపెట్టింది. తెలుగులో భారతీరాజా రూపొందించిన సీతాకోక చిలుక చిత్రం ఎంత ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమా ద్వారా ముచ్చెర్ల అరుణ నాయికగా పరిచయమయింది. తెలుగులో కార్తిక్‌కు ఇదే తొలిచిత్రం. ఇక భారతీరాజా రూపొందించిన సస్పెన్స్ థ్రిల్లర్ టిక్ టిక్ టిక్ కూడా అప్పటి యువతరాన్ని ఆకట్టుకుంది. తెలుగులో యువతరం పిలిచింది, ఈతరం ఇల్లాలువంటి చిత్రాలు రూపొందించారు. అవి అంతగా ఆకట్టుకోలేక పోయాయి. కృష్ణతో జమదగ్ని, చిరంజీవితో ఆరాధన రూపొందించారు భారతీరాజా. ఆరు జాతీయ పురస్కారాలు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డులు, పలు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నా రాజాను భారతీయ సినీ రంగానికిచేసిన సేవలకు గుర్తింపుగా 2004లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. నాలుగు దశాబ్దాలకు పైగా తమిళ సినీ పరిశ్రమలో తన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను అలరించిన భారతీరాజా భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే దర్శకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.

**ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు...**

భారతీరాజా అంత్యక్రియలు పూర్తిప్రభుత్వ లాంఛనాలతో జరుగుతాయనిసీఎం విజయ్‌ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇదిలా ఉండగా భారతీ రాజా నివాసానికి చిత్రరంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు తరలివచ్చారు. సిఎం విజయ్ భారతీరాజా నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయంవద్ద నివాళులర్పించారు. మాజీ సిఎం స్టాలిన్, ఉదయనిధి మారన్, కమల్‌హసన్,సూర్య వంటి దిగ్గజనటులు, దర్శకులు భారతీ రాజా నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆయన దర్శకత్వంలో నటించిన హీరోహీరోయిన్లు, నేటితరం నాయికలు పలువురు భారతీరాజాకు ఘనంగా నివాళులర్పించారు.

# చరిత్రలో మోడీది కొత్త అధ్యాయం

చలమైన నమ్మకానికి ఈ సుదీర్ఘ పాలనే నిదర్శనమని రాష్ట్రపతి కొనియాడారు. ఆయన హయాంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోందని, అట్టడుగు స్థాయి ప్రజలకు సైతం సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా ఆదివాసీల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎంజన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ వంటి పథకాలకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్మ వెల్లడించారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని మోదీ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారని, ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారత ప్రజాస్వామ్యంపై నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. భారత రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని ప్రధానిమోడీ లిఖించారు. దేశ ప్రధానిగా నరేంద్ర దామోదరదాస్ మోడీవరుసగా అత్యధిక కాలం పాలించిన అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించి మోడీ ఈ ఘనత సాధించారు. 2014మే 26న తొలిసారి బాధ్యతలు చేపట్టిన మోదీ, నేటితో (బుధవారం) ప్రధానిగా వరుసగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో నెహ్రూ ఎన్నికైన ప్రధానిగా వరుసగా 4,398 రోజులు (1952 మే 13 నుండి 1964 మే 27 వరకు) పనిచేయగా ఇప్పుడు మోడీఆ రికార్డును దాటేశారు. ఈ జాబితాలో ఇందిరాగాంధీ (4,077 రోజులు) మూడో స్థానంలో ఉన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో ఎన్డీయే సమావేశం సందర్భంగా అల్పాహారం స్వీకరిస్తున్న ప్రధాని మోడీ, తదితరులు

# అభివృద్ధిలో ముందడుగు

>>చేసి 2,000మందికి శిక్షణ ఇవ్వగా,వారిలో 331మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని వెల్లడించారు.ఆర్ఆర్‌బి,ఎస్ఎస్‌సీ కోచింగ్ ద్వారా మరో 32మంది ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు.సివిల్స్,గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు చేపట్టామని,340మందికి ఆరు నెలల రెసిడెన్షియల్ కోచింగ్,50మందికి ఆన్‌లైన్ శిక్షణ అందించామని చెప్పారు.నర్సింగ్ పూర్తి చేసిన 200మంది విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాల కోసం జర్మన్ భాష శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,002హాస్టళ్ళలో 1.75లక్షల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని,వీరి కోసం రూ.916కోట్లు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు.టెన్త్‌లో 85.32 శాతం, ఇంటర్మీడియట్‌లో 72.3శాతం ఉత్తీర్ణత సాధించడం హాస్టళ్ళలో అందిస్తున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమన్నారు.

# మరో కొత్త ఎయిర్ పోర్టు!

>> నెల్లూరు జిల్లా వాసుల దశాబ్దాల నాటి కల అయిన దగదర్తి విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మరో పది రోజుల్లోనే టెండర్ల ప్రక్రియను ముగించి, కాంట్రాక్టు సంస్థకు పనులను అప్పగించేందుకు సిద్ధమైంది. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని దగదర్తి వద్ద ఈ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు 1400 ఎకరాల భూమిని కేటాయించింది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ విధానంలో రూ. 648 కోట్ల అంచనా వ్యయంతో దీనిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల షెడ్యూల్ ఖరారు అయ్యింది. టెండర్ల దాఖలుకు చివరి తేదీ జూన్ 12గా నిర్ణయించారు. టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లను జూన్ 17న ఓపెన్ చేయనున్నారు. పనుల కేటాయింపు ప్రక్రియ బిడ్డింగ్‌లో అర్హత సాధించిన సంస్థకు 15 రోజుల్లోగా నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తారు. దగదర్తి ఎయిర్‌పోర్ట్‌కు కేంద్ర హోంశాఖ, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖల నుంచి ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయి. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే పనులు ప్రారంభించి, 202829 ఆర్థిక సంవత్సరం నాటికి మొదటి దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష ్యంగా పెట్టుకుంది. ఈ తొలి దశలోనే రన్‌వే, ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, కార్ పార్కింగ్, షాపింగ్ ఏరియా వంటి మౌలిక వసతులను సిద్ధం చేస్తారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే కేవలం నెల్లూరు జిల్లాకే కాకుండా, పొరుగున ఉన్న ప్రకాశం, కడప జిల్లాల ప్రయాణికులకు సైతం ఎంతో అనుకూలంగా మారనుంది. రోజుకు దాదాపు 2,200 మంది ప్రయాణికులు సేవలు పొందేలా దీనిని డిజైన్ చేస్తున్నారు. నిత్యం 27 విమానాలు రాకపోకలు సాగించేలా అత్యాధునిక వసతులతో ఈ ఎయిర్‌పోర్ట్‌ను తీర్చిదిద్దనున్నారు. దగదర్తి విమానాశ్రయం సాకారమైతే దక్షిణ ఆంధ్రాలో పారిశ్రామిక ప్రగతి, ఉపాధి అవకాశాలు సరికొత్త పుంతలు తొక్కడం ఖాయం. నెల్లూరు ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు త్వరలోనే తెరపడనుంది.

# పోలీసులపై 'గంజాయి' దాడి

>> నిలిపివేసి లొంగిపోవాలని సూచించినప్పటికీ స్మగ్లర్లు తమ హింసాత్మక చర్యలను రాళ్ళ దాడిని కొనసాగించదంతో పోలీసులు ఆత్మ రక్షణ నిమిత్తం గాలిలోకి కాల్పులు జరుపుతూ స్మగ్లర్లకు హెచ్చరించడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకుని నిందితులను పట్టుకునే ఉద్దేశ్యంతో ఎస్సై గాల్లో హెచ్చరిక చేస్తూ కాల్పులు జరిపారనీ ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. సంఘటనా ప్రదేశంలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు అక్కడ నుంచి ప్రారయ్యారని ఎస్పీ తెలిపారు.రాళ్ల దాడిలో ప్రభుత్వ వాహనం కూడా నష్టం వాటిల్లిందన్నారు.గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన నలుగురు స్మగ్లర్లకు అరెస్టే చేశామని అరెస్ట్ చేసిన వారిలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అర్జున్ కుమార్,విశాఖపట్నం జిల్లా కు చెందిన ఇమ్రాన్ ఖాన్, ఒడిశా రాష్ట్రంమల్కన్గిరి జిల్లా చెందిన కిషాణ ఖారా,చింతపల్లి మండలం బలపం గ్రామానికి చెందిన పాంగి శ్రీను అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న:నలుగురు నిందితులను గుర్తించగా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నని ఎస్పీ తెలిపారు.పదిబండిల్స్ తో ఉన్న 209.04 కిలోల గంజాయి ఆస్తి విలువ కోటి నాలుగు లక్షల,52 వేల రూపాయలని ఎస్పీ తెలిపారు.అలాగే ఒక కారు,రెండు పల్సర్ బైకులు,స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. నలుగురు స్మగ్లర్లను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ,సిబ్బందిని అభిందిస్తూ త్వరలో రివార్డులు అందజేయనున్నారు ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు.జిల్లాలో గంజాయి జీరో సాగులో ఉందని అయితే గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టడంతో అంతర్ రాష్ట్రాల్లో స్మగ్లర్ల ముఠా వివరాలు బయట పడుతున్నాయని వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించ నున్నట్టు ఎస్పీ స్పష్టం చేసారు.ఈ సమావేశంలో చింతూరు ఎ ఎస్ పంకజ్ కుమార్ మీనా పాల్గొన్నారు.




# అమరావతికి వరాల జల్లు

>> ఉంటాయి. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యే కంగా అవరోధ రహిత వాతావరణాన్ని కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. నిర్మాణ దశలో ఏటా సుమారు 7 లక్షల పనిదినాలు, ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్వహణ దశలో ఏటా 50,000 పనిదినాల ఉపాధి కలుగుతుందని కేంద్రం తెలిపింది.

# ఉపాధి హామీ కింద రూ.7,700 కోట్లు

>>స్తున్నామన్నారు. ఏపీకి ఉపాధిహామీ నిధుల కింద రూ.7,700 కోట్లు ఇచ్చారని తెలిపారు. దేశంలోనే ఎక్కువ నిధులు దక్కించుకున్న 3 రాష్ట్రంగా ఏపీ నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. తక్కువ జనాభా ఉన్నా కొన్ని కారణాల వల్ల ఎక్కువ నిధులు దక్కాయని ఆయన అన్నారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ భవనాల పూర్తికి మూడేళ్లు పట్టవచ్చన్నారు. భూమి ఒక్కటే రాష్ట్రం ఇచ్చిందని, భవనాల ఖర్చు పూర్తిగా కేంద్రానిదేనని పెమ్మసాని పేర్కొన్నారు.టైర్2, టైర్3 కింద వివిధ రకాల భవనాలను కేంద్రం నిర్మిస్తుందని, అమరావతి బిల్లు, సెంట్రల్ సెక్రటేరియట్, ఔటర్ రింగ్‌రోడ్ కీలకమని వెల్లడించారు. సీఎం చంద్రబాబుతో కలిసి ఈ 3 కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కట్టే కాంప్లెక్సులు అధునాతన భవనాలు ఇవన్నీ రాత్రికి రాత్రి రాలేదని, ఎంతో కష్టపడితేనే వచ్చాయని పెమ్మసాని తెలియజేశారు.రెండు భారీ టవర్లలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారని వివరించారు. అలాగే 1,800 కార్ల పార్కింగ్ సదుపాయంతో ఈ ఆధునిక కార్యాలయ సముదాయం నిర్మితమవుతుందని చెప్పారు. రూ.1,234 కోట్లతో 17 ఎకరాల్లో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తారని తెలిపారు. 11 టవర్లలో 1,568 నివాస క్వార్టర్లు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, కమ్యూనిటీ హాల్స్, ఆధునిక సదుపాయాలతో గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు అవుతుందని కేంద్ర మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 2018లో ఈ ప్రతిపాదన చేస్తే 2024 తర్వాత ఇది వేగంగా ముందుకు సాగుతుందని చెప్పారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, ఆర్థిక శాఖల సహకారంతో ఈ ప్రాజెక్ట్‌కు ఆమోద ముద్ర పడిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

# రేపు తిరుపతిలో ఎన్డీయే భారీ సభ

>> సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు ఇతర జిల్లా యంత్రాంగం స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించి పూర్తిచేశారు. సుమారు 30వేలమందికిపైగా పాల్గొనే ఈ సభలో జనానికి సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, బిజెపి చీఫ్ మాధవ్, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొంటున్నారు. పూర్తిఏర్పాట్లులో అధికారులు తలమునకలయ్యారు. ప్రముఖుల పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగు నీరు, పారిశుద్ధం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు మరియు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని అన్నారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండేళ్ళ ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం నేపథ్యంలో సభా స్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ,జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలోని వేదిక, ప్రజల కూర్చునే ప్రాంతాలు, వాహనాల పార్కింగ్, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర సేవల ఏర్పాట్లను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా పరంగా ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షి స్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# భారతీరాజా మరణం బాధాకరం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రఖ్యాత సినీ దర్శకుడు భారతీరాజా మరణం బాధాకరమని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు చిరస్మరణీయ చిత్రాలను ఆయన అందించారని, భారతీయ సినీ రంగానికి ఆయన మరణం తీరని లోటని అన్నారు. భారతీ రాజా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని, భారతీరాజా కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీఎం అన్నారు.

**డి.సిఎం పవన్ సంతాపం**

ప్రముఖ దర్శకులు భారతీరాజా మృతిపట్ల పవన్ కల్యాణ్‌సంతాపం ప్రకటించారు. ఆయన మృతిపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీ రాజా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన సీతాకోకచిలుక ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పవన్ తెలిపారు.

**సిపిఎం సంతాపం:** భారతీరాజా మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ ఘన నివాళులర్పించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళ, తెలుగు భాషల్లో జనాదరణ పొందిన అనేక అభ్యుదయ, సందేశాత్మక చిత్రాలను భారతీరాజా అందించారని కొనియాడారు. వెండి తెరకు ఎంతో మంది నూతన నటీనటులను పరిచయం చేసిన ఆయన కృషి మరువలేనిదని, భారతీరాజా మరణం కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంతాపం**

ప్రముఖ దర్శకుడు, నటుడు, నిర్మాత భారతీ రాజా మృతిపట్ల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంతాపం వ్యక్తం చేసింది. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, కార్యదర్శి అశోక్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. దక్షిణాదిచిత్రాలకు జాతీయ స్థాయి తెచ్చిన ఘనత భారతీరాజాదని వ్యాఖ్యానించింది.

# నేడు కాంగ్రెస్ అత్యవసర సమావేశం

## పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌-చార్జులు, పిసిసి అధ్యక్షులకు ఆహ్వానం

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు వీలుగా గురువారం కాంగ్రెస్ పార్టీ అత్యవసరం సమావేశం ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. "ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు రేపు, జూన్ 11, 2026న న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఎఐసిసి జనరల్ సెక్రటరీలు, ఇన్‌చార్జ్‌లు, పిసిసి అధ్యక్షుల అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కీలక సమావేశానికి ఐఎన్‌సి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహిస్తారు" అని తెలిపారు. జూన్ 8న జరిగిన ఇండియా బ్లాక్ సమావేశం జరిగిన కొద్ది రోజులకే కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించాలనే నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

11-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
ఏకాదశి రా.10.31
రేవతి ఉ.8.14
వర్జ్యం : రా.2.45 - తె.4.14
దు.ఉ.9.56-ఉ.10.48. 2)మ.3.11-సా.4.03
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి.వివాదాలకు దూరంగా ఉండండి.

**మిథునం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కర్కాటకం:** సంతాన విద్యావిషయంలో జాగ్రత్తలు అవసరం. మంచితనంతో అందరినీ ఆకట్టుకుంటారు.వాహనసౌఖ్యం.

**సింహం:** ఆర్థిక పరిస్థితి కొద్దిపాటి ఒడిదుడుకులుగా ఉంటుంది. కుటుంబసభ్యుల సహాయం అందుకుంటారు.వస్త్రలాభం.

**కన్య :** వ్యాపారాలు పురోభివృద్ధిలో ఉంటాయి. పరిశ్రమలలో ఏర్పడిన అవరోధాలు తొలగుతాయి.

**తుల :** ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది. వస్త్రలాభం.

**వృశ్చికం:** కొన్ని పనులు అప్రయత్నంగా పూర్తి కాగలవు. వివాహయత్నాలు సాగిస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఖర్చులు అదుపు చేసుకోవడానికి ఎంత గానో కృషి చేస్తారు. శుభవార్తలు.

**మకరం:** కోపతాపాలకు దూరంగా ఉండండి. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు. బంధువుల కలయిక.

**కుంభం:** వృత్తి ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఎదురు చూడని అవకాశాలు లాభిస్తాయి.

**మీనం:** ముఖ్య సమాచారం అందుకుంటారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

11-6Pg3exHMNWJQEOCB.qxd:11-6Pg3exHMNWJQEOCB.qxd 1/1/02 6:28 AM Page 1



## తిరుమల సమాచారం



### గరుడునిపై వేణుగోపాలుడు

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరం రుక్మిణి- సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం రాత్రి స్వామి గరుడవాహనంపై అధిరోహించి భక్తులను కటాక్షించారు. గరుడవాహనం అత్యంత విశిష్టమైనది. గరుడునిపై వేణుగోపాలుడు కలియుగంలో భక్తులకు తానున్నానంటూ అభయమిచ్చాడు. ఉదయం స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అలరించారు. వాహనసేవకు ముందుగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో భక్తిరసాన్ని పంచగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



### శ్రీవారి సేవలో విద్యాప్రసన్నతీర్థస్వామి

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దక్షిణ కర్ణాటక కుక్కే సుబ్రమణ్యమఠం పీఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి తన శిష్యులతో బుధవారం తిరుమలకు వచ్చారు. శ్రీవారి ఆలయం మహద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయం లోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన స్వామి ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన మన్నెం వెంకటశ్రీకాంత్ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిని అందజేశారు.



### ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి

● తొండవాడ ముక్కోటి ఆలయంలో మాజీ సిజెఐ ఎన్‌వి రమణ

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం తొండవాడలోని ముక్కోటి ఆలయాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ దంపతులు దర్శించుకున్నారు. బుధవారం ఎన్వీ రమణ దంపతులు ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ వర్గాలు స్వాగతం పలికాయి. ఆనందవల్లీదేవీ సమేత అగస్త్యేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయంలో జస్టిస్ ఎన్‌వి రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం ఉన్న అగస్త్యేశ్వర స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ విశిష్టతను, ఆధ్యాత్మికతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. స్వామి కృపతో దేశ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ అభివృద్ధికి, పరిసరాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని జస్టిస్ ఎన్‌వి రమణ పిలుపునిచ్చారు.

# దేశ నిర్మాణంలో యువతే కీలక శక్తి

● శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ● దేశాభివృద్ధికి దోహదపడే పరిశోధనలు అవసరం: అజయ్ కుమార్ సూద్ ● ఆధునిక విద్య, పరిశోధనలో ఎస్‌వియు ముందంజ : ఉపకులపతి టాటా నరసింగారావు

● గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న తుడా ఛైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి

**తిరుపతి విద్య, జూన్ 10 ప్రభాతవార్త:** స్నాతకోత్సవం కేవలం పట్టాల ప్రదాన కార్యక్రమం మాత్రమే కాదని, జ్ఞానం, పట్టుదల, క్రమశిక్షణ, ఆశయాలు, విజయాల వేడుక అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎదుగుతున్న తరుణంలో యువత భవిష్యత్ ఉద్యోగులుగానే కాకుండా ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, దేశ నిర్మాణకర్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 63వ నుంచి 68వ ఉమ్మడి స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం చేశారు. ప్రపంచ విజ్ఞాన, సాంకేతిక, వైద్య, పరిశోధన రంగాల్లో భారతీయులు తమ ముద్ర వేస్తున్నారని గవర్నర్ తెలిపారు. భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, సంపాదించిన జ్ఞానాన్ని సమాజ శ్రేయస్సు, మానవాళి అభ్యున్నతికి వినియోగించాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీ, మైక్రోనానో శాటిలైట్ టెక్నాలజీ, నానోటెక్నాలజీ, భూ విజ్ఞానశాస్త్రం తదితర రంగాల్లో ఎస్‌వీయూ చేస్తున్న పరిశోధనలు ప్రశంసనీయమన్నారు. డ్రోన్ పైలట్ శిక్షణ కోసం డీజీసీఏ నుంచి రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ గుర్తింపు పొందడం విశ్వవిద్యాలయం సాధించిన మరో మైలురాయిగా అభివర్ణించారు. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు అజయ్ కుమార్ సూద్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి దోహదపడే పరిశోధనలే నేటి అవసరమన్నారు. వాతావరణ మార్పులు, ఆరోగ్య సవాళ్లు, డిజిటల్ పరివర్తన వంటి అంశాలపై అంతరశాఖ పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి ఆధ్యాత్మికతకు కేంద్రంగా ఉంటే, ఎస్‌వీయూ విజ్ఞానం, ఆవిష్కరణలు, పరిశోధనలకు వేదికగా నిలుస్తోందని



పేర్కొన్నారు. ఎస్‌వీయూ ఉపకులపతి టాటా నరసింగారావు మాట్లాడుతూ 1954లో స్థాపితమైన విశ్వవిద్యాలయం విద్య, పరిశోధన, సామాజికాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. జాతీయ విద్యా విధానం- 2020లో భాగంగా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, క్లౌడ్ టెక్నాలజీస్ వంటి ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. నాక్ ఎ+ గ్రేడ్ సాధించడం, జాతీయ స్థాయిలో పరిశోధన ర్యాంకుల్లో గుర్తింపు పొందడం విశ్వవిద్యాలయ ప్రగతికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు అజయ్ కుమార్ సూద్, భారత జాతీయ విజ్ఞాన అకాడమీ అధ్యక్షుడు శేఖర్ సి. మండే, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎం. ఎల్లాలకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు.

అలాగే తుడా ఛైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి ఎస్‌వీయూ ఎకనామిక్స్ విభాగంలో చిత్తూరు జిల్లాలోని కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు అంశంపై నిర్వహించిన పరిశోధనకు గాను గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. స్నాతకోత్సవంలో 502 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 260 మంది ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. మొత్తం 5,573 మంది అభ్యర్థులకు పట్టాలు, 143 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి, రెక్టార్ ఆచార్య సిహెచ్.అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు, వివిధ విభాగాల డీన్లు ఆచార్య సుందరవల్లి, ఆచార్య రామకృష్ణారెడ్డి, ఆచార్య రాజేశ్వరమ్మ, ఆచార్య విజయం సారథిరెడ్డి, ఆచార్య మల్లికార్జున రావు, ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య శివశంకర్ రెడ్డి, ఆచార్య మోహన్ రెడ్డి, యస్వీయూ పాలకమండలి ఆచార్య సుగుణమ్మ, ఆచార్య సుమకిరణ్, ఆచార్య మంజుల, డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, జ్యోతి, సంధ్య, నారాయణ బాబు, అకడమిక్ సెనేట్ మెంబర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆచార్య రాళ్ళపల్లి రామమూర్తి, ఆచార్య ప్రభాకరరావు, ఆచార్య ఎం.ఎం. నాయుడు తదితరులు హాజరయ్యారు. పరీక్షల డీన్ ఆచార్య సురేంద్ర బాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాజమాణిక్యం పాల్గొన్నారు.

# ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం విధ్వంసం

● మెగా డిఎస్సీపై వైకాపా కుట్రలు ● ప్రజలకు జవాబుదారితనంగా కూటమి పాలన: మంత్రి కొల్లు రవీంద్ర

**కాణిపాకం, జూన్ 10 ప్రభాతవార్త:** ఐదేళ్ళ వైకాపా పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిందని రాష్ట్ర భూగర్భ గనులు, ఆబ్కారిశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకునా న్నరు. అనంతరం పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్‌లతో కలసి విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ళ వైకాపా పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యమై పోయాయని, రైతులు, యువత తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అయితే ఈరెండేళ్ళలో కూటమి ప్రభుత్వం అన్ని అధిగమించి అని న వర్గాలకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు ఈమేరకు గత ఏడాది మామిడి రైతులకు ప్రభుత్వం ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి పంటను కొనుగోలు చేసి ఆదుకున్నట్లు తెలిపారు. అయితే కుట్రపూరితమైన మనస్థత్వం కలిగిన మాజీ సీఎం జగనో మ్మహన్‌రెడ్డి దీన్ని కూడా రాజకీయం చేయాలని ప్రయత్నించినట్లు మంత్రి తెలిపారు. అలాగే చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి 16,300 మందికి ఉపాధ్యాయులుగా ఉద్యోగ అవకాశాలు కలి ్పస్తే వైకాపా మెగా డీఎస్సీపై లేనిపోని రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర దుయ్యబట్టారు. అలాగే మెగా డీఎస్సీ అని, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అని జగన్ ప్రకటించినా ఐదేళ్ళలో ఏమి చేయలేదని అన్నారు. అయితే ప్రతి కార్యక్రమంలో ఉద్దేశ్య పూర్వకంగా కులాలు, మతాలు మధ్య లేనిపోని రెచ్చగొటే ్ట కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో భయాందోళనలు





కాణిపాకంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి, శ్రీసిటి వంటి ప్రాంతాల్లో పెద్దఎత్తున పరిశ్రమల స్థాపనకు లక్షల కోట్లు పెట్టుబడులు వస్తునా న్నయని తద్వారా యువతకు ఉదో ్యగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో సాధించిన విజయాలు, సూపర్‌సిక్స్, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించేందుకు తిరుపతిలో త్వరలో సీఎం సభను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టో మేరకు 90 శాతం హామీలను అమలు చేశామని, రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు దృష్ట్యా మిగిలిన కార్యక్రమాలను త్వరలో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇదిలా వుండగా జిల్లాలో మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున ప్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు జవాబుదారితనంగా వుండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల నుండి వచ్చిన అర్జీలను పారదర్శకంగా ఆన్‌లైన్‌లో వుంచుతున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే గత ప్రభుత్వంలో ఎక్సైజ్‌శాఖను విచ్చలివిడి చేశారని తెలిపారు. దీనితో నూతన ఎక్సైజ్‌పాలసీని తీసుకురావడంతో ఆదాయం గణనీయంగా పెరిగిందని. అలాగే వినియోగదారులకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ రేటుకు అందిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈవిలేకరుల సమావేశంలో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బిసి సంక్షేమ సంఘం నాయకులు షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష

పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల అభివృద్ధిపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్‌లు చర్చించారు. కాణిపాకం పర్యటను విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యేలు స్థానిక దేవస్థానం అతిథి గృహంలో కలసి ఆలయ అభివృద్ధి, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని అమరావతిలో సెంట్రల్ గవర్నమెంట్ సెక్రటేరియట్

● కేంద్ర కేబినెట్ నిర్ణయంపై సిఎం చంద్రబాబు హర్షం

● ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకామడేషన్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్‌కు ప్రధాని నరేంద్రమోడీకి 'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాతినిధ్యాన్ని మరింత పెంచేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆధునిక, పర్యావరణ అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఆమోదం తెలపడం అమరావతి అభివృద్ధిలో మరొక కీలకమైన అంశం' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాజధానిగా అమరావతి అభివృద్ధికి, భవిష్యత్తు వృద్ధికి అవసరమైన పరిపాలనా మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రాజెక్ట్ ఊతమిస్తుంది. ఎపిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోటకు తీసుకరావడం ద్వారా పాలనను సులభతరం అవుతుందన్నారు. అమరావతికి కేంద్రం అందిస్తున్న చేయూతను, సహకరిస్తున్న తీరుకు ఈ నిర్ణయం అద్దం పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## రాజధాని ప్రాంతంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా ఇళ్లకు గ్యాస్ సరఫరా

● సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంతంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా ఇళ్లకు గ్యాస్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు చెప్పారు. విద్యుత్ సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. గ్రామస్థులు అడిగిన సమస్యలన్నీ నెల రోజుల్లో పూర్తి చేస్తామని కమిషనర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తుళ్లూరు మండలం వెలగపూడిలో రహదారుల నిర్మాణం కోసం భూసేకరణ కింద తీసుకుని పొలాలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్రామంలో సక్రమంగా మంచి నీరు విద్యుత్ సరఫరా జరగడం లేదని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్లాట్ల అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు సక్రమంగా చేయటం లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తారు. తన ఛాంబర్‌కు వచ్చి కలవాలని కాంట్రాక్ట్ సంస్థకు చెందిన సిబ్బందిని ఆదేశించారు.

## విబి జి రామ్ జి పథకం కింద ఎపికి రూ.7,707.21 కోట్ల నిధులు కేటాయింపు

● కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపిన డి.సిఎం



**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విబి జి రామ్ జి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,707.21 కోట్ల తాత్కాలికంగా కేంద్రం కేటాయించింది. డిప్యూటీ సిఎం పవన్ ఎక్స్ వేదికగా స్పందించారు. దేశంలోనే మూడో అత్యధిక నిధులను ఎపి పొందిందని తెలిపారు. ఇది పారదర్శక పాలన, సమర్థవంతమైన అమలు పట్ల తమ నిబద్ధతకు ఓ బలమైన నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ మద్దతు గ్రామీణ పరివర్తనను వేగవంతం చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుందని, జీవనోపాధిని మెరుగుపరుస్తుందని చెప్పారు. ఎపి, దేశాభివృద్ధి కోసం కఠోర శ్రమతో ఊపిరి పోస్తున్న రైతులు, మహిళలు, యువత, శ్రామికులకు ఇది మరింత మెరుగైన అవకాశాలను కల్పిస్తుందని పవన్ అన్నారు. దూరదృష్టితో కూడిన నాయకత్వం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రధానమంత్రికి పవన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌పై నిరంతర మద్దతు, నమ్మకాన్ని ఉంచినందుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దివ్యాంగురాలిపై దాడి... నిందితుడు అరెస్టు

**విశాఖపట్నం(భీమునిపట్నం), జూన్ 10 ప్రభాతవార్త:** గ్రామదేవత ఉత్సవాల ఆనందం ఓ కుటుంబానికి విషాదంగా మారింది. మేధో వైకల్యం కలిగిన 24 ఏళ్ల యువతి పండుగ సందడిలో కనిపించకుండా పోవడం, అనంతరం ఆమెపై దారుణం జరిగినట్లు వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఆ యువతి గ్రామదేవత ఉత్సవాలకు వెళ్లిన సమయంలో కనిపించకుండా పోయింది. కుమార్తె కనిపించకపోవడంతో తల్లి కుటుంబ సభ్యులు రాత్రంతా గాలింపు చేపట్టారు. పోలీసు సిబ్బంది కూడా అన్వేషణలో పాల్గొన్నారు. యాతకుమారిపాలెంలోని సుఖీభవ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో యువతి గుర్తించబడింది. బాధితురాలి వాంగ్మూలం మేరకు ఇద్దరు వ్యక్తులు ఆమెను ఉత్సవాల వద్ద నుంచి బలవంతంగా తీసుకెళ్లి దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పోలీసులు ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది. బాధితురాలికి అవసరమైన వైద్య, న్యాయ సహాయ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# రాష్ట్ర పురోభివృద్ధికి అధికార, ప్రతిపక్షాలు సహకరించుకోవాలి

● రాష్ట్రం కోసం రాజకీయాలకు అతీతంగా సమష్టి కృషి అవసరం

● శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు

**జగ్గయ్యపేట,పెనుగంచిప్రోలు, జూన్ 10 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రయోజనాలకై అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలకు అతీతంగా సమిష్టి కృషి చెయ్యాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసివున్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానానికి స్పీకర్ కుటుంబ సమేతంగా బుధవారం విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ స్పీకర్‌కు ఘనస్వాగతం పలికారు. స్పీకర్ కుమారుడు చింతకాయల విజయ్ కూడా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటిన అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రెండు దశాబ్దాల కాలంగా తిరుపతమ్మతల్లి క్షేత్రానికి రావాలన్న కోరిక నేడు తీరటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసౌఖ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. అన్న ఎన్టీఆర్ ఆశీస్సులతో టిడిపిలోకి వచ్చిన తాను నాటి నుండి నేటి వరకు అదే పార్టీలో కొనసాగుతూ ప్రజల ఆదరణతో ఈస్థాయికి చేరుకున్నానన్నారు. అనంతరం స్పీకర్ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా తన ఇంటికి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజగోపాల్ వారికి ప్రేమ విందు ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యార్డు ఛైర్మన్ మల్లెల సీతమ్మ, అమ్మవారి ఆలయట్రస్టీ రమేష్, మాజీమున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, యువనేత శ్రీరాం ధనుంజయ, శ్రీరాం సాయిప్రసాద్, నూకల కుమారరాజ, కెవి నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, టిడిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. కాగా యువనేత ధనుంజయ ఆధ్వర్యంలో నటకిరీటి నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల అభివృద్ధికి నవచేతన కార్యక్రమంలో భాగంగా ఏఇ



స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులను సన్మానిస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్, మాజీమంత్రి నెట్టెం రఘురామ్

సాధనాల వినియోగంపై మండల కేంద్రమైన చిల్లకల్లు ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిబద్ధతతో నిర్వహించారు. బాల్యారంభ అభివృద్ధి బీబీ స్క్రీమింగ్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నవచేతన పేరుతో ప్రారంభించిందని తెలిపారు. సభలో అంగన్‌వాడీలకు పలు విలువైన సూచనలిచ్చారు. ఏసిడిపిఓ సరళ, ప్రభుత్వవైద్యాధికారి షై ్టలా, సూపర్‌వైజర్లు సువర్ణ, రజనీ జ్వాల, బీబీ జాన్, భాగ్యలక్ష్మి, వెంకటకుమారి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● ప్రజాసమస్యల సత్వర పరిష్కారంపై మంత్రి నారాయణ దిశానిర్దేశం ● నెల్లూరు కార్పోరేషన్‌లో పురపాలక కమిషనర్‌లతో అభివృద్ధిపై సమీక్ష

● పాలన ప్రజారంజకంగా ఉండాలని మంత్రి సూచన

**నెల్లూరు (కార్పోరేషన్), జూన్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 20వేల కోట్ల అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయలేకుండా అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన మంత్రి నారాయణ బుధవారం నెల్లూరు కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్‌హాలులో కమిషనర్లతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో మంత్రి ఘాటుగా మాట్లాడారు. అలాగే అమృత్ పథకం కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి రెండేళ్ళలో ఏర్పటు చేస్తామని హామీ ఇచ్చారు. గత పాలకులు రాష్ట్రాన్ని చెత్తమయం చేసి వెళ్లారని ఆరోపించారు. 153లక్షల టన్నుల చెత్తను మిగిల్చి వెళ్ళారని, చెత్త పన్ను వసూలు చేసి చెత్తపాలన చేశారని ఎద్దేవా చేశారు. చెత్తరహిత రాష్ట్రంగా ఏపీని తీర్చి దిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రాసెసింగ్ ప్లాంట్‌లు, వెస్టటు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టిడ్కో ఇళ్ళను జులై ఆఖరు కల్లా పూర్తిచేస్తామని అన్నారు. పార్కులు, స్కూల్స్‌ను సిఎస్ఆర్ ఫండ్స్‌తో ఆధునీకరిస్తున్నామని దేశంలోనే విశాఖలో ఎల్ఈడి లైట్లు మొదటగా ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నా క్యాంటిన్‌లలో నాణ్యతను వారానికి ఒక రోజు పరిశీలనతో పాటు పోస్టర్లపై నిషేదం ప్లెక్సీలను 48గంటల తరువాత తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మేయర్ సుజాత మాట్లాడుతూ దుమ్ములేని నగరంగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు మంత్రి పలు సూచనలు ఇచ్చారని అవి పాటిస్తున్నామని కాలువల ఆధునీకరణ పనుల్లో వేగం పెంచుతున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ మాట్లాడుతూ గ్రీనరీ నుంచి పారిశుద్ధ్యం వరకు అన్ని అంశాలపై అధికారులకు మంత్రి సూచించారు. నిధులను సద్వినియోగం చేసి అభివృద్ధితో ముందుకు వెలుతున్నామని తెలిపారు. సమీక్షలో కమిషనర్ వై.ఓ.నందన్, మున్సిపల్ కమిషనర్లు, సిటిప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్‌హెల్త్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

11-6pg4.qxd:11-6pg4.qxd 1/1/02 5:45 AM Page 1



వార్త

ప్రపంచం తాలూకు రహస్యాల్ని అర్థం చేసుకోవాలంటే దీర్ఘకాలం పాటు శిక్షణాభ్యాసం సాగించాలి.

న- అలివర్ గోల్డ్‌స్మిత్

# అణచివేత అన్నిటా వర్ధిల్లదు!

ఎన్నో ఉగ్రవాద సంస్థలను తనలో ఇముడ్చుకుని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలను దారిలోకి తెచ్చుకోలేక సతమతమవుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఆర్థిక రాజకీయ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న పౌరహక్కుల కూటమి జాయింట్ అవామీ యాక్షన్ కమిటీని నిషేధించి పాకిస్థాన్ పీకల మీదకు తెచ్చుకుంది. తమ అధీనంలో ఉన్న కశ్మీర్ భాగం ఇండియాదని తెలిసి కూడా దానికి స్వతంత్రత కల్పించకపోగా కనీసం అక్కడున్న ప్రజా చైతన్యాన్ని అణచివేయడంపైనే పాక్ పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో అతి స్వల్పకాలంలోనే భద్రతా దళాలకు నిరసన కారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో కనీసం 30 మంది మరణించారు. ఎంతో మంది క్షతగాత్రులైనారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జూలై 27న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ నేపథ్యంలోనే కశ్మీర్‌లో ఉద్రిక్తతలు చెలరేగాయి. ఒక పక్క పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏమాత్రం మానవ హక్కులు లేవని, అన్నీ ఉల్లంఘనలేనని భారత్ అభిప్రాయపడ్తోంది. అక్కడ చట్టసభలో శరణార్థుల కోసం కేటాయించిన సీట్లను రద్దు చేయాలని జెఎఎసి ఎప్పట్నించో కోరుతోంది. దీనిపై మంగళవారం తీవ్రస్థాయిలో రావల్ కొట్, ముజఫరాబాద్‌లో నిరసనలు చెలరేగాయి. నిరసన కారులపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. ఈ ఉద్రిక్తతలపై బ్రిటన్‌కు చెందిన 50 మందికిపైగా పార్లమెంట్ సభ్యులు తమ దేశవిదేశాంగ కార్యాలయానికి లేఖ రాశారు. ఆ లేఖలోని సంగతుల్లోకి వెళ్తే ఈ ఉద్రిక్తతలను నివారించేందుకు వెంటనే దౌత్య చర్యలు చేపట్టడం అవసరమని కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న వారంతా తాము భారత్‌తో కలిసి ఉండాలని అనుకున్నవారే. అక్కడ ఎన్నాళ్లుగానో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంది. అనేక సందర్భాల్లో ప్రభుత్వ నిర్ణయాలపై మూకుమ్మడి అసంతృప్తులు చెలరేగాయి. కశ్మీర్ పహల్‌గాం దుర్ఘటనలో భారతీయులను ఊచకోత తర్వాత పాక్ అండదండలతో ఉగ్రవాదులు ఈ దురాగతానికి పాల్పడ్డారనే భారత్ నిర్ణయానికి వచ్చి పాక్ మీద యుద్ధం ప్రకటించిన విషయం విదితమే. ఆ సందర్భంలో పిఒకె వాసులు భారత్‌కే మద్దతు పలికారు. పాక్ పాలకుల నుంచి అణచివేతకు గురవుతున్న పిఒకె వాసుల్లో తీవ్రఅసంతృప్తి ఉంది. ఇటీవల కాలంలో వారంతా పాక్ పాలకుల ఆర్థిక, రాజకీయ దోపిడీపై మూకుమ్మడిగా చారిత్రాత్మక తిరుగుబాటుకు నడుం కట్టారు. పాకిస్థాన్ అధీనంలో ఉన్న ఆక్రమిత కశ్మీరులో నివసిస్తున్న శరణార్థుల కోసం స్థానిక చట్టసభలో కేటాయించిన 12 ప్రత్యేక సీట్లను రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిజానికి ఆ 12 సీట్ల మద్దతుతోనే పాక్ పాలకులు తమపై అరాచక పాలన రుద్దుతున్నారన్నది వారి ఆరోపణ.

దీనికితోడు ప్రజాఉద్యమాలను అణచివేసేందుకు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీని పాక్‌ప్రభుత్వం ఉగ్రవాదనిరోధక చట్టాల కింద నిషేధించడం, రావల్‌కోట్ కాల్పుల్లోఅమాయకులు మరణించారన్న ఆరోపణతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు కట్టుకుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిత్, బాల్టిస్తాన్ ప్రాంతాలు సహజవనరులకు నిలయాలుకాగా ఆ వనరులన్నీపంజాబ్‌కు తరలించి తమ ప్రాంతానికి ఆర్థిక వనరులు సమకూర్చే విషయంలో మొండిచెయ్యి చూపడం కూడా ఆ ప్రాంత వాసులకు రుచించలేదు. తమ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పంజాబ్‌కు తరలిస్తున్నా, తమకు కనీస నిత్యావసరాలైన గోధుమ పిండిని కూడా రాయితీపై ఇవ్వకపోవడాన్ని వారు గర్హిస్తున్నారు. తమప్రాంతంలో తయారైనవిద్యుత్ తమకు ఉపయోగించుకునే ఆస్కారంలేదని, తరచు విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నారని వారి ఆందోళన పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఇంటర్నెట్ నిలిపివేత, సైనికచర్య, మానవ హక్కుల ఉల్లంఘనలపై బ్రిటన్ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటూ లండన్‌లోని బ్రిటన్‌ఎంపీలు కోరడం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం. ప్రస్తుతం ఎదురైన పరిస్థితుల రీత్యా కెనడా తన ప్రజలను పిఒకెకు వెళ్లవద్దని నిషేధం విధించింది. 2025 భారత్, పాక్‌ల మధ్య జరిగిన 'ఆపరేషన్ సింధూర్' తర్వాత పాక్ ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. అయినా వారు పిఒకెపై అణచివేత చర్యలు తగ్గలేదు. పాక్ పాలకులు దశాబ్దాలుగా అంతర్జాతీయ వేదికలపై భారత్ ఆధీనంలో ఉన్న కశ్మీర్ కూడా వారిదేనన్నట్లు ప్రసంగాల్లో వ్యక్తం చేయడం, తమ వాదనల్లో పసలేదని తెలిస్సినా పదే పదే అవే అంశాలపై పోరాట కాంక్షతో ఉంటున్నారు. అంతేతప్ప పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు ఏంకావాలో ఇవ్వాలని, తద్వారా వారిలోని అసంతృప్తిని చల్లార్చాలన్న ప్రయత్నమేమీ చేయడంలేదు. ప్రజాస్వామ్య కాంక్షను అణచివేయాలని పాక్ ఆలోచన సరైనది కాదు. ఎక్కడిదైనా, ఏ ప్రాంతమైనా ఎవరి అధీనంలో, ఎవరి పాలనలో ఉన్నా అక్కడి ప్రజలు కోరుకునేది ప్రధానంగా మానవ హక్కులు, స్వేచ్ఛాజీవితం, వాటి విషయంలో పాక్ ప్రజారంజకంగా పాలించేందుకు దారులు వెతుక్కొంటే ప్రస్తుతానికి శాంతి పరిఢవిల్లుతుంది. స్థానికరాజకీయ హక్కులు, ప్రాతినిధ్య రాజకీయం, స్వయంపాలనా ప్రతిపత్తి వంటి అంశాలలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు పాక్ అరాచక విధానాలను వ్యతిరేకిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించడమొక్కటే పాక్ ఆక్రమిత కశ్మీరులో శాంతికి సుస్థిర మార్గం ఏర్పడగలదు. అణచివేత తాత్కాలిక పరిష్కారానికి హేతువు కాగలదేమో తప్ప దీర్ఘకాలిక పరిష్కారానికి దోహదపడదని పాక్ పాలకులు తెలుసుకోవాలి. పిఒకెలో అశాంతి అటు పాకిస్థాన్ ఇటు భారత్‌ల మధ్య సంబంధాలను కూడా దెబ్బతీసే పరిస్థితి ఉంది. పిఒకెపై ఆధిపత్యం కావాలనుకుంటున్న పాక్ ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల విషయంలో సంయమనంతో వ్యవహరించకపోవడం దురదృష్టకరం.

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.



రామకృష్ణ పరమహంస

మన ప్రవర్తనే మనకు మిత్రుల్ని, శత్రువుల్ని సమకూరుస్తుంది. మన భవిష్యత్తుకు మనమే రూపురేఖలు దిద్దుకోవాలి.



షేక్ స్పియర్

# అగ్నిప్రమాదాల నివారణకు 'డిజిటల్ ట్విన్'

**అగ్నిప్రమాదాలు ఒక్కసారిగా పుట్టుకొచ్చే విపత్తులు కావు. అవి సంవత్సరాల నిర్లక్ష్యం, బలహీన అమలు, బాధ్యతారాహిత్యపు ఫలితాలు. ప్రతి ప్రమాదం తర్వాత మంటలను ఆర్పడంలో మనం విజయం సాధించవచ్చు. కానీ వాటికి కారణమైన లోపాలను సరిదిద్దకపోతే అదే విషాదం మరో నగరంలో, మరో భవనంలో పునరావృతమవుతుంది. భవనాల ఎత్తు పెరుగుతున్న కొద్దీ భద్రతా ప్రమాణాలు కూడా పెరగాలి. నగరాలు విస్తరిస్తున్న కొద్దీ పర్యవేక్షణ వ్యవస్థలు కూడా బలోపేతం కావాలి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే నగరాల నుంచి, ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి అడ్డుకునే నగరాల వైపు భారత్ అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే ప్రతి అగ్నిప్రమాదం తర్వాత మనం కోల్పోయిన ప్రాణాలను లెక్కించగలుగుతాం గానీ, వాటిని కాపాడలేకపోయిన వ్యవస్థను మార్చలేం. అదే నేటి పట్టణ భారతం ముందున్న అసలు సవాలు.**

డి. జయరాం

ఢిల్లీలో జరిగిన తాజా అగ్నిప్రమాదం మరోసారి దేశాన్ని విషాదంలో ముంచింది. ప్రాణనష్టం, ఆస్తి నష్టం, అధికారుల తనిఖీలు, విచారణ కమిటీలు, పరిహార ప్రకటనలు. ఇవన్నీ ప్రతీ పెద్ద అగ్నిప్రమాదం తర్వాత కనిపించే దృశ్యాలు. కొన్ని రోజులు చర్చ జరుగుతుంది. బాధ్యుల కోసం వెతుకులాట సాగుతుంది. ఆ తర్వాత మరో ప్రమాదం వరకు అంతా మామూలే. కానీ ఒక ప్రశ్నమాత్రం అలాగే మిగిలిపోతుంది. సాంకేతికంగా ఎంతో ముందుకు వెళ్లామని చెప్పుకునే మన దేశంలో ఇటువంటి అగ్నిప్రమాదాలు ఎందుకు పదేపదే జరుగుతున్నాయి? దేశంలో అగ్నిప్రమాదాలు యాదృచ్ఛిక ఘటనలుగా మారడం లేదు. ప్రతి ఏడాది వేలాది మంది అగ్నిప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు ఏ రంగమూ దీనికి మినహాయింపు కాదు. ఢిల్లీలోని హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదం, సూరత్ కోచింగ్ సెంటర్ ప్రమాదం, కోల్‌కతా హోటల్ అగ్నిప్రమాదం, రాజ్‌కోట్ గేమింగ్ జోన్ విషాదం వంటి ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అయినప్పటికీ వాటి నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు పూర్తిగా అమలులోకి వచ్చినట్లు కనిపించడం లేదు. ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే సమస్య మంటల్లో కాదు, మన పట్టణ పాలనలో ఉందనే విషయం స్పష్టమవుతుంది. అగ్నిప్రమాదం ఒక సంఘటన మాత్రమే. దానికి దారితీసే నిర్లక్ష్యం, ప్రణాళికా లోపాలు, నిబంధనల అమలులో బలహీనతలు, బాధ్య తారాహిత్యమే అసలు కారణాలు. దేశంలో పట్టణీకరణ వేగం గా విస్తరిస్తోంది. వచ్చే దశాబ్దాల్లో దేశ జనాభాలో గణనీయ మైన భాగం నగరాల్లోనే నివసించనుంది. ఎత్తైన భవనాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ పెరుగుతున్నాయి. కానీ వాటికి అనుగుణంగాభద్రతా సంస్కృతి ఎదగడం లేదు. ఒకప్పుడు నివాస అవసరాల కోసం నిర్మించిన భవనాలు నేడు వాణిజ్య సముదాయాలు గా మారుతున్నాయి. చిన్న దుకాణాలు పెద్ద రెస్టారెంట్లుగా రూపాంతరం చెందుతున్నాయి. గిడ్డంగులు కార్యాలయాలుగా మారుతున్నాయి. అయితే భవనాల వినియోగం మారినంత వేగంగా భద్రతా ప్రమాణాలు మారడం లేదు. ఫలితంగా పాత నిర్మాణాలపై కొత్త ప్రమాదాలు పేరుకుపోతున్నాయి. మన నగరాల్లోని అనేక ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్ తిరగలేని ఇరుకైన వీధులు కనిపిస్తాయి. భవనాల చుట్టూ అత్యవసర వాహనాలకు దారి ఉండదు. పార్కింగ్ వాహనాలతో ప్రవేశ మార్గాలు మూసుకుపోతాయి. అత్యవసర నిష్క్రమణ ద్వారాలు వస్తువుల నిల్వ గదులుగా మారిపోతాయి. అనుమతి లేని అదనపు అంతస్తులు నిర్మించబడతాయి. విద్యుత్ వ్యవస్థలు అనుమతించిన సామర్థ్యానికి మించి వినియోగించబడతాయి. ప్రమాదం సంభవించిన తర్వాత ఇవన్నీ బయటపడతాయి. కానీ ప్రమాదం జరగకముందే గుర్తించి సరిదిద్దే వ్యవస్థ మాత్రం చాలా చోట్ల కనిపించదు. ఇదే మన పట్టణ భద్రతలోని అతిపెద్ద బలహీనత. అగ్నిప్రమాదాల్లో ఎక్కువ మంది మంటల వల్ల కాకుండా పొగ వల్ల ప్రాణాలు కోల్పోతారన్న విషయం తరచూ మరచిపోతాం. కొన్ని నిమిషాల్లోనే పొగ మెట్లు, కారిడార్లను కమ్మేస్తుంది. బయటకు వెళ్లే మార్గాలు మూసుకుపోతాయి. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఉన్నా, అత్యవసర నిష్క్రమణ మార్గాలు పనిచేయకపోతే అవి పెద్దగా ఉపయోగపడవు. అందుకే ఆధునిక అగ్నిభద్రత అంటే కేవలం మంటలను ఆర్పడం



కాదు. ప్రమాదం సంభవించిన వెంటనే ప్రజలు సురక్షితంగా బయటపడేలా వ్యవస్థలను రూపొందించడం. ఇక్కడే మనం ఒక నిజాన్ని అంగీకరించాలి. మన సమస్య సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం కాదు. అమలు వ్యవస్థ బలహీనంగా ఉండటమే. అగ్నిభద్రతా నిబంధనలున్నాయి. నిర్మాణ ప్రమాణాలు ఉన్నాయి. తనిఖీ వ్యవస్థలు ఉన్నాయి. కానీ అవి చాలాసార్లు కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తుంటాయి. దేశంలోని అనేక పెద్ద ప్రమాదాలపై జరిగిన దర్యాప్తుల్లో ఒకే తరహా లోపాలు బయటపడ్డాయి. అత్యవసర నిష్క్రమణ ద్వారాలు లేకపోవడం, అగ్నిమాపక పరికరాలు పనిచేయకపోవడం, అనుమతులు లేకుండా నిర్మాణ మార్పులు చేయడం, విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలు పదేపదే వెలుగుచూశాయి. అంటే సమస్య నిబంధనల కొరత కాదు. వాటి అమలులోనిరంతర పర్యవేక్షణ లేకపోవడమే. ఇప్పటి వరకు అగ్నిప్రమాదాలపై మన దృష్టి ప్రధానంగా ప్రతిస్పందనపైనే ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత అగ్నిమాపక దళాలు ఎంత వేగంగా స్పందించాయన్న దానిపై చర్చ సాగుతుంది. కానీ ప్రమాదం సంభవించే అవకాశాన్ని ముందుగానే గుర్తించి అడ్డుకోవడం పై తగినంత దృష్టి లేదు. ఇరవై ఒకటో శతాబ్దంలో అగ్ని భద్రత అంటే కేవలం ఫైర్ ఇంజిన్లు, నీటి ట్యాంకులు, అగ్ని మాపక పరికరాలు మాత్రమే కాదు. డేటా, కృత్రిమ మేధ, సెన్సార్ సాంకేతికతలు కూడా అంతే కీలకమైనవి. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, స్మార్ట్ సెన్సార్లు, రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు భవనాల్లో ఉష్ణోగ్రత మార్పులు, పొగ స్థాయిలు, గ్యాస్ లీకేజీలు, అసాధారణ విద్యుత్ వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షించగలవు. ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే హెచ్చరికలు జారీ చేయగలవు. తద్వారా ప్రమాదం సంభవించకముందే జాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచంలోని అనేక నగరాలు ఇప్పటికే ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. భవనాల డిజిటల్ నమూనాలను రూపొందించి అత్యవసర పరిస్థితులను ముందుగానే అంచనా వేసే 'డిజిటల్ ట్విన్' సాంకేతికతను వినియోగిస్తున్నాయి. ఒక ప్రాంతంలో మంటలు చెల రేగితే పొగ ఏ దిశగా వ్యాపిస్తుంది? ప్రజలను ఏ మార్గం లో తరలించాలి? అగ్నిమాపక వాహనాలు ఎంత సమయం లో చేరగలవు? వంటి అంశాలను ముందుగానే విశ్లేషిస్తున్నాయి. మన దేశంలోకూడా స్మార్ట్ సిటీ కార్యక్రమాలు అమలవుతున్నాయి. అయితే నగరాలను స్మార్ట్‌గా మార్చడం అంటే కేవలం సీసీ కెమెరాలు, వైఫై సదుపాయాలు ఏర్పాటు చేయడం కాదు. ప్రజల భద్రతను ముందుగానే నిర్ధారించే తెలివైన వ్యవస్థలను నిర్మించడమే అసలైన స్మార్ట్‌నెస్. అయితే సాంకేతిక పరిష్కారాలు మాత్రమే సరిపోవు. వాటిని అమలు చేసే పరిపాలనా సంకల్పం అవసరం. మున్సిపల్ సంస్థలు, అగ్నిమాపక శాఖలు, విద్యుత్ విభాగాలు, పట్టణాభివృద్ధి సంస్థలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పని చేయాలి. భవన అనుమతుల నుంచి భద్రతా పర్యవేక్షణ వరకు మొత్తం వ్యవస్థను డిజిటల్‌గా అనుసంధానించాలి. భద్రతా తనిఖీల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అధిక ప్రమాదం ఉన్న భవనాలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలి. అంతకంటే ముఖ్యంగా భద్రతను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. ఢిల్లీ ఘటన మరోసారి ఒక కఠినమైన పాఠాన్ని గుర్తుచేసింది. అగ్నిప్రమాదాలు ఒక్కసారిగా పుట్టుకొచ్చే విపత్తులు కావు. అవి సంవత్సరాల నిర్లక్ష్యం, బలహీన అమలు, బాధ్యతారాహిత్యపు ఫలితాలు. ప్రతి ప్రమాదం తర్వాత మంటలను ఆర్పడంలో మనం విజయం సాధించవచ్చు. కానీ వాటికి కారణమైన లోపాల ను సరిదిద్దకపోతే అదే విషాదం మరో నగరంలో, మరో భవనంలో పునరావృతమవుతుంది. భవనాల ఎత్తు పెరుగు తున్న కొద్దీ భద్రతా ప్రమాణాలు కూడా పెరగాలి. నగరాలు విస్తరిస్తున్న కొద్దీ పర్యవేక్షణ వ్యవస్థలు కూడా బలోపేతం కావాలి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే నగరాల నుంచి, ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి అడ్డుకునే నగ రాల వైపు భారత్ అడుగులు వేయాల్సిన

# ఇంధన స్వాతంత్ర్యం ఇంకెంత దూరం!

తిప్పర్తి శ్రీనివాస్

భారత్-వెనిజులా మధ్య ఇంధన భాగస్వామ్యానికి కొత్త ఊపు రావడం స్వాగతించదగ్గ పరిణామం. ప్రపంచంలో అతిపెద్ద చమురు నిల్వలు కలిగిన దేశాలలో వెనిజులా ఒకటి. అలాంటి దేశంతో భారత్ తన ఇంధన సంబంధాలను విస్తరించుకోవడం కేవలం వాణిజ్యపరమైన అంశం కాదు. అది జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన వ్యూహాత్మక నిర్ణయం కూడా. అయితే ఈ సందర్భంగా ఒక ప్రాథమిక ప్రశ్న మన ముందుకు వస్తుంది. రాజకీయంగా స్వాతంత్ర్యం సాధించి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా, ఇంధన అవసరాల విషయంలో భారత్ ఇంకా పూర్తిస్థాయి స్వేచ్ఛను ఎందుకు పొందలేకపోయింది? 1947 ఆగస్టు 15న మన దేశం విదేశీ పాలన నుంచి విముక్తి పొందింది. కానీ ఆర్థిక రంగంలో, ముఖ్యంగా ఇంధన భద్రత విషయంలో, మన స్వాతంత్ర్యం ఇప్పటికీ అసంపూర్ణంగానే కనిపిస్తోంది. దేశ అభివృద్ధికి విద్యుత్తు ఎంత అవసరమో, విద్యుత్తు ఉత్పత్తికి ఇంధనం అంతే అవసరం. చమురు, సహజవాయువు లేకుండా ఆధునిక ఆర్థికవ్యవస్థ ఒక్కరోజు కూడా ముందుకు కదలదు. అలాంటి కీలక రంగంలో మనం ఇంకా దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. భారత్ తన చమురు అవసరాలలోసుమారు 85 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అంటే మన ఆర్థికవ్యవస్థకు అవసరమైన జీవనాడి మన చేతుల్లో లేదు. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగినా, యుద్ధాలు జరిగినా, రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తినా వాటి ప్రభావం నేరుగా భారత ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ఈ పరిస్థితిలో చమురు ఎక్కడి నుంచి కొనుగోలు చేయాలన్న నిర్ణయం కూడా పూర్తిగా మన చేతుల్లో ఉండకపోవడం ఆందోళనకరమైన విషయం. రష్యా, ఇరాన్, వెనిజులా వంటి దేశాలు ప్రపంచ ఇంధన మార్కెట్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ అంతర్జాతీయ రాజకీయ సమీకరణలు, ఆర్థిక ఆంక్షలు, పాశ్చాత్య దేశాల ఒత్తిళ్ల వంటి కారణాల వల్ల భారత్ తన అవసరాలకు అనుగుణంగా ఈ దేశాలతో పూర్తిస్థాయిలో వ్యాపారం చేయలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. ఒక స్వతంత్ర దేశంగా మనం ఎవరితో వ్యాపారం చేయాలో, ఎవరినుంచి చమురు కొనుగోలు చేయాలో నిర్ణయించే హక్కు మనకుండాలి. ఆ నిర్ణయాలు ఢిల్లీ తీసుకోవాలి తప్ప వాషింగ్టన్, బ్రస్సెల్స్ లేదా మరెక్కడో తీసుకోవాల్సిన అవసరం ఉండకూడదు. అంతర్జాతీయ సంబంధాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు. శాశ్వతంగా ఉండేది జాతీయ ప్రయోజనమే. ఈ సూత్రాన్ని ప్రపంచంలోని అన్ని ప్రధాన దేశాలు అనుసరిస్తున్నాయి. అమెరికా తన ప్రయోజనాలను కాపాడుకుంటుంది. చైనా తన అవసరాలను ముందుంచుకుంటుంది. రష్యా తన వ్యూహాలకు అనుగుణంగా వ్యవహరిస్తుంది. అలాంటప్పుడు భారత్ కూడా తన ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవడం సహజం. ఇటీవలి సంవత్సరాలలో భారత్ తన విదేశాంగ విధానంలో వ్యూహాత్మక స్వతంత్రతను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగించడం అందుకు ఒక ఉదాహరణ. ఇప్పుడు వెనిజులాతో సంబంధాలను బలోపేతం చేయడం కూడా అదేదిశలో మరో అడుగుగా చూడాలి. ప్రపంచ ఇంధన మార్కెట్‌లో సరఫరా వనరులను విస్తరించుకోవడం ద్వారా భారత్ తన ఇంధన భద్రతను మరింతబలోపేతం చేసుకోవచ్చు. అయితే దీర్ఘకాలిక పరిష్కారం కేవలం కొత్త దేశాల నుంచి చమురు కొనుగోలు చేయడంలో లేదు. దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడంలో ఉంది. సౌరశక్తి, పవనశక్తి, హరిత హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధికి భారత్ ఇప్పటికే పెద్దఎత్తున ప్రాధాన్యత ఇస్తోంది. ఈ ప్రయత్నాలు మరింత వేగవంతం కావాలి. దేశీయ చమురు, సహజవాయువు అన్వేషణను కూడా విస్తరించాలి. ఇంధన వినియోగంలో సామర్థ్యాన్ని పెంచాలి. అయినప్పటికీ, సమీ ప భవిష్యత్తులో చమురు అవసరం తగ్గే అవకాశం లేదు. అందువల్ల ప్రపంచంలో ఎక్కడ నాణ్యమైన, చౌకైన ఇంధనం లభిస్తే అక్కడి నుంచి దిగుమతి చేసుకునే సామర్థ్యాన్ని భారత్ పెంచుకోవాలి. అది రష్యాకావచ్చు, ఇరాన్ కావచ్చు, వెనిజులా కావచ్చు లేదా మరే ఇతర దేశం కావచ్చు. భారత ప్రయోజనాలే అంతిమ ప్రమాణంగా ఉండాలి. వెనిజులాతో ఏర్పడుతున్న కొత్త భాగస్వామ్యం ఆ దిశగా ఒకసానుకూల సంకేతం. దేశానికి అవసరమైన ఇంధనాన్ని ప్రపంచంలోని ఏ మూలనుంచైనా, ఎటువంటి బాహ్య ఒత్తిళ్లకు లోనుకా కుండా, పూర్తిగా జాతీయ ప్రయోజనాల ఆధారంగా సమ కూర్చుకోగలిగిన రోజునే భారత్ ఆర్థికంగా నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించిందని చెప్పవచ్చు. రాజకీయ స్వాతంత్ర్యం 1947లో వచ్చింది. ఇంధన స్వాతంత్ర్యం ఎప్పుడు వస్తుందో మరి.

# నిజమైన ఆహార భద్రత సాధించామా?

డి చంద్రభాను

మానవ వనరుల అభివృద్ధికి, దేశ సుస్థిర ప్రగతికి అత్యంత ప్రాథమికమైన పునాది ఆహార భద్రత. ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం ప్రతి వ్యక్తికి ఎల్లప్పుడూ సురక్షితమైన, పోషక విలువలు కలిగిన ఆహారం భౌతి కంగాను, ఆర్థికంగాను అందుబాటులో ఉండే పరిస్థితినే ఆహార భద్రతగా పరిగణిస్తారు. అయితే నేటి పరిస్థితుల్లో ఆహార భద్రత అంటే కేవలం కడుపు నింపే ధాన్యాలు అం దుబాటులో ఉండటం మాత్రమేకాదు. శరీరానికి అవసరమైన మాంసకృత్తులు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమతుల్యంగా లభించడం కూడా అంతే ముఖ్యమైన అం శంగా మారింది. అందుకే ఇప్పుడు ఆహార భద్రత భావన పోషకాహార భద్రత స్థాయికి విస్తరించింది. ఆహార భద్రతను అంచనా వేయడంలో ఈ నాలుగు అంశాలను పరిగణన లోకి తీసుకుంటారు. దేశంలో తగినంత ఆహార ఉత్పత్తి, నిల్వలు ఉండాలి. ఉత్పత్తి అయిన ఆహారం ప్రతి వ్యక్తి వరకు చేరాలి. స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉండి ఆహారం శరీరానికి సక్రమంగా ఉపయోగపడాలి. ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక సంక్షోభాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు వచ్చినా ఆహార సరఫరా నిరంతరాయంగా కొనసాగాలి. ఈ నాలుగు అంశాలు సమగ్రంగా ఉన్నప్పుడే నిజమైన ఆహార భద్రత సాధ్యమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ కోట్లాది మంది ప్రజలు ఆకలి, పోషకాహార లోపాలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశాలలో ఒకటైన భారత్ తన ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో గణనీయమైన పురోగతి సాధించింది. ఇటీవల వెలువడిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా గణాంకాలు దేశంలో పోషకాహార పరిస్థితి క్రమంగా మెరుగుపడుతున్నట్లు సూచిస్తున్నాయి. ఐదేళ్ల లోపు పిల్లల్లో ఎదుగుదల లోపం గణనీయంగా తగ్గడం, తీవ్రమైన పోషకాహార లోపం తగ్గుముఖం పట్టడం సానుకూల పరిణామాలు. తెలుగు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జాతీయ సగటుతో పోలిస్తే మెరుగైన ఫలితాలు నమోదు చేశాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితధాన్యాల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలు ఈ పురోగతికి దోహదపడ్డాయి. దేశవ్యాప్తంగా కేరళ, తమిళనాడు, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, గోవా వంటి రాష్ట్రాలు పోషకాహార భద్రతలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. సమర్థవంత



మైన పంపిణీ వ్యవస్థలు, వైవిధ్యభరితమైన ఆహారపథకాలు అక్కడ మెరుగైన ఫలితాలను అందిస్తున్నాయి. భారత్ నేడు ప్రపంచంలో అతిపెద్ద ఆహార ధాన్యాల ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉన్నప్పటికీ, ఆహార భద్రతకు కొత్త తరహా సవాళ్లు ఎదురవుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాత నమూనాలు మారడం, అకాల వర్షాలు, కరవులు, తీవ్ర ఉష్ణోగ్రతలు పంటల దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు నిల్వ సదుపాయాల కొరత, శీతలీకరణ గిడ్డంగుల లేమి, రవాణా లోపాల కారణంగా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలలో గణనీయమైన భాగం వినియోగదారులకు చేరకముందే వృథా అవుతోంది. అయితే దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కేవలం ఆహార కొరత కాదు. ఒక వైపు పోషకాహార లోపం కొనసాగుతుండగా, మరోవైపు ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. దీనినే నిపుణులు పోషకాహార ద్వంద్వ భారంగా పేర్కొంటున్నారు. అంటే కొందరు సరిపడా ఆహారం లేక బాధపడుతుంటే, మరికొందరు అసమతుల్య ఆహారం వల్ల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో సమతుల్య పోషకాహారం అందకపోవడం, పెద్దవారిలో అధికంగా శుద్ధి చేసిన ఆహార పదార్థాల వినియోగం పెరగడం ఆందోళన కలిగించే అంశాలు. ఆకలి తగ్గుతున్నప్పటికీ గుప్త పోషకాహార లోపం ఇంకా కొనసాగుతుండటం వాస్తవ పరిస్థితిని తెలియజేస్తోంది. దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడంలో జాతీయ ఆహార భద్రతా చట్టం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చట్టం ద్వారా కోట్లాది మంది ప్రజలకు సబ్సిడీ ధరలకే లేదా ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. ఒక దేశం-ఒక రేషన్ కార్డు విధానం వలస కార్మికులకు ప్రత్యేక ప్రయోజనం కల్పించింది. అదే సమయంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం అమలు చేస్తున్న పౌష్టికాహార పథకాలు పోషకాహార లోపాన్ని తగ్గించడంలో తోడ్పడుతున్నాయి. అయితే భవిష్యత్తులో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలంటే కేవలం ధాన్యాల పంపిణీసరిపోదు. ఇనుము, జింక్, విటమిన్లు అధికంగా ఉండే పంటరకాలను విస్తృతంగా ప్రోత్సహించాలి. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాలను ప్రజల ఆహారంలో భాగం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో నిల్వ, శీత లీకరణ సదుపాయాలను విస్తరించడం ద్వారా ఆహార వృథా ను తగ్గించవచ్చు. అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చడంఅవసరం. గత రెండు దశాబ్దాల్లో ఆకలి నిర్మూలన, ఆహార పంపిణీ రంగాల్లో దేశం గణనీయ మైన పురోగతి సాధించింది. అయితే ఇకపై లక్ష్యం కేవలం కడుపు నింపడం కాకుండా ప్రతి పౌరుడికి సమతుల్యమైన, ఆరోగ్య కరమైన పోషకాహారం అందించడం కావాలి. పరిమాణం నుంచి నాణ్యతవైపు, ధాన్యాల నుంచి

# ప్రజావాక్కు

## రైళ్ల రంగు మార్చాలి

**ఇటీవల** హైదరాబాద్, బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో పట్టాలపై రెండు ఆవులు రైలు ఢీ కొనగా మరణించటం విషాదకరం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలను బట్టీ ఛిద్రమైన ఆవుల మాంసం ముద్దలు లోకోపైలెట్ క్యాబిన్‌లోకి వచ్చిపడి ఉండటం బాధాకరం. మనుషులకు హెచ్చరికలు తెలిపే బోర్డులు పెట్టగలం కానీ మరి పశువులకు ఎట్లా తెలిసేది? వందే భారత్ రైళ్ల వెలుపలి భాగాలు ముఖ్యంగా తెలుపు లేత నీలం, తెలుపు కాషాయరంగుల్లో ఉంటున్నాయి. తెలుపు రంగు నిండైన సూర్యకాంతిలో కనపడదు. అలాగే లేత నీలంరంగు మేఘావృతవర్ణంలో ఉండటంవల్ల, అత్యంత వేగంవల్ల జంతువులు త్వరగా పోల్చుకొలేకపోతున్నాయి. లేతరంగులు సూర్యకాంతిలో మిళితమవుతాయి. రైలు దూరం నుంచే ప్రస్ఫుటంగా కనపడేటట్లు ఉండాలి. అప్పుడే పశు మరణాలను ఆపవచ్చు.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## గుళ్లు కాదు..బళ్లు నిర్మించండి

గుళ్లు ఆటవీకం. బళ్లుఆధునికం. ఈమధ్య పాత గుళ్లను పునర్నిర్మించడం ఒక ఫాషన్ అయిపోయింది. ప్రతివాడు సనాతనంఅని ప్రచారం చేస్తున్నాడు. వాస్తవానికి సనాతనం అంటే ఏమిటోకూడా తెలియదు. అది ఈనాటి సమాజానికిఎందుకు పనికిరాదో తెలియదు. మా నాయనమ్మ, మాతాత సనాతనం అన్నారు కాబట్టినేను అంటున్నాను. మీరుకుడా అనండి తప్ప ఏమీ తెలియదు. పూర్వజనం గుళ్లు నిర్మించేవాళ్ళు. గుళ్లుభక్తిని పెంచుతాయి. భక్తి ఆలోచనని చంపుతుంది. ఎక్కడో ఏదో తవ్వుతుంటే పురాతన విగ్రహంబయటపడింది. పురాతనమైనవి దొరికితె మ్యూజియంలోఉంచాలి. గుళ్లుకాదు, బళ్లునిర్మించండి. గుళ్లు మతాన్ని పెంచుతాయి. బళ్లుశాస్త్రీయసమాజాన్ని పెంచుతాయి.

- నార్నెవెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించాలి

జూన్20వ తేదీన జరగనున్న లోక్ అదాలత్‌లో పోలీస్ స్టేషన్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలువంటి సమస్యలు పరిష్కరించాలి. సంవత్సరాలుగా భూ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో, జిల్లా పోలీస్‌అధికారి కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ఈ లోక్‌అదాలత్‌లోపరిష్కరించాలి.,

-కదురు శ్రీనివాస్, వరంగల్

## ఉక్కు ప్రమాదం

**విశాఖ** నగరం స్టీల్‌ప్లాంట్‌లో 150టన్నుల వేడి ఉక్కు ద్రవం ఒకేసారి లీక్ అయిన పెను ప్రమాదంలో 9 మంది ప్రాణాలు కోల్పోవడం, 6గురు తీవ్రగాయాల పాలవడం తీవ్ర విషాదం. 1500 డిగ్రీల వేడిమికి భారీ పరికరాలు కూడా మాడి మసి అయిన దుర్ఘటనలో బాధితులు, మృతులు ఎంత నరకం చూసి ఉంటారో తలచుకుంటేనే గుండె ముక్కలౌతుంది. గతంలోప్రమాదాలు జరిగినా, ఇలా భారీస్థాయిలో విస్ఫోటనం జరగడం బహుశా ఇదే తొలిసారి. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను, నిర్వహణ, ప్రమాద నివారణ, తనిఖీ వ్యవస్థల పట్ల సందేహాల్ని రేకెత్తించే ప్రమాదమిది. రాష్ట్రానికే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ఈ ప్రభుత్వ రంగ సంస్థ పట్ల ప్రభుత్వాలు పూర్తి శ్రద్ధపెట్టడం అవసరం. లాభనష్టాల కోణాలతోపాటు పూర్తిభద్రత, అవసరమైన సిబ్బంది భర్తీ, ప్రమాద రహిత చర్యలు, ఉద్యోగ భద్రత, గనుల కేటాయింపులతో మంచి ఉత్పాదకత తదితర కోణాలపై దృష్టి పెట్టి అంతర్జాతీయ ప్రమాణాలను సాధించాలి.

- డా. డి. వి. జి. శంకరరావు, విజయనగరం

## ఉపాధి హామీని కొనసాగించాలి

**ఉపాధి** పని చేయడం ద్వారా వచ్చిన డబ్బుతో ఆర్థిక స్థిరీకరణ వైపు అడుగులు వేయించడం ముఖ్యం. ఆ వచ్చిన డబ్బుతో గొర్రెలుమేకలు కొనిపించేవిధంగా అడుగులు వేయించడం ముఖ్యం. అంతేకాదు అవి తక్కువ సమయంలోనే వాళ్ళను ఆర్థికంగా బలోపేతం చేస్తాయి. అంతే కాదు భూమికి బలాన్ని ఇవ్వడంలో వాటి ఎరువు ఉపయోగపడుతుంది. అంతే కాదు జీవజాలం పెరుగుదలకు ఉపయోగపడుతుంది. అంటే ఉపాధిహామీ ద్వారా రెండు ఉపయోగాలు ఒకటి గ్రామీణా ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ రెండు జీవజాలం పెరుగుదల.

- భారత అవినాష్, జనగామ

## మీసేవ అందుబాటులో ఉండాలి

సామాన్య ప్రజలకు నిత్యం ఏదో ఒక విషయంలో మీసేవ సేవలపై ఆధారపడి ఉంటారు. కానీ కొన్ని మీ సేవలు సమయానికి షాప్‌లు తెరవకుండా తాళం వేసి ప్రజలకు అందుబాటులో లేకుండా అందులో కూడా అధిక డబ్బులు వసూలు చేయడం అలవాటుగామలుచుకున్న సిబ్బంది మీసేవలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఎక్కడ నిర్లక్ష్యం వహించిన అధికారులు చర్యలు తీసుకుంటేనే కొంతైనా మెరు గుపడే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

## ఉచిత మెగా వైద్య శిబిరం

యడ్లపాడు, జూన్ 10, ప్రభాతవార్త : మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలో బుధవారం గ్రామ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజ్ హాస్పిటల్ వారి సహకారంతో హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగినది గ్రామప్రజలు ఈ క్యాంప్ నందు తమ ఆరోగ్యసమస్యలు తెలిపి తగు సూచనలు చేసి ఎవరి సమస్యలు ఉన్నవారికి రేపు గ్రామం నుండి ఉచితంగా బస్సులు కూడా ఏర్పాటు చేసి వారిని ప్రత్యేకంగా హాస్పటల్ నందు మరల పరీక్షించి ఉచిత బస్సు ద్వారానే తిరిగి గ్రామానికి చేర్చే విధంగా హాస్పటల్ వారు ఏర్పాటు చేసి ఉన్నారు మరియు క్యాంప్ నందు ఉచితంగా మందులు పంపిణీ చేయటంజరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు సాధినేని సుధీర్, మురుకుట్ల శ్రీధర్ కుమార్, తోకల రాజేష్, కనపర్తి లక్ష్మీ ప్రసాద్, తోకల వీర రాఘవయ్య, తోకల సత్యనారాయణ కార్యకర్తలు పాల్గొని గ్రామ ప్రజలను సమన్వయపరిచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది.



## ద్విచక్ర వాహన దారుడు విధిగా హెల్మెట్ ధరించాలి : ఎస్సై

యడ్లపాడు, జూన్ 10, ప్రభాతవార్త : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ అవగాహన కార్యక్రమం - ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వారి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి భద్రత మరియు హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జాతీయ రహదారి మరియు ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత గురించి వివరించి అవగాహన కల్పించబడింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని సూచనలు ఇవ్వబడినవి. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల సంభవించే ప్రమాదాలు మరియు చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు వివరించబడింది. ప్రత్యేక తనిఖీలలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకోగా మొత్తం 11 ట్రాఫిక్ చలానాలు విధించబడినవని, అదేవిధంగా ఒక మద్యం సేవించి వాహనం నడిపిన ద్విచక్ర వాహన దారుడిపై కేసు నమోదు చేయబడిందన్నారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని యడ్లపాడు పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## చెత్త సేకరణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: చెత్త సేకరణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆరెవెన్ క్లీన్ స్ట్రీట్ సందర్భంగా పలు రోడ్లను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ పోతురాజు మాట్లాడుతూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తారన్నారు. కార్మికులు మీ ఇంటి ముంగిటలకు వచ్చిన సందర్భంలో తడి,పొడి,హానికర, ప్రత్యేక వ్యర్థాల చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. ఈ క్లీన్ స్ట్రీట్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, యువత పాల్గొనాలని కోరారు. ప్రజలు చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయవద్దని మనవి చేశారు. స్వచ్ఛతలోని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గురుజాల, జాగర్లమూడి సుధీర్, సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతు సేవే లక్ష్యంగా జీడీసీఎమ్మెస్ ఉద్యోగులకు శిక్షణ

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: రైతు సేవ లక్ష్యంగా జీడీసీఎమ్మెస్ ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నట్లు జీడీసీఎమ్మెస్ చైర్మన్ వడ్లమూడి హరిబాబు అన్నారు. ఉద్యోగులు క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే రైతులకు న్యాయం చేసినట్లవుతుందన్నారు. జీడీసీఎమ్మెస్ సిబ్బంది ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేవిధంగా ఉద్యోగులు కృషి చేయాలన్నారు. రైతులకు అవసరమైన నాణ్యమైన ఎరువులను సమయానికి అందించడం సంస్థ బాధ్యత అనే విషయాన్ని ఉద్యోగులు గుర్తించాలన్నారు. యూరియా, డిఏపి ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువులను తగ్గించి మైక్రో న్యూట్రియెంట్స్ వినియోగాన్ని పెంచడం ద్వారా మంచి దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సాఫ్ట్‌వేర్‌లో అన్ని లావాదేవీలు పారదర్శకంగా డిజిటల్ విధానంలో నమోదు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి తమ విధుల్లో నిబద్ధతతో పనిచేసి సంస్థకు మంచి పేరు తేవాలన్నారు. అదే విధంగా సంస్థకు సహాయం చేసిన ఇఫ్కో, క్రిబ్కో, ఎవిపిఎల్ కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.బిజినెస్ మేనేజర్ జెవి సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగులు శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని, మెలకువలను ప్రాక్టికల్‌గా అమలు చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రతి బ్రాంచ్‌లో సమన్వయం పెంచి, ఎరువుల సరఫరా, పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. రైతుల విశ్వాసాన్ని గెలుచుకోవడం ద్వారా సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.



## విజ్ఞాన్స్ వర్సిటీకి రూ.84.69లక్షల ఏఎన్ఆర్ఎఫ్ గ్రాంట్

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్‌కు చెందిన ఫిజిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హబీబుద్దీన్ షేక్‌కు భారత ప్రభుత్వానికి చెందిన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఏఎన్ఆర్ఎఫ్) నుంచి రూ.84.69లక్షల విలువైన ప్రతిష్టాత్మక అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ గ్రాంట్(ఏఆర్‌జీ) మంజూరైనట్లు విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ మంగళవారం తెలిపారు. డెవలప్‌మెంట్ ఆఫ్ నెక్స్ట్ జనరేషన్ పోర్టబుల్ ప్లాస్మా యాక్టివేటెడ్ ఏరోసోల్ డివైస్ ఫర్ ఇన్సిటు ఆఫ్ మల్టీడ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా అండ్ యాక్సిలరేటెడ్ సౌండ్ హీలింగ్ అనే పరిశోధన ప్రాజెక్టుకు ఈ గ్రాంట్ లభించిందని ఆయన చెప్పారు. మూడు సంవత్సరాల వ్యవధిలో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు చెప్పారు. డాక్టర్ హబీబుద్దీన్ మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులు, సాంకేతికతలుగా మలచడంలో అంతరశాఖ పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నూతన వైద్య బయోమెడికల్ సాంకేతికతల అభివృద్ధి ద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గి ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు ఇటువంటి పరిశోధనలు దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ హబీబుద్దీన్ షేక్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు అభినందించారు.



## ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(స్పెల్టో) జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిగ నాగయ్య మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిధిని ఏర్పాటు చేయాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. సంస్థ కార్యదర్శి ఎం.రాకేష్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రైవేట్ టీచర్లను కూడా వినియోగించుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం తరఫున గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి అందజేశారు. స్పెల్టో గ్రా, జిల్లాస్థాయి నాయకులు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

పొన్నూరు, జూన్ 10,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం పట్ల విసుగు చెందిన పొన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో సజ్జల రామకృష్ణారెడ్డి సమక్షంలో చేరినట్లు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చెప్పారు. పార్టీ రాష్ట్ర నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ నాజర్, వైకాపా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దక్కుమళ్ల రవి, వట్టిచేరుకూరు రంగారావు తదితరులున్నారు.



# గుంటూరు వార్త



## నిర్మాణ వ్యర్థాలు అడ్డగోలుగా రోడ్లపై పడేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు

**నగర కమిషనర్ కే. మయూర్ అశోక్**

గుంటూరు కార్పొరేషన్, జూన్ 10 (ప్రభాత వార్త) : గుంటూరు నగరంలో రహదారులపై, బహిరంగ ప్రదేశాలలో నిర్మాణ వ్యర్థాలు అడ్డగోలుగా పడేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ హెచ్చరించారు. బుధవారం



కమిషనర్ చంద్రమౌళీశ్వర నగర్, పట్టాభిపురం, కొరెటెపాడు, ఇన్నర్ రింగ్ రోడ్డు తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్ల పరిస్థితి, రహదారుల పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పట్టాభిపురం ప్రధాన రోడ్డులోని డిఆర్ఎం ఆఫీస్ రోడ్ లో నిర్మాణ వ్యర్థాలు, మట్టి, ఇతర సామాగ్రి పేరుకుపోయి ఉండటాన్ని గమనించి, అసంతృప్తి వ్యక్తం చేశారు.గతంలో పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ఇటువంటి వాటిని అరికట్టడంలో సిబ్బంది అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రోడ్లపై నిర్మాణ వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన స్థానిక ప్లానింగ్ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం, బాధ్యతారాహిత్యాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రధాన రహదారులు, కాలనీలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో నిర్మాణ వ్యర్థాలు పడేయడం వల్ల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన డెబ్రిస్‌ను వెంటనే తొలగించి, నిర్దేశిత ప్రదేశాలకు తరలించాలని పారిశుధ్య,టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగర పరిశుభ్రతకు భంగం కలిగించే విధంగా మట్టి, సిమెంట్, కాంక్రీట్ వ్యర్థాలు లేదా ఇతర నిర్మాణ సామగ్రిని బహిరంగ ప్రదేశాలలో వేస్తున్న వారిని గుర్తించి, నిబంధనల ప్రకారం భారీ జరిమానాలు విధించాలని సూచించారు. నగరంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అలాగే వార్డ్ ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు అక్కడే ఉండి పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, డిఈఈలు రమేష్ బాబు, వెంకటరమణ, ఎస్ఎస్ సోమశేఖర్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుక

గుంటూరు, జూన్ 10, ప్రభాతవార్త ప్రతినిధి: పముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ 66వ జన్మదినం సందర్భంగా గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు కార్యాలయంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాలకృష్ణ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదే సందర్భంగా గుంటూరు మిర్చి యార్డ్ డైరెక్టర్ మేళం సైదయ్య



జన్మదినాన్ని కూడా పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుర్రా అప్పారావు గారు మాట్లాడుతూ, బాలకృష్ణ గారు తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన గొప్ప నటుడని, తన నటనతో కోట్లాది మంది అభిమానుల ప్రేమను సంపాదించుకున్నారని అన్నారు. సినీ రంగంతో పాటు ప్రజా ప్రతినిధిగా కూడా ప్రజలకు సేవలందిస్తూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. బాలకృష్ణ గారు మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో, విజయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం మేళం సైదయ్య గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన యార్డ్ అభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యార్డ్ డైరెక్టర్లు పాల్గొని బాలకృష్ణ గారికి, మేళం సైదయ్య గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

## టెన్త్ షార్టు మెమోలో విద్యార్థుల వివరాలు సవరణకు ఈనెల 15 వరకు గడువు పెంపు

గుంటూరు విద్య జూన్ 10 ప్రభాతవార్త : ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరుజిల్లాలోనిఅన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలాగిన్ లో ఉన్న పదవ తరగతి పరీక్షల షార్ట్ మార్కుల మెమోలను డౌన్లోడ్ చేసుకొని సంతకము, సీల్ తో విద్యార్థులకు అందించే సదుపాయమును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు గుంటూరుజిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష ఒక ప్రకటన తెలియజేశారు విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో ఏమైనా తప్పులుంటే సరి చేసుకునే సదుపాయమును 15వ తేదీ వరకు సంబంధిత పాఠశాలలప్రధానోపాధ్యాయులు భవిష్యత్తులో పొరపాట్లకు తావు లేకుండా ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని, ఈ విషయంలో జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తగు చొరవ చూపవలసిందిగా శ్రీ సలీం భాష కోరారు

## ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

గుంటూరు విద్య జూన్ 10 ప్రభాతవార్త : గుంటూరు తూర్పు నియోజకవర్గ టిడిపి కార్యాలయములో,హిందూపూర్ శాసనసభ్యులు ,సినీ నటుడు,ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ , శ్రీ వికాస్ విద్యాసంస్థల అధినేత రాజా మాష్టారు కేక్ కట్ చేసి,అందరికీ పంచి పెట్టారు.ఈ సందర్భముగా రాజామాష్టారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వారసుడు నందమూరి బాలకృష్ణ కి,గుంటూరు తూర్పు నియోజక వర్గ టిడిపి తరపున ఎమ్మెల్యే నసీర్ తరపునా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ,ఎన్టీఆర్ ఏవిధంగా నటుడిగాను,రాజకీయ నాయకుడిగాను ప్రజలలో రాణించారో,అదేవిధంగా నందమూరి బాలకృష్ణ కూడా రాణిస్తున్నారని ప్రశంసించారు. చంద్రబాబు,లోకేష్ బాబు,తెలుగు దేశం పార్టీకి అండగా ఉన్నారని, బాలకృష్ణ ఇటువంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టి బాబు,యార్డ్ డైరెక్టర్ సత్యం, ఏడుకొండలు,కస్తర్లుఅన్వర్, చల్లా ప్రసాద్,పోతురాజు చంద్ర,నిజాముద్దీన్,కొల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

రేపల్లె, జూన్ 10, ప్రభాతవార్త:పట్టణంలోని సాయిబాబా దేవాలయం వద్ద బుధవారం చెట్ల కొమ్మలు నరుకుతున్న రేపల్లె మండలంలోని మోర్లవారిపాలెంకు చెందిన శొంఠి కోటేశ్వరరావు(45) ప్రమాదవశాత్తూ చెట్టుపై నుండి కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది.క్షతగాత్రుడు తుదిశ్వాస విడిచాడు.మృతునికి ఇరువురు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.మృతుడి భార్య శివనాగులు ఫిర్యాదు మేరకు రేపల్లె టౌన్ సిఐ బి.అశోక్‌కుమార్ ఆదేశాల ప్రకారం మహిళా ఎస్ఐ రాజ్యలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ముగిసిన అంగన్‌వాడీ ఉద్యోగుల శిక్షణ

రేపల్లె, జూన్ 10, ప్రభాతవార్త:పట్టణంలోని ట్రిబుల్ ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 0-6 సంవత్సరాల పిల్లల కోసం కృత్రిమ మేధస్సు,ఆధారిత బాల్య వికాస స్క్రీనింగ్‌పై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు,సూపర్‌వైజర్లు,సిబ్బందికి రెండు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. చిన్నారుల ఎదుగుదల,అభివృద్ధి దశలను ప్రారంభదశలోనే గుర్తించేందుకు కృత్రిమ మేధస్సు,స్క్రీనింగ్ విధానలపై సమగ్ర అవగాహన కల్పించారు.స్క్రీనింగ్‌యాప్ వినియోగం,డేటా నమోదు విధానం,పిల్లల అభివృద్ధి లోపాలను గుర్తించి తగిన సేవలను అందించే విధానాలపై శిక్షణనిచ్చారు.చిన్నారుల శారీరక,మానసిక,సామాజిక,భాషా వికాసాన్ని అంచనావేసి రిసోర్స్‌పర్సన్స్ సిడిపివో ఎం.సుచిత్ర,మోళ్ళగుంట పిహెచ్‌సి డాక్టర్ కిషోర్,హిమబిందు,సునీత,రాధిక, జ్యోతిలక్ష్మి, వెంకటరమణ,నాగలక్ష్మి అవగాహన కల్పించారు.

## తమిళనాడులో పరారైన రిమాండ్ ఖైదీ అజిత్‌కుమార్ అరెస్ట్

రేపల్లె, జూన్ 10, ప్రభాతవార్త:రేపల్లె సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటూ అనారోగ్యం కారణంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కాపలా పోలీసులు కళ్ళుకప్పి పరారైన భీముడు అజిత్ కుమార్‌ను ఎట్టకేలకు తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు.పరారైన రిమాండ్ ఖైదీ కోసం నాలుగు రాష్ట్రాల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.తమిళనాడు రాష్ట్రంలోని తిరువూరు ఏరియాలో ఒక కేసు విచారణలో భాగంగా అజిత్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.రిమాండ్ ఖైదీ అచూకీ తెలియడంతో గుంటూరు జిల్లా పోలీసులు పిటి వారెంట్‌పై తమిళనాడు రాష్ట్రానికి వెళ్ళినట్లు విశ్వసనీయ సమాచారం.తెనాలిలో నమోదైన మరో కేసులో అజిత్‌కుమార్ రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.పరారైన భీముడు అజిత్‌కుమార్ సెల్ ఫోన్ వినియోగించకుండా తరచూ తన స్థావరాలను మారుస్తూ పోలీసులకు దొరకకుండా తప్పించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.నకిలీ వే బిల్లులు,తప్పుడు చిరునామాలతో బ్యాంకులను మోసం చేయడం,ఓఎల్ఎక్స్ వేదికగా ఆనేక మోసాలకు పాల్పడిన నేరాలపై అజిత్‌కుమార్‌పై కేసులు నమోదయ్యాయి.రేపల్లె సబ్ జైల్ నుంచే ఒక పథకం ప్రకారం భీముడు అజిత్‌కుమార్ పరారీకి మార్గం ఏర్పడిందనే కోణంలో విచారణ జరిపిన జైలు,పోలీసు శాఖల అధికారులు రేపల్లె సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు,ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్,ఐదుగురు పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

## ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి:ఆర్డీవో శ్రీదేవి

రేపల్లె, జూన్ 10, ప్రభాతవార్త:ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించాలని రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి చెప్పారు.బుధవారం రేపల్లె మున్సిపల్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్లు,బూత్ లెవల్ ఏజంట్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో బి.శ్రీదేవి మాట్లాడుతూ బూత్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు,ఓటరు జాబితాకు సంబంధించి బిఎల్‌వో,బిఎల్ఎలు నిబంధనల ప్రకారం విధులను నిర్వహించాలని ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రణాళిక ప్రకారం బిఎల్‌వో,బిఎల్ఎలు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.అదే విధంగా ఇంటింటి సర్వే,అర్హులైన ఓటర్ల నమోదు,వివరాల ధృవీకరణ తదితర అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు,బూత్ లెవల్ ఆఫీసర్లు,బూత్ లెవెల్ ఏజంట్లు,ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఓటు హక్కు కల్పించాలి: రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి

రేపల్లె, జూన్ 10, ప్రభాతవార్త:భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులకు విధిగా ఓటు హక్కు కలి ్పంచాలని రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి చెప్పారు.బుధవారం ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా మండల రెవెన్యూ కార్యాలయంలో బిఎల్‌వో,బిఎల్ఎలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నకిలీ ఓట్లను తొలగించాలని అదే విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.రేపల్లె మండల తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ల వివరాలను సేకరించాలని చెప్పారు.ముసాయిదా ఓటర్ల జాబితా జూలై 21వ తేదీ విడుదలవుతుందన్నారు.జూలై 21 నుండి ఆగస్టు 20వ తేదీ వరకు సలహాలు,అభ్యంతరాలను స్వీకరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.సెప్టెంబరు 22వ తేదీ తుది ఓటర్ల జాబితా విడుదలవుతుందని ఆయన వివరించారు.జూలై 1వ తేదీ 2026 సంవత్సరం నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో బిఎల్‌వో,బిఎల్ఎలు, ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గడియార స్తంభం వద్ద తాగునీటి పైపులైన్ లీకేజీ పరిశీలించిన కమీషనర్ హాసీని

బాపట్ల,జూన్10,ప్రభాతవార్త,ప్రతినిధి: బాపట్ల పట్టణంలోని గడియార స్తంభం జంక్షన్ వద్ద ప్రధాన తాగునీటి పైపులైన్‌లో ఏర్పడిన లీకేజీని పురపాలక సంఘ కమిషనర్ ఎం. హాసిని బుధవారం ఉదయం పరిశీలించారు. లీకేజీ కారణంగా తాగునీరు వృథా అవుతున్న విషయాన్ని గుర్తించిన ఆమె, సమస్యను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఎస్.ఆర్. కృష్ణారెడ్డిని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టి, తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణంలోని తాగునీటి పైపులైన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి వృథాను నివారించడంతో పాటు ప్రజలకు నిరంతరాయంగా నీటి సరఫరా అందించేందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు.

## నేర సమీక్షా సమావేశం

గుంటూరు క్రైమ్,జూన్10,ప్రభాతవార్త: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం,పోలీస్ సేవల మెరుగుదల లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం మే-2026 నెల నేర సమీక్ష సమావేశం ను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన వివిధ రకాల నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, కేసుల ఛేదన శాతం, నేరస్థుల అరెస్టులు, పెండింగ్ కేసుల స్థితి, కోర్టుల్లో ఛార్జిషీట్ల దాఖలు, శిక్షల సాధన, రౌడీషీటర్లు, పీడీ యాక్ట్ ప్రతిపాదనలు, మాదకద్రవ్యాల నియంత్రణ,మహిళా భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, రాత్రి గస్తీలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.కొంతమంది పోలీస్ అధికారులు ప్రజల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, బాధితులకు న్యాయం చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వస్తున్నాయని, అటువంటి అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు అదేవిధంగా పిజిఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును సత్వరంగా, నాణ్యమైన రీతిలో పరిష్కరించి, అదే సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.తీవ్రమైన నేరాలు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, హత్యలు, దోపిడీలు, మోసాలు తదితర కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత కాలవ్యవధిలో ఛార్జిషీట్లు దాఖలు చేయాలి.కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసులను ప్రత్యేకంగా పర్యవేక్షించి, సాక్ష్యాధారాలను సమర్థవంతంగా సమర్పించి శిక్షల శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి.ప్రతి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లను వారానికొకసారి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలి. బైండోవర్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేస్తూ వారి కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలి.మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, డ్రగ్ డిటెక్షన్ కిట్స్ వినియోగంతో విస్తృత తనిఖీలు నిర్వహించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సరఫరా మూలాలను గుర్తించి సమూలంగా నిర్మూలించాలి.మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో నిందితులపై తప్పనిసరిగా సస్పెక్ట్ షీట్లు నమోదు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.ప్రతి పోలీస్ అధికారి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక భద్రతా సంహిత, భారతీయ సాక్ష్యాధార చట్టం,వంటి నూతన చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి ప్రమాదాలకు గురయ్యే ప్రదేశాలను గుర్తించి, అవసరమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, జిగ్‌జాగ్ లైన్లు ఏర్పాటు చేయాలి.సర్వీస్ రోడ్ల నుండి హైవేలపైకి అనధికారికంగా ప్రవేశించే ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను అరికట్టాలి. హెల్మెట్, సీటుబెల్ట్, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలి.డయల్100, డయల్112,శక్తి కాల్స్‌పై తక్షణ స్పందన అందించి, సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు వేగవంతమైన సహాయం అందించాలి.మహిళా భద్రత, శక్తి యాప్, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.విద్యార్థులకు స్వీయ రక్షణ, వ్యక్తిగత భద్రత, సైబర్ అవగాహనపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి.అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి గస్తీలు పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.రాత్రిపూట అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వివరాలను సాంకేతిక పరికరాల సహాయంతో సేకరించి, పోలీస్ డేటాబేస్‌లో నమోదు చేయాలి. జిల్లా అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఎ.టి.వి. రవికుమార్ (లి వీ),ఎ. హనుమంతు (ఎఆర్),ఎస్బీ డీఎస్పీ అలహారి శ్రీనివాస్,ఏఆర్ డీఎస్పీ సంకురయ్య,ఇతర డీఎస్పీలు, సీఐలు,ఎస్సైలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లు అరెస్ట్

గుంటూరు క్రైమ్,జూన్10,ప్రభాతవార్త: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 11 మంది వ్యక్తులను నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం మధ్యాహ్నం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధి లోని, స్వర్ణ భారతి నగర్ ఎదురు ఇన్ లగ్జరీ రూమ్ నందు పేకాట జరుగుతున్నదని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి రాబడిన సమాచారంతో ఎస్బి డిఎస్పీ ఆదేశాల మేరకు నల్లపాడు స్టేషన్ సిబ్బందితో పేకాట జరుగు ప్రదేశం వద్దకు వెళ్ళి రైడ్ చేయగా మూడవ అంతస్తులో రూమ్ నెంబర్స్ 303,304, ల నందు 11మంది పేకాట ఆడుతున్నారు. వారిని చెక్ చేసి వారి వద్ద నుండి10 సెల్ ఫోన్స్,16,200 / రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## తాగునీటి వ్యవస్థ బలంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుంది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 10, ప్రభాతవార్త: పట్టణంలో రూ.52 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైపు లైన్ నిర్మాణ పనులకు ప్రత్తిపాటి శంకుస్థాపన, తాగునీటి సరఫరా, నిర్వహణ వ్యవస్థలు బలంగా, మెరుగ్గా ఉంటేనే ప్రజలకు సురక్షితమైన తాగునీరు లభిస్తుందని, దాంతో వారి ఆరోగ్యం బాగుటుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని 8, 12 వార్డుల్లో రూ.52 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన తాగునీటి వాటర్ పైప్ లైన్ నిర్మాణ పనులకు, స్థానిక నాయకులతో కలిసి ప్రత్తిపాటి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మునిసిపాలిటీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, రోడ్లు, డ్రైనేజ్ లు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గత పాలకులు ఐదేళ్లలో పట్టణంలో చేయలేని అభివృద్ధిని చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం, కేవలం 20 నెలల్లోనే చేసి చూపిందన్నారు.



ఎవరు మాటల నాయకులో.. ఎవరు చేతల నాయకులో ప్రజలు గ్రహించాలని, స్థానిక ఎన్నికల్లో మొత్తం వార్డులు కూటమిపార్టీలే క్లీన్ స్వీప్ చేసేలా జనం తీర్పు ఉండాలని ప్రత్తిపాటి కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు ముల్లా కరిముల్లా, షేక్ వాహబ్, మురకొండ మల్లిబాబు, బేరింగ్ మౌలాలి, షేక్ అజారుద్దీన్, దరియావలి, అబ్దుల్ మజీద్, పిల్లి లెనిన్, గేరా రాము, జాషువా, బాజీ, బారి, బీడింగ్ కరిముల్లా, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఈ అబ్దుల్ రహీమ్, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ రికార్డు ఎప్పటికీ చెక్కు చెదరదు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 10, ప్రభాతవార్త: ప్రధాని హోదాలో మోదీ మొదటి సారి 2104లో చిలకలూరిపేటకు వచ్చినప్పుడే, మీరు సుదీర్ఘకాలం ప్రధానిగా ఉంటారని చెప్పానని, ఆ మాట నేడు నిజమైందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మోదీ పాలన 12 ఏళ్లు పూర్తైన సందర్భంగా స్థానిక బీజేపీ నేతలు బుధవారం పట్టణంలోని గంగా పార్వతీ సమేత ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. మీరు చరిత్ర సృష్టించబోతున్నారని నాడే మోదీకి చెప్పాను.. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే అత్యంత అనుభవజ్ఞులైన నాయకులని, వారి పాలనలో దేశం, రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నా యన్నారు. ఢిల్లీలో మోదీ.. ఏపీలో బాబు జోడీ ఉంటే రాష్ట్రంలో పేదరికం తొలగిపోయి, ఆర్థిక అసమానతలు లేకుండా పోతాయన్నారు. కూటమి పార్టీలు నిర్వహించిన బహిరంగసభ కోసం, ప్రధాని హోదాలో మోదీ చిలకలూరిపేటకు వచ్చారని, ఆనాడే మీరు మూడోసారి ప్రధాని కాబోతున్నారని, ఎక్కువకాలం దేశాన్ని పరిపాలించిన నాయకుడిగా చరిత్ర సృష్టించనున్నారని చెప్పినట్టు ప్రత్తిపాటి తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమంలో అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడటం గర్వించాల్సిన విషయమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరమకుశం శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమ కుమార్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొత్త కోటేశ్వరరావు, చెవూరి కృష్ణా, బీజేపీ నాయకులు పోట్రూ పూర్ణ చంద్రరావు, కోట పవన్ కుమార్ గాంధీ, వంశీ, వారికుటి నాగేశ్వరరావు, మహేష్, శ్రీనివాసరావు, రాజ్య లక్ష్మీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పేటలో 16న మెగా జాబ్ మేళా: అర్బన్ సీఐ రమేష్

చిలకలూరిపేట, జూన్ 10, ప్రభాతవార్త: :పట్టణంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 16వ తేదీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు అర్బన్ సీఐ పి. రమేష్ తెలిపారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో, మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఈ కార్యక్రమం జరగనుంది. పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రత్తిపాటి గార్డెన్స్ లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ జాబ్ మేళా కొనసాగుతుంది. ఈ మేళాలో సుమారు 50 కంపెనీలు పాల్గొంటున్నాయని, దాదాపు 2,000 ఉద్యోగ ఖాళీలు అందుబాటులో ఉన్నాయని సీఐ పేర్కొన్నారు. 10వ తరగతి నుండి పీజీ వరకు విద్యార్హత కలిగి, 18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ప్రతి మూడు నెలలకొకసారి నిరుద్యోగుల కోసం ఇలాంటి ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అర్హులైన హాజరై సద్వినియోగం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## అబ్దుల్ కరీం మృతికి ప్రత్తిపాటి సంతాపం

చిలకలూరిపేట, జూన్ 10, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం డి హనీఫ్ సోదరుడు షేక్ అబ్దుల్ కరీం ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకుని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కరీం కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## ప్రాణాలకు విలువ ఇవ్వండి, నిబంధనలను పటిష్టంగా అమలు చేయండి: మాదాసు భాను ప్రసాద్

చిలకలూరిపేట, జూన్ 10, ప్రభాతవార్త: వైజాగ్ స్టీల్ ప్లాంట్ లో ప్రమాదం చాలా దురదృష్టకరం. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే వాటి గురించి మాట్లాడుతున్నారని అడ్వకేట్, సామాజికవేత్త భాను ప్రసాద్విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అమలులో జరుగుతున్న లోపాలను సమర్థవంతంగా పరిష్కరించకపోతున్నారు. ఈ ప్రమాదంలో 8 మంది మృత్యువాత పడ్డారు, పలువురు క్షతగాత్రులైనారు. ప్రభుత్వం యథావిధిగా నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకుంటుంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కూడా నామమాత్రంగానే ఉంటుంది. నివారించదగిన ప్రమాదాల నుండి నిత్యం ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నా పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతున్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వేసే హడావుడి తరువాత ఉండటలేదు. ఏదైనా స్కూల్ బస్ ప్రమాదం జరిగినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ బస్సుల గురించి హడావిడి చేస్తున్నారు, ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైనప్పుడు ట్రావెల్స్ బస్సు గురించి హడావిడి చేస్తున్నారు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆ కొన్ని రోజులు వాటి గురించి మాట్లాడుకోవడం పరిపాటిగా మారింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం నివారించదగిన ప్రమాదాల నుండి ఎందుకు ప్రజల ప్రాణాలను కాపాడలేకపోతున్నాము అనే విషయాన్ని లోతైన చర్చ చేయాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రచారం కోసం చేసే ఆర్భాటం కంటే ఇది చాలా ముఖ్యమైన విషయంగా పాలకులు గుర్తించాలి. ఇప్పుడు వైజాగ్ స్టీల్ ప్లాంట్లో పనిచేసే కార్మికులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన ఆ లోపానికి సంబంధించిన విషయాన్ని వెంటనే పరిష్కరించి, ఏవైనా పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటే వెంటనే అమర్చి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలు పటిష్టంగా చేపట్టాలని అడ్వకేట్, సామాజికవేత్త భాను ప్రసాద్విజ్ఞప్తి చేశారు.



## చిలకలూరిపేట లో టైర్ పేలి అదుపుతప్పిన కారు.. ఐదుగురికి స్వల్ప గాయాలు

చిలకలూరిపేట, జూన్ 10, ప్రభాతవార్త: :హైదరాబాద్ నుండి సూర్యలంక బీచ్‌కు వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ కారు పసుమర్రు గ్రామ మలుపు వద్ద టైర్ పేలడంతో అదుపుతప్పి పక్కకు పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా, పేట రూరల్ పోలీసులు వెంటనే స్పందించి బాధితులను 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికు లందరూ క్షేమంగా ఉన్నారని ప్రాథమికంగా తెలిసింది. ప్రమాదానికి సంబంధించి మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# పల్నాడు జిల్లా వార్త



## అభయాంజనేయ స్వామికి డాక్టర్ గోపిరెడ్డి ప్రత్యేక పూజలు

నరసరావుపేట టౌన్, జూన్ 10 ప్రభాతవార్త: మండలంలోని దొండపాడు గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి 3వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలలో పల్నాడు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు గ్రామ వైకాపా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి స్వామివారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని ఆకాంక్షించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో తనను భాగస్వాములు చేసిన గ్రామ పెద్దలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపాలి: డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, జూన్ 10 ప్రభాతవార్త : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలుచేయకుండా పరిపాలన కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపాలని వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి, నల్ల బెలూన్లను ఎగరవేశారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ, ఈ రాష్ట్రాన్ని 1:3 రేషియోలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు దోచుకుంటున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసగించిందని మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి కోసం మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. యువతను కూటమి ప్రభుత్వం దగా చేసిందని అన్నారు. టీడీపీ నిర్వహించిన సర్వే లో ఆ పార్టీ గ్రాఫ్ 10 పడిపోయిందని, వైసీపీ గ్రాఫ్ 6 పెరిగిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని, ఆ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కార్యకర్తలే పరిపాలన నిర్వహిస్తారని తెలియజేశారు. ఈనెల 12న "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్క వైసీపీ కార్యకర్త ర్యాలీలో పాల్గొనాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.




## ప్రతి బూత్‌లో 100శాతం సాధన లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, జూన్ 10 ప్రభాతవార్త : నరసరావుపేట నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో 100 కవరేజీ లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బూత్ లెవల్ ఏజెంట్లకు సూచించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్‌లో భాగంగా రొంపిచర్ల మండల స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బీఎల్ఏలకు స్పష్టమైన, ఖచ్చితమైన మార్గదర్శకాలు అందించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న వారందరి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, లోపాలను సవరించుకోవాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఏ తమ బూత్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, ఫారం6, ఫారం7, ఫారం8 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓటర్ల గుర్తింపు వంటి పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో కనీసం 95 మంది ఓటర్ల ఫోటోలు, మొబైల్ నంబర్లు, ఆధార్ లింక్ కొత్తవి ఉండేట్లు చూసుకోవాలి. 1819 ఏళ్ల యువతను గుర్తించి, కనీసం 2,500 మందిని అదనంగా నమోదు చేయాలి. మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు చర్యలు చేపట్టాలి. ప్రతి బీఎల్ఏ వారానికి కనీసం నాలుగు రోజులు ఫీల్డ్‌లో ఉంటూ డైరీ నిర్వహించాలి. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల లోగా నియోజకవర్గ కార్యాలయానికి నివేదిక సమర్పించాలి. ఓటర్ల సమస్యలు (పేరు, వయస్సు, చిరునామా తప్పులు) 72 గంటల్లో పరిష్కరించి, ఎన్నికల అధికారులకు అప్‌లోడ్ చేయాలి. ఈ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో ఓటర్ల నమోదుకు దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు, మండల అధ్యక్షులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.



## ఈశ్వర్ విద్యార్థులకు ఉచిత శిక్షణ

నరసరావుపేట టౌన్, జూన్ 10 ప్రభాతవార్త: : కేసానుపల్లి గ్రామంలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాల పెంచడమే లక్ష్యంగా నాల్గోవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ఆప్టిట్యూడ్, రీజనింగ్ మరియు సాఫ్ట్ స్కిల్స్‌పై 8 రోజుల ఉచిత శిక్షణ తరగతులను నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహీంద్రా ప్రైడ్ క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్ ద్వారా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. శిక్షణలో మహీంద్రా ప్రైడ్ ట్రైనర్లు ఆయేషా, అశోక్, సాగర్ లు పాల్గొని విద్యార్థులకు ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, గ్రూప్ డిస్కషన్, వ్యక్తిత్వ వికాసం మరియు ఉద్యోగావకాశాలకు అవసరమైన నైపుణ్యాలపై సమగ్ర శిక్షణను అందించినట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ షేక్. కరీం మోహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్. మస్తాన్ షరీఫ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్. నజీమా, ప్లేస్ మెంట్ ఆఫీసర్ షేక్. ముజీర్ , మహీంద్రా ప్రైడ్ ప్రతినిధుల పాల్గొన్నారు.



## ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు

రొంపిచర్ల, జూన్ 10 ప్రభాతవార్త : నరసరావుపేట నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం బాలకృష్ణ యువసేన ఆధ్వర్యంలో సినీ హీరో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బాలకృష్ణ యువసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు అల్లంశెట్టి మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. మిఠాయిలను పంచిపెట్టడంతో పాటు అనాథ శరణాలయాల్లో అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణ స్ఫూర్తితో సమాజ సేవా కార్యక్రమాలలో అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పిలుపునిచ్చారు. అనంతరం శివుని బొమ్మ సెంటర్‌లో బాలకృష్ణ ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన కేక్‌ను కూడా ఎమ్మెల్యే అరవింద బాబు కేక్ కట్ చేసి అభిమానులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు నల్లపాటి రామచంద్ర ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్త , బత్తుల మురళి, యువసేన నాయకులు, బాలకృష్ణ అభిమానులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## ఎన్ సి సి సర్టిఫికెట్ పరీక్షలో 100శాతం ఉత్తీర్ణత : ఎన్ ఈ సి కళాశాల విద్యార్థుల విజయం

నరసరావుపేట టౌన్,జూన్ 10 ప్రభాతవార్త :: 2026 వ సంవత్సరానికి గాను ఎన్ సి సి ఖిబిఖి సర్టిఫికెట్ పరీక్ష ఫలితాలలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల క్యాడెట్లు 100 ఉత్తర్ణత సాధించారని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్ తెలిపారు. 2026 ఫిబ్రవరి 28 మరియు మార్చి 01వ తేదీలలో జరిగిన బి సర్టిఫికెట్ పరిక్ష పలితాలను గుంటూరు ఎన్ సీసీ గ్రూప్ విడుదల చేసింది. మొత్తం తమ కళాశాల నుండి 13 మంది క్యాడెట్లు హాజరయ్యారని, 100 ఉత్తర్ణత సాధించారని తెలిపారు. క్యాడెట్లకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు హాజరై, క్యాడెట్లు ఉత్తమ ఫలితాలు సాధించటంలో విదిది అధికారి టి. అఖిల్ పాత్ర వుందన్నారు. కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేషు లు మాట్లాడుతూ రోజువారి ప్రణాళిక, సమయపాలన మరియు ఉత్తమ శిక్షణ వలన క్యాడెట్లు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో హవల్దార్ కె. ఎల్. రావు, అమన్ కుమార్ చేతుల మీదుగా క్యాడెట్లకు ఎన్సీసీ ఖిబిఖి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. వెంకటే శ్వర్లు పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో 'కూటమి' విజయానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: స్థానిక కాకతీయ కల్యాణ మండపం నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(నియోజకవర్గ స్థాయి )మరియు స్థానిక ఎన్నికల సన్నద్ధతపై తెలుగుదేశం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ కాకతీయ కల్యాణ మండపం నందు సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జిలతో బి ఎల్ ఏ లతో శిక్షణ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధివిధానాలు, బాధ్యతలు, అమలు ప్రక్రియపై సవివరంగా వివరించి అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల సన్నద్ధత, ఓటరు జాబితాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. అలాగే రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో మరింత మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు జీవీ గారు సూచించడం జరిగింది. ఈ సమావేశంలో బీఎల్ఏలకు స్పష్టమైన, ఖచ్చితమైన మార్గదర్శకాలు అందించారు. ప్రతి బూత్‌లో 100 శాతం కవరేజీ లక్ష్యంగా పనిచేయాలని కన్నా లక్ష్మి నారాయణ గారు సూచించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న వారందరి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, లోపాలను సవరించుకోవాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఏ తమ బూత్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, ఫారం6, ఫారం7, ఫారం8 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓటర్ల గుర్తింపు వంటి పనులు పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో కనీసం 95 మంది ఓటర్ల ఫోటోలు, మొబైల్ నంబర్లు, ఆధార్ లింక్ కొత్తవి ఉండేట్లు చూసుకోవాలి. 1819 ఏళ్ల యువతను గుర్తించి, కనీసం 2,500 మందిని అదనంగా నమోదు చేయాలి. ప్రస్తుతం ఉన్న మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు చర్యలు చేపట్టాలి. ప్రతి బీఎల్ఏ వారానికి కనీసం నాలుగు రోజులు ఫీల్డ్‌లో ఉంటూ డైరీ నిర్వహించాలి. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల లోగా నియోజకవర్గ కార్యాలయానికి నివేదిక సమర్పించాలి. ఓటర్ల సమస్యలు (పేరు, వయస్సు, చిరునామా తప్పులు) 72 గంటల్లో పరిష్కరించి, ఎన్నికల అధికారులకు అప్‌లోడ్ చేయాలి. ఈ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో ఓటర్ల నమోదుకు దోహదపడాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో స్పెషల్ డ్రైవ్ లో భాగంగా డ్రైవర్లను డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను సత్తెనపల్లి పోలీసులు చేపట్టారు.



## విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

నరసరావుపేట క్రైమ్, జూన్ 10 ప్రభాతవార్త : విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగము, ఆపరేషన్ విభాగము సంయుక్తంగా డా.పి . విజయకుమార్ ఆధ్వర్యములో ఆకస్మిక తనిఖీలు జరిగాయి. నరసరావుపేట డి 2 సెక్షన్ లో ప్రకాష్ నగర్, వరవకట్ట, అరండల్ పేట, రామిరెడ్డి పేట, ఇస్లంపేట, 60 ఫీట్ రోడ్డు యందు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.పి. ఇ (విజిలెన్సు) జి .సుందరబాబు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ రాంబట్లు తెలిపారు. ఈ తనిఖీలలో 51 మంది అధికారులు, 164 మంది సిబ్బంది, 51 బృందాలుగా ఏర్పడి 3660 సర్వీసులు తనిఖీచేశారు. అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరి లో విద్యుత్ వాడుకుంటున్న 2 మందికి రూ. 0.10 లక్షలు, అదనముగా విద్యుత్ వాడుతున్న 120 మందికి రూ 6.02 లక్షలు మొత్తము రూ. 6.12 లక్షలు అపరాధ రుసుము విధించారు. విద్యుత్ చౌర్యం సామజిక నేరం అని విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812262, 8639741050, నెంబర్లకు నేరుగా లేదా వాట్స్ అప్ ద్వార సంప్రదించవచ్చు అన్నారు . సమాచారం అందించిన వివరాలను గోప్యముగా ఉంచబడ తాయని అన్నారు. ఈ దాడులలో ఆపరేషన్ విభాగ డిఈఈ .ఎల్ వి . ప్రసాద రావు, డి.పి.ఇ (విజిలెన్సు) డి .ఈ .ఈ లు ఎస్ శ్రీనివాసరావు, ఆపరేషన్ విభాగ ఏఈఈ .కె . నాగసు రేంద్ర కుమార్, డి.పి. ఇ (విజిలెన్సు) ఏ .ఈ .ఈ లు, దుర్గా రావు, కె .కోటేశ్వరరావు, మరియు ఆపరేషన్ డిఈఈ అండ్ ఏఈఈ లు పాల్గొన్నారు..



## 15న కృష్ణవేణి కాలేజీలో మెగా జాబ్ మేళా

నరసరావుపేట , జూన్ 10 ప్రభాతవార్త : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఈ నెల 15 మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. నరసరావుపేట పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మెగా జాబ్ మేళాకు సుమారు 20 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. అభ్యర్థుల విద్యార్హతను బట్టి జీతం సుమారు రూ.15,000 30,000 వరకు ఉండవచ్చని అన్నారు. 10, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న 18 30 ఏళ్లు గల నిరుద్యోగ యువతి యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా / రెస్యూమ్, విద్యా సర్టిఫికేట్ల జిరాక్స్, ఆధార్ కార్డ్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9866929567 / 9502728949 సంప్రదించాలన్నారు.

## నరసరావుపేట సమీపంలో రోడ్డు ప్రమాదం

నరసరావుపేట క్రైమ్, జూన్ 10 ప్రభాతవార్త:: పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పరిధిలోని గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాకాని జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో గుంటూరు వైపు నుంచి ఎరువుల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు లారీ అదుపుతప్పి రహదారి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సత్తెనపల్లికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, లీలావతి తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ మాత్రం తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రాత్రి సుమారు 11:35 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదాన్ని విధి నిర్వహణలో భాగంగా అటుగా వెళ్తున్న ఎస్సై సుందర్ రాజన్ గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను బయటకు తీసి 108 అంబులెన్స్ ద్వారా నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై రూరల్ ఎస్సై చల్లా కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమం

సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలంలోని ఫణిధం గ్రామంలో గుంటూరు జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పొలం సంరక్షణ ప్రచార కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, గుంటూరు, శాస్త్రవేత్త డా. గంగాదేవి ,బి సుబ్బారెడ్డి ,మండల వ్యవసాయ అధికారి, సత్తనపల్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు ఆధారంగా, ఎరువులు వినియోగించడం ద్వారా, రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గటంతో పాటు మంచి దిగుబడులు పొంది అధిక ఆదాయాన్ని పొందవచ్చు అని సూచించారు. రైతులు పచ్చిరొట్టె పైర్లు అయిన జనుము, జీలుగ మరియు పిల్లిపెసర పంటలు సాగు చేసుకుని భూమిలో కలియ దున్నుకోవటం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెంచుకోవచ్చని తెలియజేశారు. పచ్చి రొట్టె పైర్లు, జీవన ఎరువులు మరియు పశువుల ఎరువు, ఈ విధంగా సమతుల్య ఎరువులు వినియోగంతో నేల ఆరోగ్యం పరిరక్షించడంతోపాటు పంటలు దిగుబడి మరియు నాణ్యత మెరుగుపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు యూరియా మరియు డిఏపి ఎరువులు అమ్మకాలు వ్యవసాయ శాఖ ద్వారా నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీఎఐఎంఎస్ (ఆఈఆలీఈ 2.0) యాప్ ద్వారా జరుగుతాయని తెలియజేశారు. ఈ యాప్ రెవెన్యూ శాఖకు చెందిన వెబ్ ల్యాండ్ పోర్టల్ తో అనుసంధానమై ఉండటం వలన రైతు ఆధార్ నెంబర్ అతని భూమి వివరాలు గ్రామాల వారీగా, సర్వే నంబర్లు వారీగా, సాగు విస్తీర్ణం స్క్రీన్ పై ప్రత్యక్షమవుతాయి. ఆ యొక్క సాగు విస్తీర్ణంలో రైతు ఏ పంట సాగు చేశారు, దానికి శాస్త్రీయంగా ఎంత మోతాదులో ఎరువులు అవసరం అనే లెక్కల ఆధారంగానే ఇకపై యూరియా మరియు డిఏపి ఎరువులు విక్రయించనున్నారు అని తెలియజేశారు. కావున ప్రతి ఒక్క రైతు మీ మీ గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల నందు సిబ్బందిని సంప్రదించి ఏ పంటలు సాగు చేసారో వారి వద్ద నమోదు చేసుకోవాలని తెలియజేశారు. రైతులు సాగు చేసేటటువంటి పంటలు రైతు సేవా కేంద్రాలలో నమోదు ఆధారంగానే, యూరియా మరియు డిఏపి ఎరువులు కేటాయింపు జరుగునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫణిధం రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.




## చేనేత కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: చేనేత కార్మికుల పెండింగు సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఈనెల 22న మంగళగిరి హ్యాండ్లూమ్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే చేనేతల ధర్నా జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలు మరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక కొత్తపేటలో జరిగిన సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా శివ దుర్గారావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ చేనేత కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత సంవత్సరం ఆగస్టు 7న ప్రకటించిన విధంగా మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికునికి నేతన్న భరోసా పథకం 25 వేల రూపాయలు వెంటనే అమలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన 23 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించి సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించవలసిన త్రిఫ్ట్ ఫండ్ 27 కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని. సహకార సంఘాల జిడిసిసి బ్యాంకు అప్పులను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారానికై ఈనెల 22న మంగళగిరి హ్యాండ్లూమ్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం పలనాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, జిల్లా కమిటీ సభ్యులు పంతంగి ప్రభాకర్ ఎం గురవయ్య, జి సుసులోవ్, జి ఏసు రత్నం, వి చిన్నదిబ్బయ్య లు పాల్గొన్నారు.



## పార్టీల నాయకులకు అవగాహన




సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజక వర్గ తహసీల్దార్ అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీలకు చెందిన బూత్ ఏజెంట్లు అందరికీ సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ గురించి మరియు ఫామ్స్ గురించి అవగాహన కల్పించడం జరిగినది .

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీఓ గోపాలకృష్ణ



సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ మంగళవారం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా బొకేతో అభినందనలు తెలిపారు.

## లండన్‌లో రైలు ప్రమాదం.. 25 రోజుల తర్వాత స్వగ్రామానికి మృతదేహం



సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన శివకోటేశ్వరరావు(26) రైలు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఏడాది క్రితమే విదేశాలకు వెళ్లిన ఆయన, ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన 25 రోజుల తర్వాత సోమవారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ముద్దుల కుమారుడిని విగతజీవిగా చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

## కుంకలగుంటలో అభివృద్ధి బాట

సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: టిడిపి నేత కనుమూరి బాజీ చౌదరి చొరవతో రూ. 3.24 కోట్లతో మెయిన్ రోడ్డు విస్తరణ డ్రైనేజీ నిర్మాణం పనులు కొరకు శ్రీకారం.పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామ ప్రజల దశాబ్దాల కలను నిజం చేసే దిశగా అడుగులు పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు విస్తరణ మరియు డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభించింది. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా 3 కోట్ల 24 లక్షల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.



### ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం ప్రజావేదిక నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మరియు స్థానిక ఎన్నికల సన్నద్ధతపై తెలుగుదేశం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసే శుభాకాంక్షలు తెలియజేసారు సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు సత్తెనపల్లి పట్టణ మరియు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జిలతో శిక్షణ సమావేశం



నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధివిధానాలు, బాధ్యతలు, అమలు ప్రక్రియపై సవివరంగా వివరించి అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల సన్నద్ధత, ఓటరు జాబితాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై కన్నా గారు అవగాహన కల్పించారు. అలాగే రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో మరింత మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు జీవీ సూచించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## బాలకృష్ణను కలిసిన కాకుమాను సైదయ్య

సత్తెనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: ఎమ్మెల్యే బాలకృష్ణ 66వ జన్మదిన సందర్భంగా సత్తెనపల్లి టౌన్ బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాకుమాను సైదయ్య బాలయ్యను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## పెంచిన పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

పెదనందిపాడు జూన్ 10(ప్రభాతవార్త): పేద,మధ్య తరగతి ప్రజలకు భారంగా మారిన పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సి.పి.ఎం. మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.బుధవారం సి.పి.ఎం.పార్టీ ఆధ్వర్యంలో పెదనందిపాడు పాత బస్టాండు సెంటర్ లో,పెంచిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచబోమని నమ్మబలికి, ఎన్నికలు ముగిసిన వెంటనే వాణిజ్య సిలిండర్ ధరను అతి భారీగా పెంచి 3310 రూ.లు చేశారని ,డీజిల్, పెట్రోల్ పై మూడుసార్లు ఎనిమిది రూపాయలకు పైగా పెంచారని అన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగిన కారణంగా, నిత్యావసర సరుకులు, హోటల్స్ లో తినుబండారాల ధరలు పెరిగాయని, ఆ కారణంగా పేద ప్రజల పై పై భారం పడిందని అన్నారు.అంతర్జాతీయ మార్కెట్లో, ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్,డీజిల్ పై పన్నులు తగ్గించి, పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు కందులశ్రీనివాసరావు మాట్లాడుతూ,నిత్యావసర సరుకుల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయని, వెంటనే వాటి ధరలు తగ్గించాలని కోరారు. ఇరాన్, రష్యా నుండి చమురు కొనుగోలును కొనసాగించాలని కోరారు.మన రాష్ట్రం లో ఉత్పత్తి అవుతున్న చమురులో 50 శాతం మన రాష్ట్రానికే కేటాయించాలని కోఅరారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు జంపని రామారావు,ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు,నల్లమోతు రాజేంద్ర ,రైతు సంఘం నాయకులు పసుపులేటి శేషగిరిరావు, గొట్టిముక్కల వెంకట సుబ్బారావు,ఆటో కార్మికులు సలోమాన్. నాయక్. గోపి. కిషోర్. కోటి. ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

మంగళగిరి, జూన్ 10, ప్రభాతవార్త: హిందూపురం శాసనసభ్యులు, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డా. ఎంఎస్ఎస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు బైరుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి, బాలకృష్ణ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనంజయరావు, టిడిపి సీనియర్ నాయకులు సంక బాలాజీ గుప్తా, టిడిపి మంగళగిరి రూరల్ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రుద్ర శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



### ఎదనందిపాడు లో ఘనంగా బాలకృష్ణ జన్మదినోత్సవ వేడుకలు

పెదనందిపాడు జూన్ 10 (ప్రభాతవార్త)పెదనందిపాడు సాయి అన్నపూర్ణాలయంలో బుధవారం నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవ వేడుక సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కోడూరు రాంబాబు .రావి శివరామకృష్ణయ్య. చాగంటి సత్యహర్ష .దివి నాగరాజు .కాంద్రు ప్రసాదు ల ఆధ్వర్యంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన నటరత్న అభిమానుల సందడి కోలా హాలం మధ్య పత్తిపాడు శాసనసభ్యులు బి రామాంజనేయులు కేక్ కోసి బాలకృష్ణకు పెదనందిపాడు పార్టీ తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు , 9 మరియు 11 క్లస్టర్ ఇన్చార్జి లతో పాటు వారి పరిధిలోని యూనిట్ మరియు బూత్ ఇన్చార్జిలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై అవగాహన సమావేశాన్ని పత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. తొలుత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి. డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కోడూరు రాంబాబు. జిల్లా నాయకులు జంపని హనుమంతరావు. సంగం డైరీ డైరెక్టర్ గొల్లపూడి సాంబశివరావు. పెదనందిపాడు ఏ బి పాలెం సొసైటీ చైర్మన్లు, బత్తిన వేణు బాబు. సయింపు పార్వతి. పోపూరి రవి. బండారు రాంబాబు. పో పూరి లక్ష్మీనారాయణ. చెంచయ్య. పలువురు పార్టీ క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జు, బూత్ ఇన్చార్జిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## బాధిత బాబుకు ఆర్థిక సహాయం

పెదనందిపాడు జూన్ 10 (ప్రభాతవార్త) పెదనందిపాడు మండలం వరగాని గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అంబటి కార్తీ క్ ఆనందకుమారి ల కుమారుడు నిశ్వాన్ ఆర్విక్ (4) బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. తమ బాబును రక్షించేందుకు ఆర్థిక సహాయం చేయాలంటూ సోషల్ మీడియా ద్వారా ప్రజలకు దాతలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆ బాలుడు వైద్యం కొరకు వరగాని ఏ ఎస్ డబ్ల్యు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లోవిందు రామారావు. 5000 రూపాయల నగదును. మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ రమేష్ బాబు ద్వారా బాధితుని బంధువుల కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుల్లియ మాణిక్యరావు రామానాయుడు చిన్ననాగేశ్వరరావు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీల ఆరోగ్యం కుటుంబానికి పునాది

అమరావతి,జూన్ 10 (ప్రభాతవార్త): గర్భిణీల ఆరోగ్యం కుటుంబానికి పునాది అని పోషకాహారం తీసుకోవడం ద్వారా గర్భిణీలు ఆరోగ్యవంతంగా ఉంటారని గుడ్ షెఫర్డ్ డైరెక్టర్ సిస్టర్ యాంటో అన్నారు. జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పెదకూరపాడుకు చెందిన దాసరి మరియమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో బుధవారం గర్భిణీలకు భోజనంతోపాటు పోషకాహారాన్ని పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిస్టర్ యాంటో మాట్లాడుతూ గర్భిణీలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ల సూచనలను పాటించి ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వాలని కోరారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం సుధారాణి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని, మానసిక ప్రశాంతతో పాటు శారీరకంగా ఉల్లాసంగా ఉండాలన్నారు. బుచ్చయ్య పాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు,సిహెచ్సి స్టాఫ్ నర్స్ పూదట లిల్లీ రోజు రాణి, జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్,మన్నవ శ్రీబాల హర్ష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు భోజనంతోపాటు,కోడిగుడ్లు డ్రై ఫ్రూట్ లడ్లు,వేరుశనగ విత్తనాల లడ్లు, మామిడికాయలు,అరటి పండ్లను పంపిణీ చేశారు.




## దగ్గరుండి పంటకాలువల్లో పూడికలు తీయించిన మంత్రి నాదెండ్ల

తెనాలి జూన్10(ప్రభాతవార్త): తెనాలి శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పట్టణంలోని, పంట కాలువల పూడికతీత పనులు పరిశీలించారు.స్థానిక వివిఎస్ఆర్ కళాశాల నుంచి వైకుంఠపురం వరకు చేపడుతున్న పంట కాలువల అభివృద్ధి పనుల్లో భాగంగా, ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో కొనసాగుతున్న పూడికతీత పనులను బుధవారం ఉదయం తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి నాదెండ్ల,వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు నాణ్యతతో నిర్వహించాలని సూచించారు.పంట కాలువల అభివృద్ధితో వర్షపు నీటి పారుదల మెరుగుపడి, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు తగ్గడంతో పాటు రైతులకు, స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి మనోహర్ తెలిపారు.



## సంగంజాగర్లమూడి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

తెనాలి జూన్10(ప్రభాతవార్త): గుంటూరు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు బుధవారం సంగంజాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ బాబు ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, నిర్వహిస్తున్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాన్పుల గది, ఇన్‌పేషెంట్ వార్డు, మందుల స్టోర్స్ రూమ్, లేబరేటరీ, వ్యాక్సిన్ నిల్వ చేసే కోల్డ్ చైన్ పరికరాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో పరిశుభ్రత కీలకమని సిబ్బందికి వివరించారు. ఈ తనిఖీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ రమావత్ శ్రీలతాభాయ్, హెల్త్ సూపర్వైజర్ వావిలాల సీతారామశాస్త్రి, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



### చిరు వ్యాపారులకు టిఫిన్, తోపుడు బండ్ల పంపిణీ

మంగళగిరి, జూన్ 10, ప్రభాతవార్త చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ళ చిరంజీవి పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టిఫిన్ బండి, తోపుడు బండ్లను లబ్ధిదారులకు కనికళ్ళ చిరంజీవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనికళ్ళ చిరంజీవి మాట్లాడుతూ చిరు వ్యాపారులు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ప్రభుత్వం వివిధ స్వయం ఉపాధి పథకాల ద్వారా సహకారం అందిస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో వెనిగళ్ళ విజయలక్ష్మికి టిఫిన్ బండి, తన్నీరు అంజమ్మకు తోపుడు బండిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల టిడిపి అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు కొమ్ము సుకుమార్, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ తాతకోటయ్య, గ్రామ వేణుగోపాలస్వామి ట్రస్ట్ చైర్మన్ మోతుకూరు రవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



### ఘనంగా పిడుగు హరిప్రసాద్ జన్మదినోత్సవ వేడుకలు

మంగళగిరి, జూన్ 10, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ శాసన మండల సభ్యులు ప్రభుత్వ విప్ పిడుగు హరి ప్రసాద్ జన్మదినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ జనసేన పార్టీ నాయకులు గంజి చిరంజీవి, పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో హరిప్రసాద్ చేత కేక్ కట్ చేయించారు. అనంతరం చినకాకానిలోని ఫైన్ ఆనంద శరణాలయంలో పిల్లల సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. హరి ప్రసాద్ కు శాలువా కప్పి, పూల బొకే అందజేసి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి, కంకణాల శంకర్ లు మాట్లాడుతూ, పిడుగు హరిప్రసాద్ ఇటువంటి పుట్టిన రోజులు మరిన్ని జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో సుఖ, సంతోషాలతో జీవించాలని మనసారా కోరుకుంటున్నట్లు చెప్పారు.



### రైతులు ఎరువులు వాడకం తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలి

నగరం, జూన్ 10, ప్రభాత వార్త: రైతులు ఎరువుల పాడకం తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని బాపట్ల జిల్లా డిఆర్సి డిటిసి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ డి అక్తర్ హుస్సేన్ అన్నారు. బుధవారం నగర మండలంలోని ఈదుపల్లి రైతు సేవ కేంద్రంలో ఖేత్ బచావో అభియాన్ ప అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు 2026 27 ఆర్థిక సంవత్సరానికి తొలివిడత విడుదల చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. రైతులు తమ భూ ఆధార్ ఇతర వివరాలు సరి చూసుకోవాలని, ఆధార్ మ్యాపింగ్ చేయించుకున్న రైతులు వివరాలు రాష్ట్రస్థాయిలో ధ్రువీకరణ ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. భూ రికార్డులకు సంబంధించి డిజిటల్ సిగ్నేచర్, ఆధార్ లింకింగ్, ఈ కేవైసీ తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని కోరారు. రైతులు ఎరువుల సమర్థవంతమైన మరియు సమతుల్య వినియోగం, అధిక ఎరువుల వాడకం తగ్గింపు, నానో ఎరువులు జీవన ఎరువుల ప్రోత్సాహం, శాస్త్రీయ పోషక యాజమాన్యం కోసం మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షలు వినియోగం, మట్టి ఆరోగ్యం ఆధారంగా అనువైన లాభదాయ పంటలు గుర్తింపు, పప్పు ధాన్యాల మిషన్ ,నూని గింజల మిషన్ మరియు ప్రత్తి మిషన్ పై అవగాహన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. రమేష్ బాబు, వ్యవసాయ విస్తరణాధికారికి కె. నాగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తో తెనాలి కమీషనర్ భేటీ

తెనాలి మున్సిపాలిటీ జూన్10(ప్రభాతవార్త): తెనాలి మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పుర పరిపాలన శాఖకు సంబంధించి విజయవాడలో జరుగుతున్న యూసిఎఫ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమానంతరం పుర పరపాలన శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్ తో పట్టణంలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టుల గురించి విపులంగా వివరించారు. తెనాలి పురపాలక సంఘానికి సంబంధించి పలు అంశాలపై సిడిఎంఎ తో చర్చించారు. కమీషనర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్,పుర పరిపాలనశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



### క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు( జూన్ 10 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 2027 న విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా మిగిలిన 7 తరగతి, 8వ తరగతి, 9వ తరగతి, ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సుసాన్ తెలిపారు. అలాగే దరఖాస్తులస్వీకరణ జూన్10 నుండి 20 వరకు జరుగుతుంది. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం 24 న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా ఈనెల 25 నప్రకటించబడుతుంది. సర్టిఫికేట్ పరిశీలన మరియు ప్రవేశాలు 26 లో తారీఖున నిర్వహించబడతాయి. విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మిగిలిన ఖాళీలను స్థానిక మరియు స్థానికేతర అభ్యర్థుల నుండి నిబంధనల ప్రకారం భర్తీ చేయబడును. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సుసాన్ తెలియజేశారు.



### దీపం2 ఐదో విడత ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన మంత్రి మనోహర్:

తెనాలి మున్సిపాలిటీ జూన్10(ప్రభాతవార్త): పట్టణంలోని వడ్లమూడి నాగేశ్వరరావు హాస్పిటల్ సమీపంలో నిర్వహించిన దీపం2 పథకం ఐదో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో



తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం మరియు కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ వెంట తెనాలి మండల తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుకు మంత్రి మనోహర్ చొరవతో పరిష్కారం

తెనాలి జూన్10(ప్రభాతవార్త): బుధవారం పట్టణం లోని ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో కొనసాగుతున్న పంట కాలువల పూడికతీత పనులను పరిశీలిస్తున్న సందర్భంగా ఓ మహిళ తనకు తొమ్మిదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు రేషన్ కార్డు మంజూరు కాలేదని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి నాదెండ్ల సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం సాయంత్రం మంత్రి నాదెండ్ల మళ్లీ అదే ప్రాంతంలో పర్యటించి, సంబంధిత మహిళకు రేషన్ కార్డును మంజూరు చేయించి స్వయంగా పత్రాన్ని అందజేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ వెంట తహసిల్దార్ కెవి.గోపాలకృష్ణ, పలువురు రెవెన్యూ అధికారులు, పురపాలక సంఘ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా రూపకల్పనలో ముఖ్య భూమిక పోషించాలి

తెనాలి మున్సిపాలిటీ జూన్10(ప్రభాతవార్త): జూన్ 15వ తేదీ నుండి నిర్వహించబోయే జనగణన(ఎస్ఐఆర్)కార్యక్రమంలో బిఎల్ఏ లదే ముఖ్యపాత్రని, బాధ్యతతో వ్యవహరిస్తూ ఖచ్చితమైన ఓటర్ల లిస్టులను రూపకల్పనలో ముఖ్య భూమిక పోషించాలని తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు అప్పసాని రాజేష్ పేర్కొన్నారు. బుధవారం తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సూచనలతో, రాష్ట్ర పార్టీ ఆదేశముల మేరకు, పార్టీ కార్యాలయంలో జరిగిన తెనాలి పట్టణ, మండల పార్టీ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు అప్పసాని రాజేష్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షులు ఎండి.ఖుద్దుస్, ప్రధాన కార్యదర్శి వసంతం అశోక వర్ధన, కేసన కోటేశ్వరరావు, జొన్నాదుల మహేష్, కంచర్ల ఏడుకొండలు, మల్లవరపు విజయ్, అన్నం పిన్నారావు, బోయపాటి అరుణ, డా.వేమూరి శేషగిరిరావు, కిలారి అనిత, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, పెండేల సుబ్బారావు, ముళ్ళపూడి వెంకట్, కన్నయ్య, మునగ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## దుగ్గిరాల మండల తెలుగుదేశం పార్టీ సమావేశం

దుగ్గిరాల జూన్10(ప్రభాతవార్త): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ప్రతి నెల రెండవ బుధవారం నిర్వహించే మండల స్థాయి సమావేశాల్లో భాగంగా బుధవారం దుగ్గిరాల మండల పార్టీ సమావేశం మండల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడం వంటి పలు అంశాలపై చర్చించి, పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు, వార్డు మరియు గ్రామ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎన్యూమరేషన్ ప్రక్రియలో ప్రతి ఒక్క ఓటరు పాల్గొనాలి: ఆర్డీవో శ్రీదేవి




చెరుకుపల్లి, జూన్ 10, ప్రభాతవార్త : త్వరలో చేపడుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరుకు ఓటు హక్కు కల్పించనున్నట్లు ఆర్డీవో బి శ్రీదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు

## మాదిగల పుణ్యక్షేత్ర శంఖుస్థాపనను జయప్రదం చేయండి:ఎంఆర్పిఎస్ జాతీయ అధికారప్రతినిధి ధర్మారావు మాదిగ

తెనాలి జూన్10(ప్రభాతవార్త): జులై 7న ప్రకాశం జిల్లా ఈదుమూడిలో జరిగే మాదిగల పుణ్యక్షేత్ర శంఖుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి ఉన్నం ధర్మారావు మాదిగ పేర్కొన్నారు. ఈ మేరకు రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో మంగళవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉన్నం ధర్మారావు మాదిగ మాట్లాడుతూ, మాదిగల పుణ్యక్షేత్రంలో ఆదిజాంబవంతుడు, అరుంధతి, కక్కయ్య విగ్రహాలతో పాటు ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులుబాసిన అమరుల విగ్రహాలు కూడా ప్రతిష్ఠిస్తామని పేర్కొన్నారు. జులై 7న ఈదుమూడిలో జరిగే శంఖుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, కవులు, కళాకారులు, మేధావులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న దుగ్గిరాల మండలంలోని చిలువూరులో జరిగే రాష్ట్ర అధ్యక్షులు షాలేం రాజు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు చిలువూరి నాగరాజు మాదిగ, జిల్లా ఇన్చార్జ్ కొమరాల శ్రీనివాస్ మాదిగ, జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ, ఉన్నం భరత్ మాదిగ, ఉన్నం ఇమ్మానియేలు మాదిగ, ఉన్నం ప్రసాద్ మాదిగ, బళ్ళా వెంకటేశ్వరరావు మాదిగ పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత




చెరుకుపల్లి, జూన్ 10, ప్రభాతవార్త: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని ఎంపీడీవో కృష్ణ నాయక్ అన్నారు. స్వచ్ఛ పదం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన చెరుకుపల్లి లో అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు


## వెల్నెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపట్నం, జూన్ 10, ప్రభాతవార్తః వెల్నెస్ సెంటర్‌ను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సోదరుడు శివప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని అడవులదీవిలో వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక అనారోగ్యానికి మాత్రమే చికిత్స చేయటమేకాకుండా మానసిక, భావోద్వేగ ఆరోగ్యాన్ని సంపూర్ణంగా పెంపొందించటానికి ఉపయోగపడే కేంద్రమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం: యాగంటి

మాచర్ల, జూన్ 10 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు దూరదృష్టితోనే కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన అమరావతి రాజధానికి మళ్లీ జీవం పోసి, ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే మహత్తర కార్యక్రమం వేగవంతంగా అమలు చేస్తోంది. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదు, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రాజధాని నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండటం రాష్ట్ర ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రహదారులు, జాతీయ రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అతనయంత ప్రాధాన్యత ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు వేగంగా సాగుతుండటంతో ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి.



## రెండేళ్ల నమ్మకం వేడుకలను జయప్రదం చేయాలి

బాపట్ల, జూన్10, ప్రభాతవార్త, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు, కేంద్ర ప్రభుత్వం ఏర్పడి 12 ఏళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహించనున్న రెండేళ్ల నమ్మకం వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16న జిల్లాస్థాయిలో జరిగే కార్యక్రమానికి సుమారు 5 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికంగా, సామాజికంగా ఎదిగిన మహిళలను కార్యక్రమంలో సన్మానించాలన్నారు. మహిళా సాధికారత, స్త్రీశక్తి, మహిళల భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమాలను కూడా జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 11న చీరాల వాడరేవులో, 18న భట్టిప్రోలు బౌద్ధ స్తూపం వద్ద ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో సామాజిక భవనాలు, సచివాలయాలు, దేవాలయాల్లో యోగా శిక్షణ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌వో జి.గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆయుష్, యోగాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## యోగను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి

బాపట్ల, జూన్10, ప్రభాతవార్త, ప్రతినిధి: ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్య జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 వేడుకల్లో భాగంగా బుధవారం బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక రథం బజార్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, పట్టణ ప్రజలు, పాఠశాల విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఒక్కటే సరైన మార్గమని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా యోగాభ్యాసం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అన్ని వయసుల వారు యోగాను సాధన చేయడం వల్ల అనేక దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

**అధికారుల సమక్షంలో యోగాసనాలు..**

పట్టణంలోని రథం బజార్ వేదికగా జరిగిన ఈ యోగా ప్రదర్శనలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వయంగా ఆసనాలు వేసి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎం. హాసిని, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ప్రభాకర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధా మాధవి, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ సింగ్, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతే లక్ష్యం: ఎస్పీ

బాపట్ల, జూన్10, ప్రభాతవార్త, ప్రతినిధి: మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీఉమామహేశ్వర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ దండాయన్థలో భాగంగా జిల్లాలో మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, నేరాలకు పాల్పడిన 301 మందిపై షీట్లు తెరిచినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల్లోనే 26 మందిపై సస్పెక్ట్ షీట్లు నమోదు చేశామన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారు, పాత నేరస్తులు, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచామన్నారు.. వారు ఎవరిని కలుస్తున్నారు, మళ్లీ నేరాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయా అనే అంశాలను నిరంతరం పరిశీలిస్తున్నామని తెలిపారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, మహిళా సంబంధిత కేసులను వేగంగా దర్యాప్తు చేసి 60 రోజుల్లోపు ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తున్నామని చెప్పారు. కేసుల తీవ్రతను బట్టి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ జరిపించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మహిళల భద్రత కోసం ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బృందానికి ఎస్ఐ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఈ బృందాలు కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ మహిళలకు అవగాహన కల్పిస్తున్నాయని వివరించారు. అలాగే నిర్మానుష్య ప్రాంతాలు, నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే శక్తి యాప్ లేదా అత్యవసర సేవల నంబర్ 112ను సంప్రదించి పోలీసు సహాయం పొందాలని ఎస్పీ సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి బృందాలు, స్థానిక పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.



## త్రాగునీరు అందక నర్రావారిపాలెం ప్రజల అవస్థలు

కర్లపాలెం, జూన్10, ప్రభాతవార్త: కర్లపాలెం మండలంలోని నర్రావారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో గత రెండు రోజులుగా త్రాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి తీవ్రత ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీరు అందక చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అత్యంత కష్టాలు పడుతున్నారు. తాగేందుకు మాత్రమే కాకుండా వంట, గృహ అవసరాలకు కూడా నీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో కొళాయిలకు నీరు రాకపోవడంతో ప్రజలు బిందెలు, డబ్బాలతో దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి రావడంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు. త్రాగునీటి సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నీటి సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలపై కూడా స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని, దీంతో ప్రజల్లో ఆందోళన మరింత పెరిగిందని అంటున్నారు. సమస్య పరిష్కారంపై అధికారులు నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామంలో నీటి కొరత కారణంగా పలు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రోజువారీ పనులకు వెళ్లే కార్మికులు కూడా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. పరిశుభ్రతకు అవసరమైన నీరు అందక ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో పరిస్థితిని పరిశీలించాలని, నీటి సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలను గుర్తించి వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వేసవి కాలంలో త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గ్రామ ప్రజలకు ఉపశమనం కల్పించాలని నర్రావారిపాలెం వాసులు కోరుతున్నారు. సమస్యను నిరక్ష ్యం చేయకుండా అత్యవసరంగా పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కర్లపాలెం మండలంలో స్వచ్ఛ పథ కార్యక్రమం నిర్వహణ

కర్లపాలెం, జూన్10, ప్రభాతవార్త: కర్లపాలెం మండలంలో స్వచ్ఛ పథ కార్యక్రమాన్ని బుధవారంఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయలక్షి ్మ పాల్గొని పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. స్వచ్ఛ పథ కార్యక్రమంలో భాగంగా పాతనందయపాలెం వెళ్లే రోడ్డు, కర్లపాలెం నుంచి గణపవరం వెళ్లే ప్రధాన రహదారిపై పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. రహదారి పరిసరాలను శుభ్రపరిచి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవోలు అయినంపూడి శ్రీనివాసరావు, పద్మావతి, సచివాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొంటూ, స్వచ్ఛత కోసం ప్రజలు సహకరించాలని కోరారు.

## అంకిత భావంతో పని చేసిన అంగన్వాడీ టీచర్ పాలేటి నాగేంద్రమ్మ ఆదర్శప్రాయురాలు

కర్లపాలెం, జూన్10, ప్రభాతవార్త:బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన అంగన్వాడీ టీచర్ పాలేటి నాగేంద్రమ్మ ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని దుశ్శాలువాలతోను మరియు పూలమాలలుతోను సన్మానించి శుభా కాంక్షలు తెలియ జేసిన ఆ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ తాండ్ర సాంబశివరావు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ పాలేటి నాగేంద్రమ్మ 44 సంవత్సరాల పాటు ఎలాంటి చిన్న మచ్చ కూడా లేకుండా ఈ గ్రామానికి అమోఘమైన సేవలు అందించి, ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులుగా మార్చటంలో అద్భుతమైన పాత్ర పోషించారు అని కొనియాడారు. అంగన్వాడీ సిబ్బందికి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో ఎన్నో ఇబ్బందులతో కూడిన ఒత్తిడి ఉన్నప్పటికీ, చిన్న పిల్లల కోసం ప్రభుత్వం నిర్దేశించిన ఆశయాలను సంపూర్ణంగా పూర్తి చేస్తూ అద్భుతమైన సేవలు అందిస్తున్న అంగన్వాడీ సిబ్బందికి అభినందనలు తెలియ జేశారు. ఉద్యోగ విరమణ పొందిన అంగన్వాడీ టీచర్ పాలేటి నాగేంద్రమ్మ కు శుభా కాంక్షలు తెలియ జేసి, మిగిలిన శేష జీవితం సుఖ సంతోషాలతో వర్ధిల్లె విదంగా ఆ భగవంతుడు ఆశీర్వదించారు. మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ సిబ్బంది తో కలిసి ఎన్ లక్షీ ్మ పార్వతి మరియు సూపర్వైజర్ సౌజన్య లు కూడా బాధ్యతగా ఉద్యోగ విరమణ పొందిన తమ తోటి అంగన్వాడీ టీచర్ శ్రీమతి పాలేటి నాగేంద్రమ్మ సన్మాన సభలో పాల్గొని సత్కరించటం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో పాలేటి నాగేంద్రమ్మ కుటుంబ సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాన్‌సింగ్‌నాయక్‌కు గౌరవ డాక్టరేట్



కారంపూడి, జూన్ 10 ప్రభాతవార్త: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు, ప్రముఖ బాలసాహితీ వేత్త, కవి, రచయిత బి.మాన్‌సింగ్‌నాయక్ గౌరవ డాక్టరేట్‌ను ఈ నెల 20న అందుకోనున్నారు. ఆయన చేసిన సాహిత్య సేవకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ ఫీస్ యూనివర్సిటీ ఊటీ వారి నుంచి ఆహ్వానపత్రం అందింది. మాన్‌సింగ్‌నాయక్ 1000కి పైగా బాల సాహిత్య రచనలు, 5కుపైగా నవలలు, 4 బాల కథా సంపుటీలు, 3 బాలగేయ సంపుటులు వెలవరించారు. ఈ సందర్భంగా మాన్‌సింగ్‌నాయక్‌ను ఎంఈఓలు అనిల్‌కుమార్, రవికుమార్‌లు, పాఠశాల హెచ్ఎం పుల్లమ్మ, తోటి ఉపాధ్యాయులు, పలువురు సాహితీ వేత్తలు, మండల ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

## హుస్సేన్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరసన

కారంపూడి, జూన్ 10 ప్రభాతవార్త: గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న మహమ్మద్ హుస్సేన్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సహాయకులు నిరసన వ్యక్తం చేశారు. హుస్సేన్ కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుత నిరసన చేపట్టారు. గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ సర్వేయర్లపై ఉన్న పనిభారం తగ్గించాలని కోరుతూ తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సుపరిపాలనలో ఏపీ దేశంలోనే నెంబర్ వన్: ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, జూన్ 10 ప్రభాతవార్త: ప్రజలకు సుపరిపాలన అందించడంలో దేశంలోనే ఏపీ నెంబర్‌వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, భూ సమస్యలు, నివేశన స్థలాలు, నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, సామాజిక పింఛన్లు వంటి సమస్యలపై 45 అర్జీలు ప్రజలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో సీఎం చంద్రబాబు ప్రజాదర్బార్‌ను తీసుకొచ్చారని, మండలాల వారీగా నిర్వహించే ప్రజాదర్బార్‌ను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గత రెండేళ్లుగా నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 4,277 అర్జీలు రాగా, 3,272 అర్జీలను పరిష్కరించామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, యువతకు ఉపాధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సీఐ శరత్, ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, దుర్గి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సత్యం, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, బొమ్మెన శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఆశయాలను పుణికిపుచ్చుకున్న వ్యక్తి బాలయ్య: ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, జూన్ 10 ప్రభాతవార్త: ఎన్టీఆర్ ఆశయాలను పుణికిపుచ్చుకున్న ఆదర్శవంతుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో అభిమానులు, టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో జరిగిన నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ జన్మదినం కూడా ఒకేరోజు కావడంతో ఆయనకు కేక్ తినిపించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్న ఎన్టీఆర్ నట వారసత్వాన్ని, రాజకీయ సిద్ధాంతాలకు నిలువెత్తు నిదర్శనం బాలయ్యబాబు అని కొనియాడారు. హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచారన్నారు. ప్రజల్లో తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, దుర్గి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సత్యం, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల సురేష్‌యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, బొమ్మెన శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



## ఆపత్కాలంలో అండగా సీఎం సహాయనిధి

కారంపూడి, జూన్ 10 ప్రభాతవార్త: ఆపత్కాలంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో 26 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సీఐ శరత్, ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, దుర్గి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సత్యం, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్‌వలి, బొమ్మెన శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

కారంపూడి, జూన్ 10 ప్రభాతవార్త: స్థానిక జిల్లా పరిషత్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి చొప్పర కృష్ణ అన్నారు. పట్టణంలోని నడిబొడ్డులో 1.72 సెంట్ల జడ్పీ భూమి ఆక్రమణకు గురయిందని కొందరు పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన జడ్పీ భూమి పరిశీలించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు జడ్పీ భూమిని పరిశీలించారు. జడ్పీ స్థలాలు ఆక్రమణకు గురయితే చర్యలు తీసుకుంటామన్నారు. భూమిని పరిశీలించిన వారిలో ఎంపీడీఓ ఘంటా శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి కసిన్యానాయక్, ఏపీఓ కట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## కోలాహలంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

గురజాల, జూన్ 10 ప్రభాతవార్త : హిందూపురం శాసనసభ్యుడు, సినీనటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను బుధవారం గురజాల పట్టణంలో కోలాహలంగా నిర్వహించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు టీడీపీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలకృష్ణ నటన, రూపంలోనే కాకుండా రాజకీయ ప్రవేశంలోనూ తనకంటూ ముద్ర



వేసుకొని హ్యాట్రిక్ విజయం సాధించారన్నారు. బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ బాధ్యతలు తీసుకొని ఎంతో మంది నిరుపేదలకు వైద్యం అందిస్తున్నారన్నారు. బాలకృష్ణ ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పోటు నాగేశ్వరరావు, నేలవెల్లి బొల్లయ్య, శ్రీరామ్మూర్తి, శరమాల హనుమంతురావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల పిచ్చయ్య గుప్త, సాంబ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యరపతినేని ఆర్థికసాయం

పిడుగురాళ్ల, జూన్ 10 ప్రభాతవార్త : టీడీపీ కార్యకర్త షేక్ సుభాని కుమార్తె యాస్మిన్ వివాహానికి గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు బుధవారం రూ.25 వేల ఆర్థికసాయం




అందించారు. 2024, డిసెంబర్ నెలలో పట్టణంలోని 13వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త షేక్ సుభాని గుండెపోటుతో మృతిచెందారు. సుభాని కుటుంబాన్ని ఆదుకుంటానని ఆ సమయంలో యరపతినేని శ్రీనివాసరావు మాటిచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఆ కుటుంబానికి కొండంత అండగా ఉండి ఆర్థికసాయం అందించారు.

11-6Pg5.qxd:11-6Pg5.qxd 1/1/02 5:44 AM Page 1



# పశ్చిమాసియా రణరంగం
## అమెరికా - ఇరాన్ మధ్య భీకర దాడులు



**వాషింగ్టన్, జూన్ 10:** పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హార్ముజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది. అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్‌జిసి అభివర్ణించింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికా ఫ్లీట్‌తోపాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లతో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యుఎస్ దళాలు దాడులు చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పేర్కొంది. ఈ దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పందన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**అమెరికా ఎంక్యు-9 రీపర్ డ్రోన్ కూల్చేశాం: ఇరాన్**

వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా ఎంక్యు-9 రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ విడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు.

# పశ్చిమాసియా రౌడీ ఇకలేడు.. చనిపోయాడు!
## ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ పోస్టు!



**వాషింగ్టన్,జూన్ 10:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయని అనుకుంటే అనూహ్యంగా మళ్లీ పెరుగుతున్నాయి. గల్ఫ్ దేశాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండగా ప్రతీకారంగా అమెరికా దాడులు చేయడంతో మళ్లీ టెన్షన్ వాతావరణం నెలకొంది. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలపై ప్రపంచ దేశాలు భయాందోళన చెందుతున్నాయి. తాజాగా ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మధ్యప్రాచ్య రౌడీ ఇక చనిపోయాడు అంటూ ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికాఇరాన్ మధ్య తాజా సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ట్రంప్ ఇరాన్ సైన్యం పూర్తిగా ఓడిపోయిందని వారి నౌకాదళం, వైమానిక దళ సామర్థ్యాలు దాదాపు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునే విషయంలో టెహ్రాన్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసిందని ఆరోపిస్తూ ఇప్పుడు దానికి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్ సైన్యం పూర్తిగా గందరగోళంలో ఉంది. వారు పూర్తిగా ఓడిపోయారు. ఇరాన్ మాటలు మాత్రమే చెబుతుంది చర్యలు ఉండవు. మధ్యప్రాచ్య రౌడీ ఇక చనిపోయాడు అని ట్రంప్ తన పోస్టులో వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో ఇరాన్‌పై ట్రంప్ చేసిన అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలలో ఇది ఒకటిగా పరిగణిస్తున్నారు. కొన్ని గంటల ముందే ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. అమెరికాతో ప్రయోజనకరమైన ఒప్పందం చేసుకునే అవకాశాన్ని ఇరాన్ కోల్పోయిందని చర్చలు జరపడంలో చాలా ఆలస్యం చేసిందని అన్నారు. ˇవారికి ఎంతో ఉపయోగపడే ఒప్పందంపై నిర్ణయం తీసుకోవడానికి చాలా సమయం తీసుకున్నారు. ఇప్పుడు దానికి మూల్యం చెల్లించాల్సిందేనని హెచ్చరించారు. ఇటీవల అమెరికా.. ఇరాన్‌కు చెందిన పలు సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులు నిర్వహించగా దానికి ప్రతిస్పందనగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలో ఉన్న అమెరికా సైనిక కేంద్రాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# కుప్పకూలిన పాక్ సైనిక హెలికాప్టర్: 21 మందిమృతి

**ముజఫరాబాద్,జూన్ 10:** పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ17 హెలికాప్టర్ ముజఫరాబాద్ సమీపంలో టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిపోయింది. సాంకేతిక లోపం కారణంగా కూలిపోయింది. హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది అందరూ అమరులయ్యారని పాకిస్థాన్ మీడియా తెలిపింది. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్‌ను ఉటంకిస్తూ పాకిస్థాన్ డాన్ పత్రిక వెల్లడించింది. హెలికాప్టర్‌లో 21 మంది సైనికులు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందరూ చనిపోయినట్లుగా సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్‌లో ఉన్న సైనిక సిబ్బంది దేశ సేవలో అమరులయ్యారని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పాకిస్థాన్ ఆర్మీ దర్యాప్తు ప్రారంభించింది. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ముజఫరాబాద్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన పాకిస్థాన్ సైనిక వర్గాల్లో విషాదాన్ని నింపింది. ఈ ఆధునిక విమానం ఎంఐ17, ఇసిఎం8 కొత్త వెర్షన్ మిల్ మాస్కో హెలికాప్టర్ ప్లాంట్ ద్వారా నిర్మించారు. రష్యాలో తయారైన అత్యధిక బరువు మోసే రవాణా హెలికాప్టర్ ఇది.

# మీనాక్షి నామినేషన్ తిరస్కరణ ఉపసంహరించండి



**సిఇసి జ్ఞానేష్‌కుమార్‌కు కాంగ్రెస్ వినతి**

**ఇసి చర్యలో చట్టపరమైన లోపముందని వాదన**

**ఒత్తిడితోనే ఆ నిర్ణయం : మీనాక్షి ఆరోపణ**

**న్యూఢిల్లీ, జూన్ 10:** చట్టప్రకారం ఉనికిలో లేని ఒక క్రిమినల్ కేసు ఆధారంగా రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఒ) నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపిస్తూ, సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ బుధవారం ఎన్నికల కమిషన్ (ఇసి)ని కలిసింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం, ఇందులో అభ్యర్థి నటరాజన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అభిషేక్ సింఘ్వి, జైరామ్ రమేష్, భూపేష్ బఘేల్, దీపా దాస్‌మున్షి, రణదీప్ సింగ్ సుర్జేవాలా కూడా ఉన్నారు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లను కలిసింది. ఎన్నికల అధికారి (ఆర్ఒ) నిర్ణయం చట్టబద్ధంగా నిలవదని, ఓటింగ్ జరగకముందే ఎన్నికల ప్రక్రియను వక్రీకరించిందని వారు వాదించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఎను ప్రస్తా విస్తూ, రెండేళ్లకు పైగా జైలు శిక్ష విధించదగిన క్రి మి న ల్ కేసు ల ను, కోర్టు ఇప్పటికే అభియో గాలు నమో దు చేసిన కేసులను మాత్రమే అభ్యర్థులు వెల్లడించాల్సి ఉంటుందని సింఘ్వి అన్నారు. నటరాజన్ కేసు ఆ దశకు చాలా దూరంలో ఉందని ఆయన అన్నారు. "మొదట విచారణకు స్వీకరించడం, ఆ తర్వాత దర్యాప్తు, ఆపై ఛార్జిషీట్, చివరకు అభియోగాలు నమోదు చేయ డం జరుగుతుంది. అభియోగాలు నమోదు చేసిన తర్వాతే వివరాలు వెల్ల డించాలని చట్టం నిర్దేశి స్తుంది" అని ఆయన అన్నారు. ఇలాంటి కారణాలతో ఒక నామినేషన్‌ను తిరస్కరించడం అస^మాన పోటీ వాతావరణాన్ని సృష్టిస్తుందని, ఒక అభ్యర్థికి ఎన్నికలలో పోటీ చేసే అవకాశాన్ని నిరాకరిస్తుందని కాంగ్రెస్ ఇసికి తెలిపింది. ఇటు వంటి చర్యలు ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతాన్ని ప్రభావితం చేస్తాయని ఆ పార్టీ వాదించింది. దీనిని ఒక తీవ్రమైన చట్టపరమైన లోపంగా అభివర్ణిస్తూ, దానిని సరిదిద్దడానికి రాజ్యాం గంలోని ఆర్టికల్ 324 కింద తన అధికారాలను ఉపయోగించాలని కూడా ఆ ప్రతినిధి బృందం కమిషన్‌ను కోరింది. రిటర్నింగ్ అధికారుల నిర్ణయాలను సమీక్షి ంచేందుకు, రద్దు చేసేందుకు ఇసికి పూర్తి అధికారం ఉందని, ఎన్నికల పిటిషన్ల ద్వారా న్యాయపరమైన పరిష్కారాల కోసం అభ్యర్థులను సంవత్సరాల తరబడి వేచి ఉండేలా బలవంతం చేయకూడదని సింఘ్వి అన్నారు. ఆర్ఒ ఉత్తర్వును "తీవ్రమైనది", "స్పష్టంగా చట్టవిరుద్ధమైనది" "చట్టబద్ధమైన అధికారం లేనిది"గా అభివర్ణిస్తూ, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతాన్ని పునరుద్ధరించడానికి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను రద్దు చేయడానికి ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పేర్కొంది. ఆర్ఒ ఉత్తర్వు లోపభూయిష్టం: ఇసి అధికారులతో సమావేశం అనంతరం అభిషేక్ సింఘ్వి మీడియాతో మాట్లాడుతూ, ఆర్ఒ ఆ ఉత్తర్వు ఎంత లోపభూయిష్టంగా ఉందంటే అది "రెండు ప్లస్ రెండు సమానం ఏడు" అని రాయడం లాంటిదని అన్నారు. తన నామినేషన్ పత్రాలలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును వెల్లడించడంలో విఫలమైనందున నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆయన అన్నారు. నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసు పెండింగ్‌లో లేదని సింఘ్వి స్పష్టం చేశారు. ఒక ప్రైవేట్ ఫిర్యాదుపై ఎందుకు విచారణ చేపట్టకూడదో వివరించడానికి హాజరు కావాలని కోరుతూ ఆమెకు కేవలం కోర్టు నోటీసు మాత్రమే అందిందని ఆయన చెప్పారు. క్రిమినల్ చట్టం ప్రకారం, ఒక మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించిన తర్వాతే అది ఉనికిలోకి వస్తుందని ఆయన అన్నారు. "మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించలేదు. విచారణకు స్వీకరించకుండా, క్రిమినల్ కేసు ఉండదు. అందువల్ల, ఆమె వెల్లడించడానికి ఏమీ లేదు" అని సింఘ్వి అన్నారు. రిటర్నింగ్ అధికారులపై ఒత్తిడితోనే: రిటర్నింగ్ అధికారులు ఒత్తిడికి లోనయ్యారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరించారని మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం రాజకీయ దురుద్దేశం మాత్రమే. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు జరిగిన ప్రయత్నాలను నిన్న ప్రతి దశలోనూ తాము చూశామన్నారు.

# కాంగ్రెస్‌లో టిఎంసి విలీనం?

- సోనియాగాంధీతో మమత సమావేశం - మరుసటి రోజే రాహుల్‌తో అభిషేక్ భేటీ
- మమతకు మరో షాక్... రాజ్యసభకు, పార్టీకి సుస్మితా దేవ్ రాజీనామా
- తిరుగుబాటు శిబిరంలో చేరిన లోక్‌సభ ఎంపి సాయోని ఘోష్



**న్యూఢిల్లీ, జూన్ 10:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తేరుకుంటున్న మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్‌ను దాని మాతృ పార్టీ అయిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో విలీనం చేస్తారా? 1998 జనవరి 1న పార్టీని చీల్చి, 15 యేళ్లపాటు తాను కోరుకున్న విధంగా రాష్ట్రాన్ని పాలించిన ఫైర్‌బ్రాండ్ నాయకురాలి రాజకీయ వలయం ఇప్పుడు పూర్తయినట్లు కనిపిస్తోంది. 20యేళ్ల వయసులో కళాశాల విద్యార్థినిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, ఇటీవలి వరకు రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొన్న మమత, ఇప్పుడు 72 యేళ్ల వయసులో తాను ప్రయాణం మొదలుపెట్టిన చోటికే తిరిగి వెళ్తున్నట్లు కనిపిస్తోంది. 1976లో జైప్రకాష్ నారాయణ్ ప్రయాణిస్తున్న కారు ముందు దూకి తొలిసారిగా వెలుగులోకి వచ్చిన దీదీ, 1984లో సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు సోమనాథ్ ఛటర్జీని ఓడించి సంచలనం సృష్టించి మరోసారి వార్తల్లో నిలిచారు. సోనియాతో మమత భేటీ: ఇండియా బ్లాక్ సమావేశానికి హాజరైన అనంతరం, మమతా బెనర్జీ రాహుల్ గాంధీ సమక్షంలో సోనియా గాంధీ నివాసంలో ఆమెను కలిశారు. కాంగ్రెస్ అధినేత్రితో ఆమె విడిగా చర్చలు జరిపిన సరిగ్గా అదే సమయంలో, అరెస్ట్ వారెంట్‌తో సిఐడి ఆమె కోల్‌కతా నివాసానికి చేరుకోవడంతో ఈ పుకార్లు జోరుగా వ్యాపించాయి. బుధవారం మమత మేనల్లుడు, టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో సమావేశం అయ్యారు. దీంతో ఈ వార్తలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరుపక్షాలు విలీనం గురించి ఎలాంటి సూచనలు ఇవ్వనప్పటికీ, ఇటు ఢిల్లీలో అటు బెంగాల్‌లో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మమతకు షాక్‌ల మీద షాక్‌లు: 294 స్థానాలున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. అయితే, మమతా బెనర్జీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో సుమారు 62 మంది పార్టీని వీడారు, ఈ సంఖ్య ఇంకా పెరుగుతోంది. లోక్‌సభలో టిఎంసికి 29 మంది సభ్యులు ఉన్నారు. అయితే, వారిలో 20 మంది పార్టీ మారడానికి ఒక వర్గంగా ఏర్పడ్డారు. రాజ్యసభలో పార్టీకి 13 మంది సభ్యులు ఉన్నారు, వారిలో సుఖేందు శేఖర్ రాయ్, సుష్మితా దేవ్ రాజీనామా చేశారు, మరికొందరు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారు. అయితే, అధీర్ రంజన్ చౌదరి వంటి సొంత రాష్ట్ర నాయకుల నుండి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో చౌదరిపై క్రికెటర్ యూసుఫ్ పఠాన్‌ను పోటీకి దింపడం ద్వారా మమతా బెనర్జీ ఆయన రాజకీయ జీవితాన్ని ముగించారని ఆరోపణలు ఉన్నాయి.

# ప్రధాని మోడీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ శుభాకాంక్షలు



**రోమ్,జూన్ 10:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ బుధవారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. భారత చరిత్రలో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానిగా మోడీ నిలవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు మోడీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె తన సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. బుధవారం నాటికి ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్న మోడీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించారు. భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచిన నరేంద్ర మోడీకి అభినందనలు. ఇటీవల రోమ్‌లో మరోసారి మిమ్మల్ని కలవడం సంతోషాన్నిచ్చింది. మన దేశాలు, మన ప్రజల కోసం భవిష్యత్తులో కొత్త అవకాశాలు సృష్టించేలా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది అని మెలోనీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. గత నెల మేలో ప్రధాని మోడీ ఇటలీలో రెండు రోజుల పాటు పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో ఆయన ఇటలీ ప్రధాని మెలోనీ, అధ్యక్షుడు సెర్గియో మట్టరెల్లాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచాలని నిర్ణయించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విద్య, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నేతలిద్దరూ అంగీకరించారు.

# సంక్షిప్తంగా..

## బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఐఆర్జీసి దాడులు!

**టెహ్రాన్,జూన్ 10:** ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అమెరికా నేవీ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై మిస్సైల్, డ్రోన్ దాడులు చేసినట్లు ప్రకటించింది. ఇది యూఎస్ దాడులకు ప్రతీకారంగా జరిగినట్లుఐఆర్జీసీ తెలిపింది. యూఎస్ దళాలు ఖేష్మ్ ద్వీపం సమీపంలో ఇరాన్ టెలికమ్యూనికేషన్స్ టవర్‌పై, స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ సమీపంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్‌పై దాడి చేశాయని ఐఆర్జీసీ చెప్పింది. ఇందుకు ప్రతిగా బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ హెడ్‌క్వార్టర్స్, ప్రాంతీయ ఎయిర్‌బేస్‌లు, హెలికాప్టర్ బేస్‌లపై దాడులు జరిపినట్లు ప్రకటించింది. బహ్రెయిన్‌లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగాయని, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత పెరిగిందని నివేదికలు వచ్చాయి. యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ క్లెయిమ్‌లను తప్పు అని తోసిపుచ్చింది.

## ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి ఇద్దరు సైనికులు మృతి



**శ్రీనగర్,జూన్ 10:** ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలిన ఘటనలో ఇద్దరు భారత జవాన్లు దుర్మరణం పాలయ్యారు. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్లోగల కమాల్‌కోట్ సైనిక శిబిరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శిబిరంలోని సైనికులు ఆయుధ పరికరాలను ఒకరి నుంచి మరొకరికి అప్పగిస్తున్న సమయంలో గ్రెనేడ్ అకస్మాత్తుగా పేలింది.

ఈ పేలుడు ధాటికి ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే సైన్యానికి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, వారు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## జోహాన్స్‌బర్గ్‌లో కాల్పులు, 12 మంది మృతి

**జోహాన్స్‌బర్గ్, జూన్ 10:** దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఈ ఘటనలో 12 మంది మరణించారు. ఈ ఘటన తూర్పు జోహన్నెస్‌బర్గ్‌లోని, క్లీవ్‌ల్యాండ్‌లో ఉన్న జంపర్స్ ఇన్‌ఫార్మల్ సెటిల్‌మెంట్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సెటిల్‌మెంట్ ఏరియాలోకి పది మంది వరకు దుండగులు టొయోటా వాహనంలో వచ్చారు. ఆయుధాలు కలిగిన ఈ దుండగులు అక్కడ ఉన్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ సెటిల్‌మెంట్ పరిధిలోని రెండు యాక్సెస్ పాయింట్లను ఎంచుకుని,

అక్కడి నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పో యారు. మరో 9 మంది గాయపడ్డారు. కాల్పుల అనంతరం దుండగులు అక్కడినుంచి పారిపోయారు.

## దర్గా ఉన్నంత మాత్రాన వక్ఫ్ ఆస్తిగా పరిగణించలేం: మద్రాస్ హైకోర్టు

**చెన్నై, జూన్ 10:** కేవలం దర్గా లేదా సమాధి ఉండటం వల్ల ఆ భూమి వక్ఫ్ ఆస్తిగా పరిగణించలేమని మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వక్ఫ్ హోదా పొందాలంటే ముస్లిం వ్యక్తి ఆస్తిని శాశ్వతంగా మత, ధార్మిక లేదా దాతృత్వ కార్యక్రమాల కోసం అంకితం చేసినట్లు చట్టబద్ధమైన ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. చెన్నైలోని ట్రిప్లికేన్ ప్రాంతంలో ఉన్న 240 ఏళ్ల చరిత్ర కలిగిన సర్కార్ సయ్యద్ హబీబుల్లా షా ఖాదరీ ఆరిఫ్ రబ్బానీ హజ్రత్ దర్గాకు కొత్త ముతవల్లీని నియమిస్తూ వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని జస్టిస్ కె.జి. తిలకవాడి రద్దు చేశారు. దర్గాకు ముత వల్లీగా వ్యవహరిస్తున్నానని వ్యక్తి కోర్టును ఆశ్రయించారు.

## కెనడాలో భారత సంతతి పోలీస్ అధికారి మృతి



**ఒంటారియో,జూన్ 10:** కెనడాలో భారత సంతతికి చెందిన ఒక పోలీస్ అధికారి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. ఒంటారియో ప్రావిన్షియల్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ తరుణ్ బాలి, మంగళవారం ఒక దర్యాప్తు సందర్భంగా తీవ్రంగా గాయపడి మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒంటారియోలోని హియర్స్ సమీపంలో ముందురోజు మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. కెండల్ కన్సెషన్ రోడ్ 7, కన్సెషన్ రోడ్ 6 వద్ద అధికారులు ఒక కేసు దర్యాప్తు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన తరుణ్ బాలిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. రెండున్నరేళ్ల సర్వీసు ఉన్న తరుణ్ బాలి, డఫెరిన్ డిటాచ్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

# ఉత్తర ఐర్లాండ్‌లో భారీ విధ్వంసం - చెలరేగిన ముసుగువీరులు




**బెల్‌ఫాస్ట్,జూన్ 10:** ఉత్తర ఐర్లాండ్ రాజధాని బెల్‌ఫాస్ట్‌లో హింసతో అట్టుడికింది. ముసుగులు ధరించిన ఆందోళనకారులు చెలరేగిపోయారు కార్లు, నివాసాలను టార్గెట్‌గా చేసుకుని తగలబెట్టారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు దగ్ధం కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. వలసదారులను లక్ష్యంగా చేసుకుని ఈ అల్లర్లు చెలరేగాయి. భారీ సంఖ్యలో నిరసనకారులు రోడ్లపైకి వచ్చి బీభత్సం సృష్టించారు. కత్తిపోటు ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బెల్‌ఫాస్ట్‌లో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ ఘటనలకు సూడాన్ దేశస్థుడే కారణంగా తెలుస్తోంది. కత్తితో వీరంగం సృష్టించాడు. ఒక వ్యక్తిని కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అయ్యింది. దీంతో ముసుగు ధరించిన వ్యక్తులు రోడ్లపైకి వచ్చి వీరంగం సృష్టించారు. కార్లు, ఇళ్లు తగలబెట్టారు. ఇక కత్తిపోటు కేసులో సూడాన్‌కు చెందిన 30 ఏళ్ల హాది అలోడిడ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యాయత్నం కేసులో అతడిని కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్‌కు తరలించింది. ఈ దాడిలో బాధితుడు ఒక కన్ను కోల్పోయినట్లు, ముఖం, వెన్నుపైన తీవ్ర గాయాలు అయినట్లు కోర్టులో వెల్లడైంది. సోషల్ మీడియా వేదికగా హింసాత్మక నిరసనలకు పిలుపు ఇవ్వడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చిన గుంపులు పలు ప్రాంతాల్లో పోలీసులపై రాళ్లు రువ్వి, వాహనాలు, బస్సులకు నిప్పంటించారు. కొన్ని కుటుంబాలు తమ ఇళ్లలో చిక్కుకుపోగా, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని వారిని సురక్షితంగా బయటకు తరలించారు. అనేక కార్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానిక రాజకీయ నాయకులు, మతపెద్దల ప్రకారం దాడులకు గురైన వారిలో ఎక్కువ మంది నల్లజాతీయులు, వలసదారులే ఉన్నట్లు తెలుస్తోంది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా స్పందిస్తూ. ప్రజలను వారి జాతి, నేపథ్యం కారణంగా లక్ష్యంగా చేసుకోవడం అస్సలు సహించం. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రిటన్‌లో వలస దారుల అంశంపై వివాదాలు పెరుగు తున్నాయి. ఆశ్రయం విధానాల కారణంగా ప్రమాదకర వ్యక్తులు దేశంలోకి ప్రవేశిస్తున్నారంటూ కొన్ని పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి.

# బెంగాల్‌లో మంత్రులకు పోర్టుఫోలియోలు కేటాయింపు!

**కోల్‌కత్తా,జూన్ 10:** పశ్చిమబెంగాల్‌లో మంత్రులకు శాఖలు కేటాయించారు. సీఎం సువేందు అధికారి హోంశాఖను తన వద్దే ఉంచుకున్నారు. గతంలో ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం గడిపి, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న కలితా మాఝీకి గృహనిర్మాణ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. బెంగాల్ ఎన్నికల్లో తూర్పు వర్ధమాన్ జిల్లా ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి కలితా టీఎంసీ అభ్యర్థిపై 12,535 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మరోవైపు జర్నలిస్ట్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన స్వపన్ దాస్‌గుప్తాకు ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు కట్టబెట్టారు. ఇక మిగతావాళ్లలో తపస్ రాయ్‌కి పరిశ్రమలు, వాణిజ్య శాఖలు అప్పగించారు. దిలీప్ ఘోష్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలను కట్టబెట్టారు. ఇక సీనియర్ నాయకురాలు అగ్నిమిత్ర పాల్‌కు పట్టణాభివృద్ధి, పురపాలక వ్యవహారాల శాఖల బాధ్యతలు అప్పజెప్పారు. డాక్టర్ శరద్వత్ ముఖర్జీకి ఆరోగ్య శాఖ కేటాయించారు. జగన్నాథ్ ఛటోపాధ్యాయకు ఉన్నత విద్యాశాఖ. దూద్ కుమార్ మండల్‌కు వ్యవసాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. దీపక్ బర్మన్‌కు పాఠశాల విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టారు. శంకర్ ఘోష్‌కు పర్యాటక, పార్లమెంటరీ వ్యవహారాల శాఖలు అప్పగించారు. అర్జున్ సింగ్‌కు కార్మిక శాఖ, రవాణా శాఖలను కట్టబెట్టారు. ఇంద్రనీల్ ఖాన్‌కు క్రీడలు, యువజన, వినియోగదారుల వ్యవహారాల శాఖలను కేటాయించారు.

# అఫ్ఘాన్‌పై పాక్ బాంబుల వర్షం - నిద్రలోనే 11 మంది చిన్నారులు మృతి



**ఇస్లామాబాద్, జూన్ 10:** అఫ్ఘానిస్థాన్-పాకిస్థాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. అర్థరాత్రి వేళ.. అఫ్ఘాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై పాక్ బాంబులతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 11 మంది చిన్నారులు నిద్రలోనే కన్నుమూశారు. మంగళవారం అర్థరాత్రి దాటాక ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలోని పౌర నివాసాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు అఫ్ఘాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. సెర్పా జిల్లాలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలోనే 9 మంది చనిపోయారని, మరో 10 మంది గాయపడ్డారని ఖోస్ట్ ప్రావిన్స్‌కు చెందిన అధికారి తెలిపారు. పక్తికా ప్రావిన్స్‌లోని బర్మల్ జిల్లాలో జరిగిన మరో దాడిలో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిన్నారులేనని స్థానికులు తెలిపారు. బాధితులు నిద్రిస్తున్న సమయంలో ఈ దాడులు జరగడంతో.. వారు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ దాడి ఘటనలో మొత్తం 11 మంది చిన్నారులతో సహా ఓ మహిళ, ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడగా.. వారిలో అనేకమంది మహి ళలు, చిన్నారులో ఉన్నారు. మృతి చెందిన చిన్నారుల ఫొటోలను జబి హుల్లా ఎక్స్‌లో పంచుకున్నారు. కాగా.. ఈ దాడుల విషయంపై పాక్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అఫ్ఘాన్ సరిహద్దులోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఓ సెక్యూరిటీ పోస్టుపై ఇటీవల దాడి జరిగింది. తాలిబన్ మిలిటెంట్లు ఈ దాడి చేసినట్లు పాక్ అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

# 15 గిగావాట్ల డేటా సెంటర్ విద్యుత్ అవసరాలకు సమగ్ర ప్రణాళిక

● దేశ డిజిటల్ భవిష్యత్తుకు శక్తివంతమైన విద్యుత్ మౌలిక వసతుల కల్పనకు ఏపి శ్రీకారం ● సిఎంఇ, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ● విశాఖపట్నం గ్లోబల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా అవతరణ



**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యాధునిక, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్యుత్ ప్రసార (ట్రాన్స్‌మిషన్) రోడ్ మ్యాప్ రూపొందించిందని ఏపి సిఎంఇ, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ఈ చర్యలతో ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక వసతుల పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయ గమ్య స్థానంగా ఆంధ్రప్రదేశ్ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. విశాఖపట్నం, పరిసర ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌కు మద్దతు అందించేందుకు ఈ చర్యలు ఉపకరిస్తాయని వివరించారు. బుధవారం విద్యుత్ సౌధ నుండి ఏపి ట్రాన్స్‌కో, ఐటి, ఏపిఐఐసి అధికారులతో విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ, హైపర్‌స్కేల్ డేటా సెంటర్లు, కృత్రిమ మేధస్సు (ఎఐ) మౌలిక వసతులు, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాలు, తదుపరి తరం డిజిటల్ సేవలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ప్రపంచ ప్రముఖ సాంకేతిక సంస్థలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయని తెలిపారు. గతంలో పారిశ్రామిక వృద్ధికి ఓడరేవులు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు ఎంత కీలక పాత్ర పోషించాయో, భవిష్యత్తులో డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు డేటా సెంటర్లు అంతే కీలకంగా వెన్నెముకగా నిలుస్తాయని అంచనా వేస్తున్నామని, ఈ రంగంలో అవసరమైన ప్రపంచ స్థాయి విద్యుత్ మౌలిక వసతులను ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రేపటి అవకాశాల కోసం నేటి నుండే సిద్ధమవుతోందని చెప్పారు. కేవలం విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం మాత్రమే కాకుండా దానికంటే ముందుండి ప్రణాళిక బద్ధంగా వ్యవహరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం ప్రాంతం ఇప్పటికే గూగుల్, రిలయన్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఫ్రెవర్ వాల్లీ), సిఫిఐఎల్‌ఎస్, జిఎంఆర్ వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పెట్టుబడి ప్రతిపాదనలను ఆకర్షించిందని, దీంతో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక వసతుల క్లస్టర్లలో ఒకటిగా విశాఖపట్నం అవతరిస్తోందని ఆయన వివరించారు. ఏపి ట్రాన్స్‌కో అంచనాల ప్రకారం ప్రస్తుతం ఈ ప్రాంతంలో 16 ప్రధాన డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటి విద్యుత్ లోడ్ ఏర్పడనుందని, అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ నిర్వహణ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటే, 2036-37 ఆర్థిక సంవత్సరం నాటికి మొత్తం విద్యుత్ డిమాండ్ దాదాపు 15 గిగావాట్లకు చేరుకోనుందని ఆయన తెలిపారు. ఈ అవసరాలను తీర్చేందుకు ఏపి ట్రాన్స్‌కో దశలవారీగా అమలు చేసే సమగ్ర విద్యుత్ ప్రసార వ్యూహాన్ని రూపొందించిందని, ఇందులో పెందుర్తి, మరాడం, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవరపాలెం వంటి కీలక సబ్‌స్టేషన్లను అనుసంధానించే 765 కెవి, 400 కెవి, 220 కెవి ప్రసార వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెట్వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకు పైగా స్థిరమైన డేటా సెంటర్ లోడ్‌ను సమర్థవంతంగా అమలు చేసేలా, భవిష్యత్ విస్తరణకు అనువుగా రూపకల్పన చేయబడిందని ఆయన తెలిపారు. ఈ ప్రణాళికలో ప్రధానంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ ప్రతిపాదిత భారీ పెట్టుబడులకు మద్దతుగా కొత్త 400/220 కెవి సబ్‌స్టేషన్‌తో పాటు అధిక సామర్థ్యమున్న ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్‌మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు విజయానంద్ తెలిపారు. తాళ్లపాలెం, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న డేటాసెంటర్ కేంద్రాలకూ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి అని, బలమైన, విస్తరించ గల, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేవిధంగా ఉండే విద్యుత్ ప్రసార వ్యవస్థను నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రేపటి అవిష్కరణలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు పునాది వేస్తోందన్నారు. ఆధునాతనంగా అత్యంత ప్రాధాన్యమున్న డిజిటల్ మౌలిక వసతుల గమ్యస్థానాల్లో ఒకటిగా ఏపిని నిలబెట్టేదిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అని ఆయన తెలిపారు.

# నిధి పేరోల్ అప్లికేషన్‌లో మైగ్రేషన్, ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తిచేయాలి

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు తమ పరిధిలోని సంస్థల్లో నిధి పేరోల్ అప్లికేషన్‌లో మైగ్రేషన్, ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తిచేయాలని ఆర్థికశాఖ కార్యదర్శి వాడ్రేవు వినయ్‌చంద్ ఆదేశించారు. సమస్యలున్న శాఖలు వెంటనే ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందేలా అన్ని శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. నిధి పేరోల్ అప్లికేషన్‌లో అన్ని కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, తాత్కాలిక ఉద్యోగుల వివరాలను నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని శాఖలు ఆ ప్రక్రియను పూర్తి చేయలేదని ప్రభుత్వం గుర్తించింది. పోస్టుల కొనసాగింపునకు సంబంధించిన ఉత్తర్వులు లేకపోవడం, మంజూరు ఉత్తర్వుల ప్రతులు అందుబాటులో లేకపోవడం, రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి కేటాయించిన పోస్టుల సంఖ్యపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో ప్రక్రియ ఆలస్యమవుతోందని పేర్కొంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖాధిపతులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ జాప్యం వల్ల కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు తమకు రావాల్సిన వేతనాలకు దూరమవుతున్నారని, ఇది ప్రభుత్వ దృష్టిలో ఆందోళనకరమైన అంశమని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అలాగే ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్, ఎపిసిఎఫ్‌ఎస్‌ఎస్ సిఇఒ అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని ఆదేశించారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా సమర్పించే వేతన బిల్లులను అత్యవసర ప్రాతిపదికన ప్రాసెస్ చేసి ఉద్యోగులకు ఎటువంటి జాప్యం లేకుండా వేతనాలు అందేలా చూడాలన్నారు.



# అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.2,460 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు

**15.8 టన్నుల బియ్యంతో మహాయజ్ఞంలా కొనసాగుతున్న అన్నప్రసాద**

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిత్యం మహా యజ్ఞంలా కొనసాగుతోంది. దేశ విదేశాల నుండి తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తూ టిటిడి సేవాభావానికి ప్రతీకగా నిలుస్తోంది. 1985 ఏప్రిల్ 6న ప్రారంభమైన నిత్య అన్నదాన పథకం ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో నిర్వహించబడుతోంది. సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండగా, వారాంతాల్లో ఈ సంఖ్య 3 లక్షల వరకు ఉంటుంది. గత మూడు నెలల సగటు గణాంకాల ప్రకారం రోజుకు సుమారు 70 వేల మందికి పాలు, టీ, కాఫీ వంటి పానీయాలు అందిస్తున్నారు. అలాగే 60,200 మందికి అల్పాహారం, 99,500 మందికి మధ్యాహ్న భోజనం, 56,700 మందికి రాత్రి భోజనం వడ్డిస్తున్నారు. ఇలా రోజుకు దాదాపు 3 లక్షల మందికి సేవలందిస్తున్నారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో రోజుకు 82వేల మందికి పైగా భోజనాలు అందుతుండగా, అక్షయ కిచెన్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల వెలుపల ఏర్పాటు చేసిన కేంద్రాలు, టిటిడి అన్నప్రసాద భవనాలు తదితర ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం వినియోగిస్తున్నారు. 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 1,729 కిలోల మినపప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 497 కిలోల చింతపండు, రోజుకు 4,375 కొబ్బరికాయలు, 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 209 కిలోల ధనియాలు తదితర ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారు.

**ఐదునెలల్లో 4.40 కోట్లకు పైగా సర్వింగ్స్**

2026 జనవరి నుండి మే 31 వరకు తిరుమలలోని వివిధ అన్నప్రసాద కేంద్రాల ద్వారా మొత్తం 4.40 కోట్ల సర్వింగ్స్ భక్తులకు అందించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో జనవరిలో కోటి, ఫిబ్రవరిలో 71.39 లక్షలు, మార్చిలో 84.85 లక్షలు, ఏప్రిల్‌లో 85 లక్షలు, అలాగే మే నెలలో 92 లక్షలకు పైగా భక్తులకు అన్నప్రసాదం, అల్పాహారం, పానీయాలు అందించారు. అన్నప్రసాదం నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు టిటిడి పలు ఆధునిక చర్యలు చేపట్టింది. చట్నీలు, కూరల తయారీలో తాజా కొబ్బరికాయల వినియోగాన్ని ప్రవేశపెట్టింది. 2024లో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి అదనంగా 28 ప్రాంతాలకు ఆహార పంపిణీ సేవలను విస్తరించింది.

రోజుకు 2 లక్షల మంది భక్తులకు ఆహారం తయారు చేయగల సామర్థ్యంతో కొత్త శాటిలైట్ ఆటోమేటెడ్ కిచెన్ నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయి. భక్తుల విరాళాలతో నిర్వహించబడుతున్న వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ వద్ద ప్రస్తుతం రూ.2,500 కోట్లలకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తూ టిటిడి 'అన్నదానం మహాదానం' అనే భారతీయ సనాతన సంప్రదాయాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తోంది.

# తిరుమల అన్నప్రసాదంలో అదనంగా 'పప్పు' మెనూ!

● భక్తుల అభిప్రాయాలతో బోర్డు నిర్ణయం దిశగా అడుగులు



**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** 'గోవిందా... గోవింద' నామస్మరణతో దేశవిదేశాల నుండి ఏడుకొండలస్వామి దర్శనార్థం లక్షలాదిగా తరలివస్తున్న శ్రీవారి భక్తులకు ఆకలి అనే మాట వినిపించకుండా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదంలో త్వరలో 'పప్పు' మెనూ చేర్చేందుకు టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఇందుకోసం ఈ పప్పు చేర్చడానికి అవకాశాలు పరిశీలించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం తిరుమలలో రైస్‌మిల్లర్ల, పప్పులు సరఫరా చేసే వ్యాపారులతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఈ విషయంగా చర్చించడం ఇప్పుడు అన్నప్రసాదంలో పప్పు మెనూ చేరనుంది. దీనికోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నప్రసాదం విభాగం అధికారులను ఆయన ఆదేశించడం చర్చకు తావిచ్చింది. భక్తుల అభిప్రాయ సేకరణలో కొందరు అన్నప్రసాదంతోబాటు అదనంగా పప్పును కూడా వడ్డిస్తే మరింత బాగుంటుందని భక్తులు సూచించడం ఆ దిశగా టిటిడి అధికారులు కార్యాచరణ రూపొందించడం జరుగుతోంది.

'అన్నం పరబ్రహ్మ స్వరూపం'గా భావిస్తూ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్నప్రసాదాలు అందిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా 1.60లక్షల మంది నుండి 2లక్షల మంది వరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. అన్నప్రసాదంలో అదనంగా మసాలవడ అందిస్తుండటం, అన్నప్రసాదాల నాణ్యత వందశాతం మెరుగుపడటంతో ధనవంతులైన భక్తుల నుండి సామాన్యభక్తుల వరకు అన్నప్రసాదాలను దేవుని ప్రసాదంగా భావించి స్వీకరిస్తున్నారు. తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 8.30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెర పొంగలి, తాళింపు(కర్రీ)ని, మసాలవడ రుచికరంగా వడ్డిస్తున్నారు. రానున్న రోజుల్లో పప్పు కూడా చేరనుంది. ఒక లక్ష నుండి 1.40లక్షల మంది వరకు భక్తులు ప్రతిరోజూ అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి అధికారుల అంచనా. దాతలు కూడా అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరివిగా విరాళాలందిస్తున్నారు. ప్రస్తుతం రూ.2,500 కోట్ల రూపాయల పైగానే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు నిధులు డిపాజిట్లు రూపంలో ఉన్నాయి. దీని ద్వారా వచ్చే వడ్డీతోనే ప్రతిరోజూ తిరుమలలో భక్తులకు నాణ్యమైన రుచికరంగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్నారు. తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు అన్నప్రసాదాలను భక్తివిశ్వాసంతో స్వీకరిస్తున్నారు. రోజువారీగా 14 టన్నుల బియ్యం, 8టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు. దాతలు కూడా రోజుకు 44లక్షలు రూపాయలు విరాళమిస్తే వారి పేరున అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. ఉదయం అల్పాహారం 12లక్షలు, మధ్యాహ్నం, రాత్రి భోజనం 32లక్షలు రూపాయలు వ్యయమవుతోంది. ఇప్పుడు అదనంగా మెనూలో పప్పు చేర్చినా భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తారు.

# 22న వైభవంగా పుష్పయాగ మహోత్సవం

● సుగంధ పుష్పాలతో స్వామివారికి విశేష ఆరాధన

**తిరుమల, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 22న పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 21న సాయంత్రం 5.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, పుష్పయాగ అంకురార్పణ కార్యక్రమాలు జరగనున్నాయి. 22న ఉదయం 9.30గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించగా, మధ్యాహ్నం 1గంట నుండి సాయంత్రం 4గంటల వరకు పుష్పయాగం ఘనంగా జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ రకాల సుగంధ పుష్పాలు, పవిత్ర పత్రాలతో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు వీధి ఉత్సవం వైభవంగా జరగనుంది. లోప పరిహారార్థం పుష్పయాగం వార్షిక బ్రహ్మోత్సవాలు, నిత్యకైంకర్యాల నిర్వహణలో అర్చకులు, పరిచారకులు, అధికారులు, భక్తుల వల్ల తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ పుష్పయాగాన్ని నిర్వహిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.




# తిరుపతిలో టిడిఆర్ బాండ్ల అక్రమాల్లో నోటీసులు

● రాజకీయ ప్రకంపనలు

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** గత వైసిపి ప్రభుత్వంలో తిరుపతి స్మార్ట్‌సిటీలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి వెనుక భారీగా కుంభకోణం జరిగిందనేది సంచలనం మారింది. తిరుపతిలో రూ.414 కోట్ల మేరకు టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో అధికారులు పాత్ర, గత వైసిపి పెద్దలు, నగరపాలక కౌన్సిల్ పాత్ర ఉందని ప్రభుత్వానికి అందిన నివేదికలు. ఈ నివేదికలు ఇప్పుడు సంచలనం కలిగిస్తున్నాయి. తిరుపతి నగరంలో గత వైసీపీ హయాంలో టిడిఆర్ బాండ్ల కుంభకోణం న్యాయ, రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ పేరుతో 2020-24 మధ్య రూ.414 కోట్ల మేర భారీ దోపిడీ జరిగినట్లు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్ధారించారు. వైసిపి సీనియర్ నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు, తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డిలు ఈ స్కామ్‌లో ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు విజిలెన్స్ నివేదికలో తేలింది.

మాస్టర్ ప్లాన్ పేరుతో తిరుపతి నగరాభివృద్ధి కోసం రోడ్లను అడ్డం పెట్టుకుని భూమన కుటుంబం కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టినట్లు అధికారులు ఆధారాలతో సహా గుర్తించారు. సామాన్యులకు సంబంధించిన సాధారణ ఇళ్ల స్థలాలను రికార్డుల్లో రాత్రికి రాత్రే భారీ విలువైన వాణిజ్య భూములుగా మార్చేశారనేది విజిలెన్స్ నివేదికలు. దీనివల్ల ఆ భూములకు మార్కెట్ ధర కంటే వందల రెట్లు ఎక్కువ విలువ వచ్చేలా చూసి, తప్పుడు లెక్కలతో భారీ మొత్తంలో టిడిఆర్ బాండ్లను సృష్టించారనేది నివేదికల్లో సారాంశం. తాము చెప్పిన ధరకే భూములు రాసివ్వాలని, లేదంటే ఇళ్లు కూల్చేస్తామంటూ బెదిరించి ల్యాండ్ మాఫియా తరహాలో దందా సాగించారనేది పేర్కొన్నారు. ఈ భారీ స్కామ్‌లో నగరపాలక సంస్థ, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన అధికారులు కీలక పాత్ర పోషించారని విజిలెన్స్ తేల్చింది.

గత వైసిపి హయాంలో పనిచేసిన నలుగురు మున్సిపల్ కమిషనర్లుపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేశారు. తప్పుడు డాక్యుమెంట్లను కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్ చేసిన ఆరుగురు సబ్ రిజిస్ట్రార్లపై విచారణకు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ (పట్టణ ప్రణాళిక) విభాగంలో అవినీతికి పాల్పడిన 20 మంది సిబ్బందిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. మరీ రానున్న రోజుల్లో ఈ కేసు ఎక్కడకు దారితీస్తుందనేది మాత్రం సంచలనంగా మారింది.

# మోడీ నేతృత్వంలో దేశం శక్తివంతం

● డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సేవలో ప్రధాని మోడీ 4,399 రోజుల పాలన పూర్తి అయ్యిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ, మోడీ సేవలను కొనియాడారు. 'మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం.. దేశానికే అంకితమైన జీవితం' అని అన్నారు. దేశానికి నిస్వార్థ సేవ చేస్తున్న ప్రధానమంత్రి మోడీ, ఎన్‌డియే ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గత 12యేళ్లలో ఎన్‌డియే ప్రభుత్వం ప్రధాని మోడీ నాయకత్వంలో భారత్‌ను బలమైన దేశంగా తీర్చిదిద్దిందని అన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశ భద్రత మరింత పటిష్ఠమైందని, ఆధునీకరణ దిశగా భారత సాయుధ దళాలకు కొత్త శక్తి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌కు కీలక స్థానం లభించిందని, జి20 సమ్మిట్ విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టి భారత్ వైపు మళ్లిందని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్‌కు బలమైన స్వరంగా భారత్ ఎదిగిందని వ్యాఖ్యానించారు.

డిజిటల్ ఇండియా విప్లవం ద్వారా ప్రజలకు సేవలు చేరువయ్యాయని పవన్ అన్నారు. జనధన్, ఆధార్- మొబైల్ అనుసంధానంతో పారదర్శక పాలన సాధ్యమైందని చెప్పారు. యుపిఐ, డిబిటి వ్యవస్థలతో డిజిటల్ చెల్లింపులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కింద కోట్ల మందికి వైద్య భరోసా లభిస్తోందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు సొంత ఇళ్ల కల సాకారమవుతోందని పవన్ ప్రస్తావించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు సదుపాయం కల్పించారన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల్లో భారీ అభివృద్ధి సాధించారని చెప్పారు. వందే భారత్ రైళ్లతో రవాణా రంగంలో కొత్త శకం మొదలైందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రధాని మోడీ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్ 2047 సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామ్యం వహిస్తుందన్నారు. భిన్నత్వమే భారతదేశ బలమని, భాషలు భారత గర్వకారణమన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటామని, విభజన శక్తులను ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. జై హింద్.. జై భారత్ అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



# 'మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై అగ్రస్థానంలో నిలుస్తోంది'

**తిరుపతిలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు**

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దైవానుగ్రహం, ప్రజల ఆశీస్సులతో మరింత కాలం దేశానికి నాయకత్వం వహించి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ తిరుపతిలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానమంత్రిగా అత్యధిక కాలం 12 సంవత్సరాల పాలన సాగించిన నేతల్లో ఒకరిగా నరేంద్ర మోడీ రికార్డు సృష్టించిన సందర్భంగా దేశవ్యాప్తంగా బిజెపి శ్రేణులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తిరుపతిలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దకాపు వీధిలోని శ్రీరామ భజన మందిరంలో సీతారాముల వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆయురారోగ్యాలు, శక్తి, ధైర్యం, మనోబలం ప్రసాదించి దేశసేవకు మరింతకాలం అవకాశం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై తన ప్రత్యేకతను చాటుకుంటోందని అన్నారు. దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెంపులో ప్రభుత్వం విశేష కృషి చేసిందని పేర్కొన్నారు. భజన అనంతరం విచ్చేసిన భక్తులకు భజన కళాకారులకు శ్రీవారి లడ్డు ప్రసాదాలు, అన్నప్రసాదాలు వితరణ చేశారు.

# ప్రధాని మోడీకి మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానిగా వరుసగా ఎన్నికై, అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును సాధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి హృదయపూర్వక శుభాకాంక్షలంటూ 'ఎక్స్' వేదికగా మంత్రి లోకేష్ వ్యాఖ్యానించారు. మన దేశ తొలి ప్రధానమంత్రి నెహ్రూని అధిగమించి మోడీ నెలకొల్పిన ఈ రికార్డు అనితరసాధ్యం. 12యేళ్ల పాలనలో నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలో అజేయశక్తిగా సగర్వంగా నిలిపింది. ప్రజలకు అవకాశాలు, గౌరవం కల్పించడం, స్వావలంబన, సాధికారత దిశగా దేశాన్ని నడిపించిన మోడీ సమర్థ నాయకత్వానికి జేజేలని పేర్కొన్నారు.

# కార్మిక సంఘాలపై డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ వ్యాఖ్యలు ఆక్షేపణీయం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య**



**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో కార్మిక సంఘాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయమని సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆరోపించారు. బాధిత కుటుంబాల తరపున నిలబడుతున్న యూనియన్ నాయకులను తూలనడటం సమంజసం కాదని పేర్కొన్నారు. కార్మిక సంఘాలు రాజకీయాలు చేస్తున్నాయంటూ పవన్ కల్యాణ్ చౌకబారు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం నిరక్ష్యం కారణంగానే స్టీల్ ప్లాంట్లో ప్రమాదం జరిగిందని నిలదీసిన కార్మిక సంఘాలకు మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పకుండా, మీ కుటుంబంలో ఎవరూ చనిపోలేదు కదా? అంటూ కార్మికసంఘాల నేతల్ని ఉద్దేశించి వెటకారంగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. ఘోర ప్రమాదంపై స్టీల్ ప్లాంట్ యాజమాన్యం బాధ్యతారహితంగా వ్యవహరిస్తుందని, కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని తెలిపారు. స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే ఇంతటి పెద్ద ప్రమాదం జరగడం మునుపెన్నడూ లేదని, ఇది ముమ్మాటికీ డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రైవేటీకరణ విధానాలు, యాజమాన్య నిరక్ష్యం వల్ల జరిగిన ప్రమాదమేనని ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో పలువురికి పదోన్నతులు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో ఐదుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించిన ఉద్యోగోన్నతుల జాబితాలో భాగంగా ఎన్ఆర్ రాజశేఖర్, జి.మధుప్రకాష్ రెడ్డి, ఇ.భాస్కర్, జి.వెంకటరత్నం, జివి సత్యనారాయణకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హోదాలో ఉద్యోగోన్నతి లభించింది. ఈ ఉద్యోగోన్నతులు సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996లోని రూల్ 10(ఎ) ప్రకారం తాత్కాలిక, అడ్హాక్ ప్రాతిపదికన మంజూరు చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కోర్టులు లేదా ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పులకు లోబడి ఈ ఉద్యోగోన్నతులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతి పొందిన అధికారులు రూ.76,730 నుంచి రూ.1,62,780 వరకు వేతన శ్రేణిలో విధులు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఇఎన్‌సికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

**తిరుపతి, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం నుండి అక్రమంగా ఎర్రచందనం రవాణా చేస్తున్న స్మగ్లర్లను అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారినుండి తిరుపతి జిల్లా తాయి మమాంబపురం వద్ద 77 ఎర్రచందనం దుంగలతో పాటు, ఒక కారు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లును అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏఎస్పీ జె.కులశేఖర్, డిఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్ఎస్ఐ కెఎస్‌కె లింగాధర్ టీమ్, ఎఫ్ఆర్ఒ సుభాష్‌తో కలసి తిరుపతి డివిజన్ పుత్తూరు రేంజ్ నారాయణవనం బీటుకు మంగళవారం రాత్రి చేరుకున్నారు. పుత్తూరు-నేసనూరు మార్గంలోని తాయి మమాంబపురం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. బుధవారం తెల్లవారుజామున ఒక మోటారు సైకిల్, దాని వెనుక ఒక కారు వేగంగా రావడంతో అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ వాహనాలను అడ్డగించే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరిని పుత్తూరు మండలానికి చెందిన వ్యక్తిగా, మరొకరిని తమిళనాడు తిరువన్నామలైకు చెందిన వారిగా గుర్తించి అరెస్టు చేశారు. కారులోని 77 ఎర్రచందనం దుంగలను, మోటారు సైకిల్, కారును స్వాధీనం చేసుకున్నారు.

11-6Pg7exHMNWJQE.qxd:11-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:29 AM Page 1



# దుర్గమ్మ గుడిలో మెరుగైన పారిశుద్ధ్యం


ఆలయ ప్రాంగణంలో పరిశీలిస్తున్న ఇఓ శీనానాయక్

**ఇంద్రకీలాద్రి, జూన్ 10 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో మెరుగైన పారిశుద్ధ్య విధానాలు పాటించాలని ఇఓ వికె శీనానాయక్ ఆదేశాలిచ్చారు. బుధవారం ఆలయ ప్రాంగణమంతా కలియ తిరిగి శానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. ఆలయంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన నవుడు క్యూలైన్లు, మెట్లమార్గంలో పాతచెప్పులు, వాడేసిన ఇనుప పైపులుండడాన్ని గమనించి వెంటనే వాటిని అక్కడి నుండి సరైన ప్రాంతానికి తరలించాలని, ఆ ప్రదేశాన్ని పరిశుభ్రం చేయాలని, శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం సహించమని హెచ్చరించారు.
**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన వేమూరి సుబ్బారావు, వీర రాఘవమ్మ దంపతులు రూ.2,01,116ల విరాళం బుధవారం ఇఓ



వికె శీనా నాయక్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## మందుబాబులకు జైలుశిక్ష

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపిన 10మందికి కోర్టు జైలుశిక్ష విధించింది. విజయవాడ 1, 2, 4, 5 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అధికారులు తమ సిబ్బందితో కలిసి ఈనెల ఒకటవ తేదీ నుండి 9వతేదీ వరకు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 127 మందిపై కేసులు నమోదు చేసి, న్యాయస్థానాల్లో నిందితులను బుధవారం హాజరు పరిచారు. ఈసందర్భంగా విచారించిన కోర్టు వీరిలో ఒకరికి మూడురోజుల జైలుశిక్ష, తొమ్మిదిమందికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు, 117 మందికి రూ.11.95లక్షల జరిమానా విధించింది.

## అనుమానంతో భార్యను చంపిన భర్త

● మార్కాపురం జిల్లా సర్విరెడ్డిపల్లిలో ఘటన



సంఘటన స్థలంలో డిఎస్పీ నాగరాజు, గిద్దలూరు సిఐ రామకోటయ్య

**కొమరోలు, జూన్ 10 ప్రభాతవార్త:** అనుమానంతో భార్యను భర్త గొడ్డలితో అతి కిరాతకంగా నరికి చంపిన సంఘటన మండలంలోని సర్విరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం తెల్లవారుఝామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం జిల్లా కొమరోలు మండలం సర్విరెడ్డిపల్లి గ్రామంలోని పందీటి మరియా జ్యోతికి గిద్దలూరు పట్టణంలోని ఏబీఎం పాలెంకు చెందిన దావీదుకు సుమారు 20 సం. కిందట వివాహం జరిగింది. వీరికి 16సం. అమ్మాయి, 13సం. అబ్బాయి ఉన్నారు. వీరు గత కొన్ని సంవత్సరాలుగా విడివిడిగా నివాసం ఉంటున్నారు. మరియ జ్యోతి తల్లి గ్రామమైన సర్విరెడ్డిపల్లిలో వెలుగు కార్యాలయంలో గ్రామసమైఖ్య సభ్యురాలు(వీఏఓ)గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. మృతురాలి అక్కకు బాగాలేదని తల్లి మరియమ్మ రెండు రోజుల కిందట హైదరాబాదుకు వెళ్ళటంతో ఇదే అదునుగా చేసుకున్న దావీదు గురువారం తెల్లవారు ఝామున మరియజ్యోతి, చెల్లెలుతో కలసి బహిర్భూమికి వెళ్ళారు. ఇంతలో కంపచెట్ల మధ్యలో పొంచిఉన్న దావీదు గొడ్డలితో కనిపించడంతో వీరు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గొడ్డలితో ఎక్కడ పడితే అక్కడ నరకడంతో సుమారు పది నిమిషాలు పెనుగులాట జరిగింది, అప్పటికే తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది.
మృతురాలి చెల్లెలు అరుపులు, కేకలతో చుట్టుప్రక్కల ప్రజలు రావటంతో సంఘటనా స్థలం నుంచి దావీదు పారిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలానికి మార్కాపురం డి.ఎస్.పి నాగరాజు, గిద్దలూరు సీఐ రామకోటయ్య, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి

● పెండింగ్ పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం

● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ● ప్రశాంతంగా నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం




**నెల్లూరు (కలెక్టరేట్), జూన్ 10 ప్రభాతవార్త:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రహదారుల మరమ్మత్తులు, సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, సిఇవో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపిపిలు, అధికారులు హాజరయ్యారు. తొలుత సమావేశంలో పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా విద్యాశాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సభలో చర్చించారు. ప్రధాన రహదారుల మరమ్మత్తులు, నూతన రోడ్ల మంజూరుపై సభ్యులు ప్రశ్నించారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా సచివాలయాల బిల్డింగులు అసంపూర్తిగా ఉన్నాయని, బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, నాడు నేడు కింద పాఠశాలలో చేపట్టిన పనులు కూడా మధ్యలో నిలిచిపోయి ఉన్నాయని పలువురు సభ్యులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. తమకు మరో మూడు నెలలు మాత్రమే ఉందని, ఈ సమయంలోగా తాము ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు జడ్పిటిసిలు కోరారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యకేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు.
ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశం సజావుగా జరిగిందని తెలిపారు. మరో మూడు నెలల్లో జిల్లా ప్రజాపరిషత్ పాలక మండలి పదవీ కాలం ముగుస్తుందని, మొట్టమొదటి జిల్లా పరిషత్ సమావేశంలో తాను పాల్గొన్నానని, చివరి సమావేశంలో కూడా తాను పాల్గొని జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ చేసిన సేవలను గుర్తు చేసుకోవడంలో పాలు పంచుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా పరిషత్ సాధారణ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, కొన్ని సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రధానంగా రహదారుల మరమ్మత్తులపై సభ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సచివాలయాలను పూర్తిస్థాయిలో నిర్మించడం, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, పాఠశాలలు మొదలైన అంశాలపై కూడా చర్చించామని, వీటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.
కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తుందన్నారు. కోవూరు నియోజకవర్గంలో చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు భోజనం తినడానికి సరైన వసతులు లేవన్నారు. పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా చోట్ల వంట గదులు భోజనశాలలను సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని అధికారులు బాధ్యతగా తీసుకొని చేపట్టాలన్నారు. వంటలు వడ్డించేటప్పుడు విద్యార్థులకు ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు ఎక్కువ ఉంటాయని, ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్స్, స్మశానాలు గడిచిన 24 నెలలుగా చాలా ప్రాంతాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఇంకా చాలా వరకు చేయాల్సి ఉందన్నారు. వాటికి సంబంధించిన పనులకు జడ్పీ నిధులు మంజూరు చేయాలని కోరారు.
జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను ఆయాశాఖాల అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.
ప్రధానంగా రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.
ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ విజయభాస్కర్, డిఇఓ ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటసుబ్బయ్య, డిఆర్‌డిఎపిడి నాగరాజు కుమారి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి, జలవనరులశాఖ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, డిఎంఅండ్‌హెచ్ఓ సుజాత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విస్సన్నపేటలో తల్లిని చంపిన తనయుడు

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో దారుణం చోటుచేసుకుంది. తల్లి రమాదేవిని కుమారుడు రఘువంశీ చంపాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హత్య జరిగిన రెండవ రోజున ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. హైదరాబాద్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్న కుమారుడు రఘువంశీ తాను చేసిన అప్పులు తీర్చడానికి ఇల్లు అమ్మాలంటూ తల్లిని ఒత్తిడి చేయగా దానికి ఆమె నిరాకరించింది. దీంతో తల్లిపై కక్ష పెంచుకుని హత్యచేసినట్లు పోలీసులు గుర్తించారు. విస్సన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రమాదేవి చిన్న కుమారుడు రఘువంశీ హైదరాబాద్‌లో నివసిస్తుంటారు. ఆయనే ఈ హత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది. అప్పుల బాధలో ఉన్న అతను, వాటిని తీర్చుకోవడం కోసం ఇంటిని అమ్మేయాలని తన తల్లిపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె అందుకు నిరాకరించడంతో ఆమెపై కోపం పెంచుకుని, పథకం ప్రకారం ఆమెను హత్య చేశాడు. దీనితో మేము అతన్ని అదుపులోకి తీసుకున్నామని తిరువూరు సీఐ గిరిబాబు తెలిపారు. ఈ నెల 7న తల్లి ఒంటరిగా ఉన్న సమయం చూసి కుమారుడు ఆమెపై దాడి చేశాడు. అనంతరం తన చేతులతోనే గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత ఏమీ జరగనట్లుగా అతను హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయాడు. రమాదేవి సోదరి ఆమె మృతదేహాన్ని చూసినప్పుడు, అది సహజ మరణం కాదని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనితో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి రమాదేవికి సంబంధించిన వివరాలు సేకరించారు. అతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ప్రశ్నించగా తానే ఆ హత్య చేశానని రఘువంశీ అంగీకరించాడు. దాంతో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు."హత్య జరిగిన మరుసటి రోజే రమాదేవి సోదరి ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బీహార్ బస్సు ప్రమాదంలో మరొకరు మృతి



**సంగం (నెల్లూరు), జూన్ 10 ప్రభాతవార్త:** బీహార్‌లో ఆంధ్ర యాత్రికుల బస్సుకు జరిగిన ఘోర ప్రమాదంలో మరో ప్రాణం అనంతవాయువులలో కలిసి పోయింది. ఐసియులో చికిత్స పొందుతున్న నెల్లూరు జిల్లా సంగంకు చెందిన బొమ్మిశెట్టి లక్ష్మమ్మ మృతి చెందింది. ఈ సంఘటనతో సంగంలో మరింత విషాద ఛాయలు అలముకున్నాయి. లక్ష్మమ్మ మృతితో కేవలం సంగంలోనే ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఆత్మకూరుతో కలిపితే మొత్తం నలుగురు మృత్యువాత పడ్డారు.

# 400 చెరువుల్లో పూడికతీత పనులు


పులివాగు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త:** భూగర్భజలాల పెంపు, జలవనరుల సంరక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార-జలహారతి కార్యక్రమం ఎన్‌టిఆర్ జిల్లాలో చురుగ్గా సాగుతుందని, ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 400 చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. జి.కొండూరు మండలం పినపాక గ్రామంలో రైతులు, ప్రజల బాగస్వామ్యంతో పులివాగులో పూడికతీత పనులను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధిహామీ అనుసంధానంతో జలవనరుల సంరక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పులివాగు ఫీడర్ ఛానల్ అభివృద్ధి పనులను శ్రామికులతో చేయించేందుకు వీలులేకపోవటంతో జేసిబి సాయంతో పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈపనులు చేపట్టడం సంతోషకరమని, ఇందులో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సైతం తన వంతు చేయూతనివ్వటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లోనూ ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వస్తే జిల్లాను జలధారలో అగ్రగామిగా నిలపవచ్చని కలెక్టర్ అభిప్రాయం వ్యక్తంచేసారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం తోడైతే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ప్రభుత్వం, ప్రజలు కలిసి చేపట్టిన మంచి పని నూతన అధ్యాయానికి నాంధి కానుందన్నారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి రాము, పలువురు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరులో ఘరానా చోరీ కేసు ఛేదన

● నలుగురు నిందితులు అరెస్ట్ ● రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

**నెల్లూరు (క్రైం), జూన్ 10 ప్రభాతవార్త:** నగరంలోని పెద్దబజార్‌లో జరిగిన చోరీ కేసును చిన్నబజార్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 145.300 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను బుధవారం ఏఎస్పీ దీక్ష మీడియాకు వెల్లడించారు. ఈనెల 2వ తేదీ పెద్దబజార్ ప్రాంతానికి చెందిన షేక్ అజ్మత్ తన ఇంటికి రాగా, బీరువా లాకర్ తెరిచి ఉండటాన్ని గమనించారు. అందులోని బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, ఆమె వెంటనే చిన్నబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య పర్యవేక్షణలో, నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష ఆధ్వర్యంలో చిన్న బజార్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, 9న పెద్దబజార్, డైకస్ రోడ్ సెంటర్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్ ఇర్ఫాన్ (19), మొహమ్మద్ ఆబిద్(20)లతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో, వారి నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన చిన్నబజార్ సీఐ ఎస్. శ్రీనివాసరావు, ఎస్ఐలు రజాక్, అయ్యప్ప, వారి క్రైమ్ సిబ్బందిని జిల్లా ఇంచార్జి ఎస్పీ, టౌన్ ఏఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు.

## మున్సిపాలిటీ భూములను ఆదాయవనరుగా మార్చాలి

● పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్



ఆర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

**విజయవాడ, జూన్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలకు చెందిన భూములను విక్రయించవద్దని వాటిని ఆదాయ వనరుగా మార్పుచేయాలని రాష్ట్రమున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో ఆర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ పై రెండురోజుల వర్క్‌షాప్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల భూముల్లో వాణిజ్య సముదాయాలు, మార్కెట్‌లు, పెట్‌పార్కులు, స్పోర్ట్స్ ఎరీనాలుగా అభివృద్ధి చేసి ఆదాయ వనరుగా మార్చాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమీషనర్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, సోషల్‌మీడియా వేదికగా ఉపయోగించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం జరిగే ప్రాంతాల్లో సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలన్నారు. పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం రూపొందించిన 30రోజుల కార్యాచరణ ప్రణాళికను అర్బన్ మున్సిపాలిటీల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీ కనీసం ఒక లాభదాయ ప్రాజెక్టును పెద్దకార్పోరేషన్లు ఒకటి కంటే ఎక్కువ ప్రాజెక్టులను ప్రతిపాదించాలని కోరారు. వీటిలో డిపిఆర్, ఆర్థిక అంచనాలు, ఆదాయ వనరులు, నిర్వహణ ప్రణాళికలు ఉండాలన్నారు. మున్సిపాలిటీల్లో మౌలిక వసతులను కల్పనను ముఖ్యమంత్రి ప్రశంసించారని తెలిపారు. ప్రతినెలా మున్సిపాలిటీలపై ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నారని సురేష్‌కుమార్ చెప్పారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ వివేక్, జివియంసి కమీషనర్ కేతన్‌గార్గ్, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ యండి అనీల్‌కుమార్‌రెడ్డి, పబ్లిక్ ఈఎన్‌సి యం.ప్రభాకరరావు, సీఈ ఏ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మరో కార్మికుడు మృతి
## కన్నీరు పెట్టిస్తున్న తండ్రి చివరి మాటలు

**విశాఖపట్నం, జూన్ 11 ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు పైడిరాజు బుధవారం ఉదయం మృతి చెందడంతో దుర్ఘటనలో మృతుల సంఖ్య 9కు చేరింది. ప్రాణాలతో పోరాడుతూ తన కుటుంబ సభ్యులకు చెప్పిన చివరి మాటలు ఇప్పుడు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. ఈ నెల 8న స్టీల్ మెల్టింగ్ షాప్‌లో సలసల మరుగుతున్న ఉక్కు ద్రవం ఒక్కసారిగా లావాలా ఎగసిపడి కార్మికులపై చెలరేగడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం కన్నుమూశారు. గాయాలతో ఆసుపత్రి మంచంపై చికిత్స పొందుతున్న సమయంలో తన కుమారుడు వర్మతో మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "వర్మా... తమ్ముడి మీద చిరాకు పడకు... వాడిని బాగా చదివించు... నువ్వు కూడా బాగా చదువుకో... అమ్మను బాగా చూసుకోండి... ఉంటాను డాడీ" అంటూ కన్నీటి గొంతుతో చెప్పిన మాటలు హృదయాలను కలచివేస్తున్నాయి. తన ప్రాణాల కంటే కుటుంబ భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ పిల్లలకు బాధ్యతలు అప్పగించిన ఆ తండ్రి ప్రేమ, ఆవేదన అందరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది. మృత్యువుతో పోరాడుతూనే కుటుంబానికి ధైర్యం చెప్పిన పైడిరాజు చివరి సందేశం ఇప్పుడు ఒక కుటుంబానికే కాకుండా సమాజానికే మానవీయతను గుర్తు చేస్తున్న విషాద గాథగా మారింది.
ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించింది. మృతి చెందిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు వివిధ ప్రయోజనాలు కలిపి రూ.1.72 కోట్ల వరకు, ఒప్పంద ఉద్యోగుల కుటుంబాలకు సుమారు రూ.45 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనపై కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మిగిలిన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

● ఉద్యోగాలు కల్పించాలి.. లేకపోతే అధికారంలోకి రాగానే మేమే అమలు చేస్తాం ● చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు



**విశాఖపట్నం, జూన్ 10 ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించి, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ఆ పని చేయకపోతే, తమ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే కోటి రూపాయల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో గాయపడి సెవెన్ హిల్స్, కిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను బుధవారం పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రమాదంలో ఇప్పటివరకు తొమ్మిది మంది మరణించగా, మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్నారు. ప్రమాద బాధితుల కుటుంబాలకు రూ.1.72 కోట్లు వస్తాయని ప్రభుత్వం చెబుతోందని, అయితే అది వారి హక్కుగా రావాల్సిన సొమ్మేనని జగన్ పేర్కొన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, పీఎఫ్, గ్రాట్యుటీ, ఇతర బెనిఫిట్స్ రూపంలో మరో రూ.1.45 కోట్లు కూడా వారికి హక్కుగా లభిస్తాయని చెప్పారు. "వారి హక్కుగా వచ్చే డబ్బును ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకోవడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఏమి ఇస్తోంది?" అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడేందుకు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్ని విధాలా పోరాడిందని జగన్ గుర్తు చేశారు. 2021లో ప్రధానికి రెండు లేఖలు రాశామని, అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో కూడా ప్రైవేటీకరణను వ్యతిరేకించినట్లు తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి స్టీల్ ప్లాంట్‌పై చిత్తశుద్ధి ఉంటే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో స్టీల్ ప్లాంట్‌లో 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, గత రెండేళ్లలో 10 వేల మందికిపైగా ఉద్యోగాలు తగ్గిపోయాయని ఆరోపించారు. 6,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, 1,800 మందిని వీఆర్ఎస్ ద్వారా పంపించివేశారని, మరో 2,500 మంది పదవీ విరమణ చేశారని పేర్కొన్నారు. నాలుగున్నర నెలలుగా ఉద్యోగులకు జీతాలు అందడం లేదని, బోనస్, హెచ్‌ఆర్ఏ, ఎల్‌టీసీ, వైద్య సదుపాయాలు వంటి అనేక ప్రయోజనాలు నిలిపివేశారని విమర్శించారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీని కూడా సంస్థ అభివృద్ధి లేదా భద్రత కోసం కాకుండా, వీఆర్ఎస్, రుణాలు, జీఎస్టీ బకాయిల చెల్లింపులకే వినియోగించారని ఆరోపించారు. ప్రమాదంలో కార్మికుల తప్పిదం ఏమాత్రం లేదని, ముడి పదార్థాల నాణ్యత లోపాలు, సాంకేతిక కారణాల వల్లే ప్రమాదం జరిగిందని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

### స్టీల్ ప్లాంట్ బాధితులకు జగన్ పరామర్శ

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల చోటు చేసుకున్న విషాదకర ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న



బాధితులను వైఎస్ జగన్ స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స విధానం, బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ప్రమాదంలో గాయపడిన కార్మికుల కుటుంబ సభ్యులతో కూడా జగన్ మాట్లాడారు. వారికి ధైర్యం చెబుతూ, ఈ క్లిష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా జగన్ పేర్కొన్నారు. బాధితులను పరామర్శించిన అనంతరం వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారి ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

11-6pg10.qxd:11-6pg10.qxd 1/1/02 5:47 AM Page 1



# అఫ్ఘాన్‌తో వన్డే సమరానికి రెడీ




## టీమిండియాలో ఆరుగురు ఔట్

## జట్టులోకి కీలక ప్లేయర్లు ఎంట్రీ

**న్యూఢిల్లీ:** అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిన టీమిండియా, ఇప్పుడు మూడు మ్యాచ్‌ల వన్డే సమరానికి సిద్ధమవుతోంది. అఫ్ఘానిస్తాన్‌తో జరగబోయే ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకంగా మారనుంది. ఈ నెల 13న ధర్మశాలలో మొదటి వన్డే, 17న లక్నోలో రెండో వన్డే, 20న చెన్నైలో చివరి వన్డే మ్యాచ్ జరగనున్నాయి టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే భారత సెలెక్టర్లు వన్డే జట్టులో భారీ మార్పులు చేశారు. టెస్టు జట్టులో ఉన్న ఆరుగురు ఆటగాళ్లను పక్కన పెట్టి, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో నిరూపించుకున్న ఆరుగురు కీలక ఆటగాళ్లను జట్టులోకి తీసుకొచ్చారు. రెండు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను ఎంపిక చేసిన సెలెక్టర్లు, టెస్టులో ఆడిన కొందరు ఆటగాళ్లను వన్డే సిరీస్ నుంచి తప్పించారు. ముల్లాంపూర్ టెస్టులో భాగమైన సాయి సుదర్శన్, రిషబ్ పంత్, దేవదత్ పడిక్కల్, మహ్మద్ సిరాజ్, మానవ్ సుతార్, ధ్రువ్ జురెల్ వన్డే జట్టులో చోటు కోల్పోయారు.

వాస్తవానికి యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా ఈ జాబితాలో ఉండాల్సిందే, కానీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మోకాలి వెనుక భాగంలో నరాల నొప్పితో వన్డే సిరీస్ మొత్తానికి దూరం కావడంతో జైస్వాల్‌కు అదృష్టం వరించింది. కోహ్లీ స్థానంలో జైస్వాల్‌ను వన్డే జట్టులోకి కొనసాగించారు. ఇక టెస్ట్ జట్టు నుంచి ఔట్ అయిన వారి స్థానంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తిరుగులేని రికార్డు ఉన్న ఆరుగురు ఆటగాళ్ల జట్టులోకి వచ్చారు. టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ తిరిగి వన్డే జట్టులోకి వచ్చాడు. అలాగే టెస్టు ఫార్మాట్ నుంచి విరామం తీసుకున్న వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టుతో చేరాడు. ట్వంటీ20 సిరీస్ తర్వాత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్, చాలా కాలం తర్వాత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వన్డే జట్టులోకి పునరాగమనం చేశారు. వీరితో పాటు ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ వన్డే సిరీస్‌లో తమ సత్తా చాటనున్నారు.

అఫ్ఘానిస్తాన్ వన్డే సిరీస్ కోసం భారత పూర్తి జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే ఉన్నారు.






## ఆస్ట్రేలియన్ ఓపెన్..

## రెండో రౌండ్‌కు సింధు, తన్వి

### ముగిసిన పురుషుల సింగిల్స్ పోరు

**న్యూఢిల్లీ:** సిడ్నీలో జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ షట్లర్లు పి.వి. సింధు, తన్వి శర్మ ముందంజతో రెండో రౌండ్‌కు చేరుకున్నారు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు, పెరూకు చెందిన ఇనెస్ కాస్టిల్లోపై వరుస గేమ్‌లలో సునాయాస విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 10వ స్థానంలో ఉన్న ఈ మాజీ ప్రపంచ ఛాంపియన్, మ్యాచ్ ఆద్యంతం తన నియంత్రణలో ఉంచుకుని, 21-13, 21-11 తేడాతో విజయం సాధించింది. టీనేజర్ తన్వి శర్మ కూడా అద్భుతమైన ప్రదర్శనతో రెండో రౌండ్‌కు చేరుకుంది. ప్రస్తుత బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అయిన ఆమె, ప్రారంభ రౌండ్‌లోని అత్యంత ఆసక్తికరమైన ఫలితాల్లో ఒకటిగా, చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ నంబర్ 11 చియు పిన్‌చియాన్‌ను 21-12, 22-20 తేడాతో ఓడించింది. సింధు ఇషారాణితో, తన్వి మాళ్వికతో తలపడనుండగా, మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ నుండి కనీసం ఇద్దరు ప్రతినిధులు ఖాయమయ్యారు. అయితే, పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, సనీత్ దయానంద్, తరుణ్ మన్నేపల్లి అందరూ తొలి రౌండ్‌లోనే ఓటమి పాలవ్వడంతో, ఈ విభాగంలో భారతదేశపు పోరాటం ముగిసింది. అయితే పురుషుల డబుల్స్‌లో మాత్రం ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్ తొలి రౌండ్‌లో ఘన విజయం సాధించారు.

## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్

### 21 యేళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై విజయం




**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. 21 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియాపై వన్డే మ్యాచ్‌లో విజయాన్ని కైవసం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఢాకా వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా 86 పరుగుల తేడాతో ఆస్ట్రేలి యాను ఓడించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసాడెక్ హుస్సేన్ అద్భుతమైన ప్రదర్శనతో విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో అజేయ హాఫ్ సెంచరీతో రాణించిన మొసాడెక్(86 నాటౌట్), బౌలింగ్‌లో (2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 284 పరుగులు చేసింది. తంజిద్ హసన్(44 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 54), నజ్ముల్ హుస్సేన్ షాంటో(86 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 67), మోసాడెక్ హోస్సేన్(70 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 86నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 3 వికెట్లు, లియామ్ స్కాట్, మ్యాట్ రేన్‌షా రెండేసి వికెట్లు, గ్జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం ఆస్ట్రేలియా వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి 42.2 ఓవర్లలో 9 వికెట్లకు 191 పరుగులే చేసింది. ఆ తర్వాత వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు డక్‌వర్త్ లూయిస్ ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని తేల్చారు. అలెక్స్ క్యారీ(47), కామెరూన్ గ్రీన్(52 నాటౌట్), కూపర్ కనోల్లీ(35) మినహా అంతా విఫలమయ్యారు.







## టెస్ట్ ర్యాంకింగ్స్‌లో.. వరల్డ్ నంబర్ 1గా బ్రూక్

### ఎనిమిదో స్థానంలో భారత్ కెప్టెన్ గిల్

**న్యూఢిల్లీ:** ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ తన సహచరుడు జో రూట్‌ను అధిగమించి నెం.1 స్థానాన్ని తిరిగిదక్కించుకోగా, అఫ్ఘనిస్తాన్‌తో ఇటీవల జరిగిన ఏకైక మ్యాచ్‌లో సెంచరీ సాధిం చిన భారత కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ రెండు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికిచేరుకున్నాడు. ఆ మ్యాచ్‌లో భారతజట్టు ఇన్నింగ్స్ మరియు 300 పరుగుల తేడాతో విజయం సాధించింది. లార్డ్స్‌లో జరిగిన ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గేమ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 115 పరుగుల తేడాతో విజయం సాధించగా, ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ చేసిన తర్వాత బ్రూక్ తిరిగి నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. ఎనిమిది పరుగులు మాత్రమేచేయడంతో రూట్ మూడో స్థానానికి పడిపోగా, ఆస్ట్రేలియాకు చెందిన ట్రావిస్ హెడ్ రెండో స్థానానికి ఎగబాకాడు. ఇక న్యూ చండీగఢ్‌లో అఫ్ఘనిస్తాన్‌పై 126 పరుగులు చేసిన గిల్ ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ త్రయం బెన్ డకెట్ (మూడు స్థానాలు ఎగబాకి 15వ స్థానానికి), జేమీ స్మిత్ (ఐదు స్థానాలు ఎగబాకి 23వ స్థానాన్ని సమంగా చేర్చాడు) మరియు గ్లెన్ ఫిలిప్స్ (40వ స్థానానికి)కూడా బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధిం చారు. బౌలింగ్‌లో ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ ఏడు స్థానాలు ఎగబాకి టాప్ 10 టెస్ట్ బౌలర్లలో పదవ స్థానంలోకి ప్రవేశించగా, ఆల్ రౌండర్లలో ఆరవ స్థానానికి చేరుకున్నాడు.

### అంటాల్యా ప్రపంచ కప్‌లో.. తొలి రౌండ్‌లోనే

## భారత్ ఆర్చర్లు నిష్క్రమణ




**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ మూడవ దశలో, వ్యక్తిగత ఈవెంట్ల రౌండ్ ఆఫ్ 64లో వర్ధమాన తార సాహిల్ జాదవ్‌తో సహా నలుగురు ఆర్చర్లు నిష్క్రమించడంతో, భారత కాంపౌండ్ ఆర్చరీ ప్రచారం ఆరంభంలోనేముగిసింది. అంటాల్యలో జరుగుతున్న ఈ పోటీల్లో అద్భుతమైన క్వాలిఫి కేషన్ రౌండ్ తర్వాత నాకౌట్ దశలోకి ప్రవేశించిన సాహిల్, మెక్సికోకు చెందిన జువాన్ గుటియెరెజ్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో 145-147 తేడాతో ఓడిపోయాడు. అలాగే రిషబ్ యాదవ్, చికిత్సా తానిపర్తి, పృథికా ప్రదీప్ కూడా తొలి నాకౌట్ రౌండ్‌లోనే నిష్క్రమించడంతో వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్లలో భారతదేశానికి పరిమిత ప్రాతినిధ్యం లభించింది. పురుషుల కాంపౌండ్ విభాగంలో సాహిల్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిలో ఒకడిగా నిలవగా, అనుభవజ్ఞురాలైన వెన్నం జ్యోతి సురేఖ భారత మహిళల విభాగానికి నాయకత్వం వహించింది. వ్యక్తిగత ఫలితాలు నిరాశపరిచినప్పటికీ, టీమ్ పోటీలలో భారత్ గట్టి పోటీలో ఉంది. సాహిల్ జాదవ్, గణేష్ మణి రత్నం తిరుమూరు, కుశాల్ దలాల్‌లతో కూడిన పురుషుల కాంపౌండ్ జట్టు క్వాలిఫికేషన్‌లో అనుకూలమైన స్థానాన్ని సంపాదించి, నాకౌట్ రౌండ్లలో ముందుకు సాగాలని చూస్తోంది. జ్యోతి సురేఖ వెన్నం, చికిత్సా తానిపర్తి, పృథికా ప్రదీప్‌లతో కూడిన మహిళల కాంపౌండ్ జట్టు కూడా సునాయాసంగా ముందంజ వేసి, పతక పోటీదారులలో నిలిచింది.




## స్పేస్‌ఎక్స్ ఐపిఒకు భారీ స్పందన..

### 75 బిలియన్ డాలర్ల ఆఫర్‌కు 250 బిలియన్ డాలర్ల డిమాండ్

**న్యూయార్క్,జూన్ 10:** అమెరికా అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ ఐపిఒకు పెట్టుబడిదారుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కంపెనీ సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న 75 బిలియన్ డాలర్లకు వ్యతిరేకంగా 250 బిలియన్ డాలర్లకు పైగా బిడ్ల డిమాండ్ నమోదైనటు బుధవారం వెల్లడించింది.ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓగా భావిస్తున్న ఈ ఇష్యూ ప్రస్తుతం నాలుగు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ముఖ్యంగా సౌదీ అరేబియా, కువైట్‌కు చెందిన సంపద నిధులు ఒక్కొక్కటి 1 బిలియన్ డాలర్ల నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు ఆర్డర్లు ఇచ్చినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. స్పేస్‌ఎక్స్ ప్రస్తుతం తన మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. కంపెనీ అధ్యక్షురాలు గ్వైన్ షాట్‌వెల్ మరియు ఆర్థిక విభాగాధిపతి బ్రెట్‌జాన్సన్‌లు న్యూయార్క్ నగరంలోని మోర్గాన్ స్టాన్లీ కార్యాలయంలో సుమారు 300 మంది సంస్థాగత పెట్టుబడిదారులతో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి డాన్ సిమ్‌కోవిట్జ్ ఆతిథ్యం ఇచ్చారు. ప్రస్తుతం వెల్లడవుతున్న సబ్‌స్క్రిప్షన్ గణాంకాలు తుది కేటాయింపులను సూచించవని, ఇవి పెట్టుబడిదారుల ఆసక్తిని మాత్రమే ప్రతిబింబిస్తాయని నిపుణులు చెబుతున్నారు. షేర్ ధర నిర్ణయించిన తర్వాతే తుది కేటాయింపులు ఖరారు కానున్నాయి. రోడ్‌షో ప్రదర్శనలు, ఐపీఓ పత్రాల్లో స్పేస్‌ఎక్స్ తన ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవ స్టార్‌లింక్ పటిష్టమైన వృద్ధిని ప్రస్తావించింది. రాకెట్ ప్రయోగాల వ్యాపారంలో తన ప్రత్యేకతను కూడా హైలైట్ చేసింది. గత మూడు సంవత్సరాల్లో భూమి కక్ష్యలోకి పంపిన మొత్తం భారంస్పేస్‌ఎక్స్‌లో అత్యధిక భాగం తమ రాకెట్ల ద్వారానే వెళ్లిందని కంపెనీ పేర్కొంది.ఇక కృత్రిమ మేధస్సు సామర్థ్యాలను ఆధారంగా చేసుకుని సుమారు 23 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశాలు ఉన్నాయని స్పేస్‌ఎక్స్ పెట్టుబడిదారులకు ఈ నేపథ్యంలో స్పేస్‌ఎక్స్ ఐపీఓకు లభిస్తున్న విశేష స్పందన ప్రపంచ పెట్టుబడి మార్కెట్ల దృష్టిని ఆకర్షిస్తోంది. కంపెనీ తుది ధర నిర్ణయం, షేర్ల కేటాయింపు ప్రక్రియపై ఇప్పుడు మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# సెన్సెక్స్, నిఫ్టీల్లో మిశ్రమ ట్రేడింగ్..

### లాభనష్టాలతో రెండో రోజు ఊగిసలాట..!




**ముంబై, జూన్ 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం రోజంతా ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రారంభంలో నమోదైన భారీ లాభాలు చివరి గంటలో కరిగిపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు లాభాలస్వీకరణకే మొగ్గుచూపించారు. అంతర్జాతీయ ధోరణులు క్షీణత, పశ్చిమాసియాలో మళ్లీ పెరిగిన భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డిమాండ్ మందగింపు ఆందోళనల నేపథ్యంలో మెటల్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు కొంత మద్దతు ఇవ్వగా, మెటల్, రియాల్టీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 64.42 పాయింట్లు పెరిగి 73,983.18 వద్ద ముగిసింది. నిఫ్టీ50 మాత్రం 27.15 పాయింట్లు క్షీణించి 23,214.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో భారతి ఎయిర్‌టెల్ 1.32 శాతం, ఇన్ఫోసిస్ 0.87 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.82 శాతం నష్టాలతో ఒత్తిడిని పెంచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.36 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.13 శాతం పడిపోయాయి. బీఎస్ఈలో 1,472 షేర్లు లాభపడగా, 2,748 షేర్లు నష్టపోయాయి. 161 షేర్లలో మార్పు లేదు. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.89 శాతానికి చేరుకుంది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ 95.28 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 2.19 శాతం క్షీణించి రూ.1,49,110కు పడిపోయింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.53 శాతానికి పెరిగింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 13 సెంట్లు పెరిగి 91.58 డాలర్లకు చేరుకుంది. యూరోపియన్ మార్కెట్లు నష్టాల్లోకి జారాయి. ఆసియా మార్కెట్లు కూడా అధికంగా నష్టాలతో ముగిశాయి. వాల్ స్ట్రీట్‌లో ఎస్అండ్‌పీ 500 సూచీ 0.26 శాతం, నాస్‌డాక్ 0.97 శాతం క్షీణించగా, డౌజోన్స్ మాత్రం 0.17 శాతం లాభపడింది. ఏజిస్ లాజిస్టిక్స్ షేరు 2.34 శాతం పెరిగింది. ఎలైట్‌కాన్ ఇంటర్నేషనల్ 19.18 శాతం ఎగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.82 శాతం పడిపోయింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మెటాతో కలిసి 168 మెగావాట్ల ఏఐ ఆధారిత డేటా సెంటర్ నిర్మించనున్నట్లు ప్రకటించింది.న్యూక్లియస్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ 14.56 శాతం జంప్ చేసింది. కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజరేషన్ 1.92 శాతం లాభపడింది. రూ.235.26 కోట్ల పెట్టుబడికి బోర్డు ఆమోదం తెలిపింది.డిక్సన్ టెక్నాలజీస్ 1.07 శాతం క్షీణించింది. జెమ్‌టెక్ టెక్నాలజీతో జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది.క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ 8.37 శాతం పెరిగింది. కాన్‌కార్డ్ బయోటెక్ 4.60 శాతం లాభపడింది. టోఫాసిటినిబ్ టాబ్లెట్లకు అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం లభించింది.ఆఫ్‌కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 4.61 శాతం ఎగిసింది. జేటీఎల్ ఇండస్ట్రీస్ 4.62 శాతం పడిపోయింది. మార్సన్స్ 2.64 శాతం, వెరాండా లెర్నింగ్ 2.03 శాతం తగ్గింది. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ షేర్లు బీఎస్ఈలో రూ.192 ఇష్యూ ధరతో పోలిస్తే 43.44 శాతం ప్రీమియంతో రూ.275.40 వద్ద లిస్టయ్యాయి. అనంతరం కొంత లాభాల స్వీకరణతో రూ.247.90 వద్ద ముగిశాయి. ఇది ఇష్యూ ధరపై 29.11 శాతం ప్రీమియాన్ని సూచిస్తోంది. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 38.23 లక్షలకుపైగా షేర్లు ట్రేడయ్యాయి.

## ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలు

### సెబీ రిజిస్టరు అయిన రీట్‌లకే బ్యాంకుల రుణాలు

### 80శాతం నగదురాబడుల అంచనాలకు అనుగుణంగానే పరపతి

### రిజర్వుబ్యాంకు కొత్త మార్గదర్శకాలు..

**ముంబై, జూన్ 10:** రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు రీట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు ఇన్విట్‌లకు బ్యాంకులు రుణాలు అందించే విధానంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ బుధవారం తుది మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ద్వారా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ పెట్టుబడి సాధనాల ఫైనాన్సింగ్‌కు స్పష్టమైన చట్రాన్ని రూపొందించింది.సవరించిన నిబంధనల ప్రకారం, భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ)లో నమోదై, గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ పొందిన రీట్‌లకు మాత్రమే బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.అలాగే ఇన్విట్‌లపై తమ రుణ ఎక్స్‌పోజర్‌కు సంబంధించి బ్యాంకులు బోర్డు ఆమోదించిన విధానాలను రూపొందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ విధానాల్లో రుణ అర్హత పరిశీలన, రుణ మంజూరు ప్రక్రియలు, అండర్‌రైటింగ్ ప్రమాణాలు, రిస్క్ మేనేజ్‌మెంట్, పర్యవేక్షణ వ్యవస్థలు వంటి కీలక అంశాలు తప్పనిసరిగా ఉండాలి.ఆదాయాన్ని అందించే రియల్ ఎస్టేట్ ఆస్తులను నగదీకరించేందుకు రీట్స్ కీలక వేదికలుగా ఎదుగుతున్న నేపథ్యంలో, సమర్థవంతమైన రుణ విధానాలను ప్రోత్సహిస్తూ వాటి నిధుల అవసరాలకు మద్దతు అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని ఆర్‌బీఐ పేర్కొంది.కొత్త నిబంధనల ప్రకారం,రీట్‌లు తీసుకునే రుణాలు సంబంధిత నియంత్రణ నిబంధనల్లో పేర్కొన్న అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా బ్యాంకులు నిర్ధారించాలి. రుణంగా పొందిన నిధులు అనుమతించిన అవసరాలకే వినియోగిస్తున్నాయో లేదో బ్యాంకులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది.ఆర్‌బీఐ నిర్దేశించిన ప్రకారం, లిస్టెడ్‌రీట్స్‌ల ఆస్తులలో కనీసం 80 శాతం పూర్తయి, ఆదాయం సమకూర్చే మరియు సానుకూల నగదు ప్రవాహాన్ని కలిగించే ఆస్తులు ఉం డాలి. అలాంటి రీట్‌లకు మాత్రమే బ్యాంకులు రుణాలు ఇవ్వగలవు.ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు ఆర్‌బీఐ రుణ పరిమితిని కూడా విధించింది. ఒక రీట్‌కు బ్యాంకు ఇచ్చే మొత్తం రుణ ఎక్స్‌పోజర్, ఆ రీట్‌ఆస్తుల విలువలో 49 శాతాన్ని మించకూడదు.రిస్క్ నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేస్తూ, రీట్,ఇన్విట్‌లకు మంజూరు చేసే అన్ని రుణాలు పూర్తిస్థాయి సెక్యూరిటీతో ఉండాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.ఈ తుది మార్గదర్శకాలు బ్యాంకులు, పెట్టుబడిదారులకు మరింత స్పష్టతను అందించడంతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతూ రుణాల లభ్యతను సమతుల్యం చేయడంలో సహాయపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్థిరమైన రాబడులు సృష్టించే రియల్ ఎస్టేట్ ఆస్తులను నిర్వహించే రీట్స్‌ల వ్యాపార నమూనాకు అనుగుణంగా బ్యాంకుల రుణ విధానాలను ఈ కొత్త చట్రం సమన్వయం చేస్తుంది.

## ఎరువుల సబ్సిడీ రెట్టింపుచేయాలని ఆర్థికశాఖకు ప్రతిపాదనలు



**న్యూఢిల్లీ, జూన్ 10:** పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎరువుల సబ్సిడీ కేటాయింపును రెట్టింపు చేయాలని కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీ కోసం రూ.1.77 లక్షల కోట్లు కేటాయించారు. అయితే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు వేగంగా పెరగడం, సరఫరా పరిస్థితులు కఠినంగా మారడంతో ఈ కేటాయింపును 100 శాతం పెంచాలని ఎరువుల శాఖ ప్రతిపాదించింది. ఎరువుల ధరలు పెరుగుతున్న వేగాన్ని దృష్టిలో ఉంచుకుని సబ్సిడీ కేటాయింపును రెట్టింపు చేయాలని ఎరువుల శాఖ కోరింది. ఒకవైపు సరఫరా పరిమితంగా ఉండగా, మరోవైపు డిమాండ్ బలంగా కొనసాగుతోందని ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, యూరియాపై సబ్సిడీ భారం గణనీయంగా పెరిగింది. ఒక్కో యూరియా సంచిపై ప్రభుత్వం అందించే సబ్సిడీ సుమారు రూ.2,900 నుంచి దాదాపు రూ.4,500కు పెరిగింది. దీంతో ప్రభుత్వ ఆర్థిక వనరులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది. ఎరువుల కోసం రైతులపై ఒక్క రూపాయి అదనపు భారం కూడా మోపలేం. అంతర్జాతీయ ధరలపై మనకు పెద్దగా నియంత్రణ లేదు. ఈ పరిస్థితి ప్రభుత్వ ఖజానాపై గణనీయమైన ఒత్తిడిని సృష్టిస్తోందని ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. అదే సమయంలో దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు కొనసాగుతుండటం వల్ల కొంత మేర ఒత్తిడి తగ్గే అవకాశం ఉందన్నా. భారత్ తన ఎరువుల అవసరాల్లో సుమారు 25 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. దేశీయ ఎరువుల ఉత్పత్తి 2024లో 50.95 మిలియన్ టన్నుల నుంచి 2025లో 52.5 మిలియన్ టన్నులకు పెరిగినప్పటికీ, అంతర్జాతీయ ధరల పెరుగుదల ప్రభావాన్ని పూర్తిగా ఎదుర్కోవడానికి ఇది సరిపోకపోవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. సబ్సిడీ భారం పెరుగుతున్నప్పటికీ, రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అదనపు నిధుల కోసం అనుబంధ డిమాండ్ ద్వారా నిధులు కోరే ప్రతిపాదన ప్రస్తుతం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రపంచ ఎరువుల మార్కెట్ మరింత సంక్లిష్టంగా మారుతోంది. పలువురు సరఫరాదారులు మార్కెట్‌కు దూరంగా ఉండటంతో అందుబాటులో ఉన్న వనరులు తగ్గుతున్నాయి. గత రెండేళ్లుగా మార్కెట్‌లో పెద్దగా కనిపించని చైనా మళ్లీ సరఫరాలు ప్రారంభించినప్పటికీ, సరఫరా వైపు అనిశ్చితులు ఇంకా కొనసాగుతున్నాయని ప్రభుత్వం చెపుతోంది. ఇక ఎరువుల ధరలతో పాటు వాతావరణ పరిస్థితుల ప్రభావంపై కూడా విధాన నిర్ణేతలు నిశితంగా గమనిస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయం, దేశ ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని జూలై తర్వాత సమీక్షించనున్నట్లు వర్గాలు తెలిపాయి. రుతుపవనాల పనితీరు, పంటల దిగుబడిపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం పెరిగింది.




వాణిజ్యం

## ఈసీఎల్జీఎస్ పథకం కింద రూ.48,484 కోట్ల రుణగ్యారంటీలు

**న్యూఢిల్లీ,జూన్ 10:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యవసర క్రెడిట్ లైన్‌హామీ పథకం ఇసిఎల్‌జిఎస్ అమలులో ఇప్పటివరకూ 1,06,549 గ్యారంటీలను జారీచేసినట్లు కేంద్రం ప్రకటించింది. ఈ పథకం కింద మొత్తం రూ.48,484 కోట్ల విలువైన గ్యారంటీలు మంజూరయ్యాయని 96శాతం ఎంఎస్ఎంఇలకు అందచేసినట్లు కేంద్రం ప్రకటించింది. మొత్తం గ్యారంటీ విలువల్లో ఎంఎస్ఎంఇ రంగం వాటా 86శాతంగా ఉంది. ఈ పథకం అమలులో ప్రభుత్వరంగ బ్యాంకులు కీలకపాత్రపోషిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎంఎస్ఎంఇకిందకురాణి దరఖాస్తులకు మంజూరైన రుణాలపై 90శాతం గ్యారంటీ కవరేజి ఇస్తున్నట్లు కేంద్రంపారిశ్రామిక శాఖ వివరించింది. అర్హులైన రుణ లబ్దిదారులకు రూ.2.55 లక్షలకోట్లవరకూ మొత్తం రుణాలు అందించాలనే ఈ అత్యవసర క్రెడిట్‌లైన్ గ్యారంటీ స్కీం ప్రధాన లక్ష్యంగా కేంద్రం వివరించింది.



## మూడో విడత పీఎల్ఐ స్కీంకు 96 పరిశ్రమల ఎంపిక రూ.12,822.67 కోట్ల పెట్టుబడుల రాక అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశీయ వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్ప త్తి ఆధారిత ప్రోత్సాహకపథకం మూడో విడ తలో మొత్తం 96 కంపెనీలను ఎంపిక చేసినట్లు కేంద్రం బుధవారం వెల్లడించింది. ఈ కంపెనీలు కలిపి రూ. 12,822.67 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపింది. టెక్స్‌టైల్స్ మంత్రి త్వ శాఖ ప్రకారం, పీఎల్ఐ టెక్స్‌టైల్స్ పథకం మూడో రౌండ్ కింద తాజాగా నిర్వహించిన సమావేశంలో 22 కొత్త దరఖాస్తుదారులకు ఆమోదం లభించింది. ఈ 22కొత్తగా ఎంపికైన సంస్థలు రూ. 2,339.14 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా నోటిపై చేసిన ఉత్పత్తుల విభాగంలో రూ.15,561.34 కోట్ల టర్నోవర్ సాధించడంతో పాటు వస్త్ర పరిశ్రమ అంతటా 36,217 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అంచనా వేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14